thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 19 కరీంనగర్ ఆదివారం, 30 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం..

ఢిల్లీ వాసులకు కష్టకాలం మొదలైంది. ప్రతి ఏడాది చలికాలంలో ఢిల్లీ వాసులు తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు పడుతుంటారు. అయితే ఈ ఏడాది వేసవి మొదలయ్యాక ఢిల్లీలో వాయు కాలుష్యం పెరిగిపోయింది. ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ తక్కువగా ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. తాజాగా ఢిల్లీలోని ఆనంద్ విహార్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 334గా నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది చలి తీవ్రత పెరగడం, వాయు వేగం తగ్గడంతో ఢిల్లీ, చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి తగ్గిపోతోంది. పంజాబ్, హర్యానాలో పంట వ్యర్థాల దహనం వల్ల రాజధాని నగరం ఢిల్లీని పొగ అలిమేస్తోంది. దీంతో రాజధాని ప్రాంత ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు.

# 78 గంటలు 47 మంది మావోయిస్టుల కాల్చివేత

## చత్తీస్ ఘడ్ సైన్యం కొత్త రికార్డు
## మృతుల్లో ఇద్దరు కీలక నేతలు
## మొన్న సుధాకర్,ఇప్పుడు జగదీష్




**రాయపూర్ నుండి ప్రత్యేక ప్రతినిధి** ఆపరేషన్ కగార్ ఆరంభించినప్పటి నుండి గడిచిన 72 గంటల్లో భారత సైన్యం కొత్త రికార్డులు సృష్టించింది. కేంద్రమంత్రి హెూం మంత్రి అమిత్ షా ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ నిత్యం గాలింపు చర్యలు, కూంబింగ్ లతో అప్రమత్తమవుతున్న కేంద్ర పోలీస్ బలగాలు మావోయిస్టుల కదలికలపై గట్టిగా ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఎన్కౌంటర్ల పరంపరన కొనసాగిస్తున్నారు. పదుల సంఖ్యలో ఉన్న మావోయిస్టులను ఏరివేసేందుకు వేల సంఖ్యలో సైన్యం రంగంలో దిగి మావోయిస్టులను మట్టుపెడుతున్నారు. ప్రతి ఆపరేషన్ వివిధ జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు ప్లస్ సైనికులు కంబైన్డ్ ఆపరేషన్ నిర్వహిస్తూ పెద్ద ఎత్తున మావోయిస్టులను కాల్చి చంపుతున్నారు. ఇంకా సూటిగా చెప్పాలంటే దండకారణ్యం లో కనిపిస్తే కాల్చివేత కొనసాగుతున్నట్లు కనిపిస్తుంది. చత్తీస్గడ్ ప్రాంతం నెత్తుటి తడి ఆరకముందే మళ్లీ రక్తం చిందు తుంది. మొన్నటి ఎన్కౌంటర్ కు సంబంధించి మృతదేహాలను గుర్తించే పని పూర్తికాకముందే మరో జిల్లాలో ఎన్కౌంటర్ కొనసాగింది. బీజాపూర్ జిల్లాలోని గంగలూరు ప్రాంతంలో, అటు దంతే వాడ జిల్లాలో జరిగిన ఎన్కౌంటర్లో మొత్తం 30 మంది మావోయిస్టులను సైనిక బలగాలలోని వివిధ శాఖల చెందిన వారు సమితి ఆపరేషన్ నిర్వహించి 26 మందిని ఒకచోట నలుగురిని మరోచోట 30 మందిని ఒకేరోజు భారత సైన్యం కాల్చి చంపింది ఆ 30 మందిలో ఒకేఒక్కడు తెలంగాణ ప్రాంతంలోని కాజీపేట శివారులో తరాలపల్లికి చెందిన సుధాకర్ అలియాస్ సారయ్య ఉన్నారు సారయ్య చత్తీస్గడ్ రాష్ట్ర కమిటీ నాయకుడు జనతన సర్కార్లోని విద్యా వ్యవస్థ అమలపై ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు అలాంటి కీలక నాయకుడిని చత్తీస్ఘడ్ పోలీసులు సైనికులు సంయుక్త ఆపరేషన్లో మట్టుపెట్టారు ఇక మిగిలిన వారంతా జనతనలోని ప్లాటూన్ సభ్యులుగా భావిస్తున్నారు. జనతన సర్కార్ అంటే తెలంగాణలో ఒకప్పటి మావోయిస్టు పార్టీ మిలిటెంట్ గా ఉండే వారి మాదిరిగా పనిచేస్తున్న జనతన సర్కార్ సభ్యులే అంటారు. వీళ్లే పెద్ద ఎత్తున ఈ ఎన్ కౌంటర్ లో మరణిస్తున్నట్లు అభిప్రాయపడుతున్నారు. ఇంకా లోతుగా చెప్పాలంటే దాదాపు అందరూ ఆదివాసి బిడ్డలేనని తమ గూడాల నుండి ఇళ్ల నుండి తీసుకెళ్లి చంపుతున్నట్లు ఆదివాసి పల్లె ప్రాంతాలకు చెందిన వారు ఆవేదన చెందుతున్నారు. నక్సలైట్లతో గతంలో సంబంధం ఉండి మామూలు జీవితం గడుపుతున్న వారిని సైతం ఈ ఎన్కౌంటర్లో బలి చేస్తున్నారని అంటున్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన సుధాకర్ కు షెల్టర్ ఇచ్చిన ఇద్దరిని పట్టుకెళ్ళి సుధాకర్తో పాటు కాల్చి చంపారని మద్దెడు ప్రాంతంలోని ఆదివాసీలు తెలిపారు వాస్తవానికి సుధాకర్ చాలారోజులుగా అనారోగ్యంతో ఉన్నారని ఆ గ్రామంలో షెల్టర్ తీసుకొని చికిత్స పొందుతున్న సుధాకర్ను వందలాది మంది పోలీసులు చుట్టుముట్టి గ్రామానికి చెందిన మరో 15 మందిని పట్టుకెళ్ళిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ 15 మందిలో ఏడుగురిని తెల్లారి విడిచి పెట్టారని మరో ఎనిమిది మందిని దంతేవాడ పోలీసులు నిర్బంధంలో ఉంచుకున్నారని చెప్పారు.అయితే సుధాకర్ తో పాటు తీసుకెళ్లిన ఇద్దరిని సుధాకర్ను కలిపి ముగ్గురిని 15 నిమిషాల లోపే కాల్చి చంపారని చెబుతున్నారు. బీజాపూర్ ఎన్కౌంటర్ ముగిసిన 72 గంటల లోపే తిరిగి శనివారం ఉదయం సుప్మా జిల్లాలో మరో భారీ ఎన్కౌంటర్ చోటు చేసుకున్నది. ఈ ఎన్కౌంటర్లో సైతం 17 మంది మరణించినట్లు సైన్యం ప్రకటించింది.

చతిస్గడ్ పోలీసులు ప్రత్యేక బలగాలు బి ఆర్ జి బృందం సైనికులు శుక్రవారం రాత్రి నుండి ఆపరేషన్ ప్రారంభించి నక్సలైట్ల స్థావరానికి చేరుకొని శనివారం ఉదయం నుండి కాల్పులు ప్రారంభించి మధ్యాహ్నా వరకు 17 మంది మావోయిస్టులను కాల్చిచంపారు. ఏడాదికాలంగా ఆపరేషన్ కగారు కొనసాగుతుండగా ఈ కొత్త సంవత్సరంలోనే ఇప్పటివరకు 132 మంది ని సైన్యం కాల్చి చంపింది. ముఖ్య నేతలు ఇద్దరిపై ఒక్కొక్కరిపై 25 లక్షల రివార్డు ఉన్నది. ఇక మిగతా వారి వివరాలు మాత్రం ఇప్పటివరకు తెలియపరచలేదు. మొన్న మరణించిన సారన్న కు 25 లక్షలు, ఇవ్వాల నేల కొరిగిన జగదీష్ పై 25 లక్షలు రివార్డు కలిగిన ఇద్దరు సీనియర్ మావోయిస్టు నాయకులను ఆ పార్టీ కోల్పోయింది.






## ప్రారంభానికి సిద్ధమైన పంబన్ బ్రిడ్జి.. ఆ రోజునే జాతికి అంకితం చేయనున్న మోదీ..!

ఏప్రిల్ 6న శ్రీ రామనవమి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రామేశ్వరంలో పర్యటించనున్నారు.. ఈ సందర్భంగా ఆయన కొత్త పంబన్ రైల్వే వంతెనను ప్రజలకు అంకితం చేస్తారు. తమిళనాడులోని రామేశ్వరం– తాంబరం మధ్య బ్రిటిష్ కాలంలో నిర్మించిన పంబన్ బ్రిడ్జి స్థానంలో కొత్త వంతెన సిద్ధమైంది. పాత వంతెన స్థానంలో కొత్త పంబన్ వంతెన వస్తుంది. పంబన్ బ్రిడ్జి పాతబడి పోవడంతో కేంద్రం కొత్త వంతెనను నిర్మించింది. పనులు పూర్తి కావడంతో అధికారులు శనివారం ట్రయల్ రన్ నిర్వహించారు.

ప్రధాని మోదీ చేతుల మీదుగా ఏప్రిల్ 6న ఈ వంతెనను ప్రారంభించనున్నారు. పాత పంబన్ వంతెనను బ్రిటిష్ వారు 1914 సంవత్సరంలో నిర్మించారు. తుప్పు పట్టడం వల్ల 2022 సంవత్సరంలో దీనిని మూసివేశారు. పాత పంబన్ వంతెన స్థానంలో కొత్త పంబన్ వంతెన నిర్మించబడింది. ఈ వంతెన 2.5 కిలోమీటర్ల కంటే ఎక్కువ పొడవు ఉంది. దీనిని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ రూ. 535 కోట్ల వ్యయంతో నిర్మించింది. ఇందుకు సంబంధించి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ %శ% లో ఇలా రాశారు, ఇది (పాంబన్ వంతెన) హై–స్పీడ్ రైళ్లు, ట్రాఫిక్ రద్దీని నిర్వహించడానికి నిర్మించబడింది. కొత్త పాంబన్ వంతెన ఉపయోగకరంగా ఉండటమే కాదు, ఇది పురోగతికి చిహ్నం. ఇది ఆధునిక ఇంజనీరింగ్‌తో ప్రజలను, ప్రదేశాలను కలుపుతుంది.. అంటూ వ్యాఖ్యానించారు. రామేశ్వరం, ధనుష్కోడికి చేరుకోవడానికి గతంలో రైల్వే పంబన్ వంతెన ఏకైక మార్గం. ఈ వంతెనను 1914 లో నిర్మించారు. తరువాత 1988 సంవత్సరంలో దాని పక్కనే ఒక రోడ్డు వంతెన నిర్మించబడింది. 1988 వరకు మండపం, రామేశ్వరం ద్వీపం మధ్య రైలు మార్గం మాత్రమే ఏకైక రవాణాగా ఉండేది. కొత్త వంతెన ఎలక్ట్రోమెకానికల్ వ్యవస్థ ద్వారా నిర్వహించబడుతుంది. దీనివల్ల సముద్రంలో ఓడల రాకపోకలకు సులభతరం అవుతుంది. ఓడ వచ్చే సమయానికి వంతెనను పైకి లేపుతారు. వంతెనను ఎత్తడానికి 5 నిమిషాల సమయం పడుతుంది. ఒకే ఒక్క మనిషి దీన్ని ఎత్తగలడు. అంటే, వంతెనను ఎత్తడానికి ఎక్కువ మంది అవసరం ఉండదు. అయితే, గాలి వేగం సమస్య కూడా ఉంది. సముద్రంలో గాలి వేగం గంటకు 58 కి.మీ లేదా అంతకంటే ఎక్కువగా ఉన్నప్పుడు వంతెన ఎత్తే వ్యవస్థ పనిచేయదు. ఇలాంటి పరిస్థితులు అక్టోబర్, ఫిబ్రవరి మధ్య జరుగుతుందని అధికారులు చెప్పారు. ఈ నెలల్లో గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెప్పారు.

## హైదరాబాద్ లో ట్రాఫిక్ కష్టాలకు చెక్..
## సీఎం రేవంత్ సంచలన నిర్ణయం

హైదరాబాద్ నగరంలో రోజురోజుకీ ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోతున్నాయి. ట్రాఫిక్ సమస్య కారణంగా నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా అనుసంధాన (లింక్) రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఈ మేరకు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. హెచ్ఆర్‌డీసీఎల్ తో జరిపిన సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ నగరంతో పాటు హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్ఆర్‌డీసీఎల్)



ఆధ్వర్యంలో చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 49 రోడ్ల నిర్మాణం,విస్తరణపై సీఎం రేవంత్ అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల మధ్య ప్రజలు ఎటువంటి అవాంతరాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారులు నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇంటర్ లింకింగ్ రహదారుల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రహదారుల విస్తరణ విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచనలు చేశారు. ఆయా రహదారుల నిర్మాణంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు వారికి ట్రావెలింగ్ సమయం కలిసి వచ్చేలా ఉండాలన్నారు. ఈ క్రమంలో అదనపు భూసేకరణకు కొంత అధిక వ్యయమైనా వెనుకాడవద్దని స్పష్టం చేశారు.




## పెట్టుబడులే లక్ష్యంగా...
## జపాన్‌లో పర్యటించనున్న సీఎం

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు. దాదాపు ఎనిమిది రోజులపాటు జపాన్ పర్యటనలో ఉంటారు సీఎం రేవంత్ రెడ్డి. జపాన్ లోని కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ ఆధారితన అభివృద్ధితో పాటు తెలంగాణకు పెట్టుబడులను తీసుకొచ్చే లక్ష్యంతో ఆయన ఈ పర్యటనకు వెళున్నారు. తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన సందర్భంగా జపాన్ సాంకేతిక అభివృద్ధిని అధ్యయనం చేయడంతోపాటు స్కిల్ యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిందిగా వారిని కోరే ఛాన్స్ ఉంది. ఒసాకాలో జరిగే ఇండస్ట్రియల్ ఎక్స్ పోలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారు. రాష్ట్రంలోని అనుకూల పరిస్థితులపై జపాన్ కంపెనీలకు వివరించి రాష్ట్రంలో పెట్టుబడులకు ఆహ్వానించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు కూడా జపాన్ వెళ్లనున్నారు. గతంలో ముఖ్యమంత్రి అమెరికా పర్యటన విజయవంతమైంది. తెలంగాణలో పెట్టుబడులకు వివిధ రంగాల్లో ప్రపంచంలో పేరొందిన భారీ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈసారి పర్యటనలో జపాన్ సంస్థల పెట్టుబడులతో రాష్ట్రంలో ఆర్థిక అభివృద్ధి పెరగడంతోపాటు రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఏప్రిల్ 15 నుంచి 23 వరకు జపాన్‌లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఏప్రిల్ 15 లోపు డీ లిమిటేషన్‌పై హైదరాబాద్‌లో రెండో మీటింగ్ నిర్వహించే యోచనలో ఉన్నారు. ఈ సమావేశం ముగిసిన వెంటనే ఆయన ఢిల్లీ బయల్దేరి అక్కడి నుంచి జపాన్ పర్యటనకు వెళ్తారని అధికార వర్గాలు తెలిపారు.



## రూ.1000 కోట్లు దాటిన ఆస్తిపన్ను వసూళ్లు..

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై 'వన్ టైమ్ సెటిల్‌మెంట్'కు తెలంగాణ ప్రభుత్వం అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. జీహెచ్ఎంసీ తరహాలో ఆస్తి పన్నుపై వడ్డీలో 90శాతం రాయితీ ఇవ్వాలని పురపాలక శాఖ నిర్ణయించింది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో ఆస్తిపన్ను వసూళ్లు రూ.వెయ్యి కోట్లు దాటిందని రాష్ట్ర పురపాలక శాఖ తెలిపింది. రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కలిపి ఇప్పటివరకు రూ.1010 కోట్ల మేర ఆస్తిపన్ను వసూలైనట్లు వెల్లడించింది. మార్చి 31 నాటికి ఆస్తిపన్ను బకాయిలపై 10 శాతం వడ్డీ చెల్లించిన వారికి ఓటీఎస్ వర్తిస్తుందని పురపాలకశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో మార్చి 30, 31న సెలువులైనప్పటికీ ప్రజలు ఆస్తి పన్ను చెల్లించవచ్చని తెలిపింది.

రెండు రోజుల్లో ఆస్తిపన్ను చెల్లించి వడ్డీపై 90శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలని పురపాలక శాఖ సూచించింది.

## ప్రజా ప్రయోజనాలే ముఖ్యం.. ఖర్చుకు వెనకాడొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా లింక్ రోడ్లు నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై సీఎం సమీక్ష నిర్వహించారు. హెచ్ఎండీఏ పరిధిలోని 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై ఆయన పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల అనుసంధానం, ఆటంకాలు లేని రాకపోకలకు వీలుగా రహదారులు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు.

అదనపు భూసేకరణకు విషయంలో ఖర్చుకు వెనకాడవద్దని అన్నారు. ఈ సమీక్షలో సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రాజు, సీఎస్ శాంతి కుమారి, సీఎం కార్యాలయ ఉన్నతాధికారులు వి.శేషాద్రి, చంద్రశేఖర్ రెడ్డి, అజిత్ రెడ్డి, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## హిమాచల్‌తో విద్యుత్ ఒప్పందం.. గొప్ప ముందడుగు: భట్టి విక్రమార్క



హైదరాబాద్: తెలంగాణలో వేగంగా పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ- 2025' ప్రకారం పర్యావరణ పరిరక్షణకు హిమాచల్ ప్రదేశ్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం గొప్ప ముందడుగని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ భద్రతను పెంచుకునే అంశంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర భాగస్వామ్యంతో ఆర్థికంగా మేలైనది, స్వచ్ఛమైన విద్యుత్‌ను పొందేందుకు ఈ ఒప్పందం గొప్ప ముందడుగన్నారు. ఇవాళ హిమాచల్ రాజధాని శిమ్లాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖుతో సమావేశమైన భట్టి.. విద్యుత్ ఒప్పందం కుదుర్చుకున్నారు. "థర్మల్ పవర్‌తో పోల్చినప్పుడు హైడల్ పవర్ ఉత్పత్తి (జల విద్యుత్) వ్యయం తక్కువగా ఉంటుంది. అంతేకాకుండా థర్మల్ పవర్ ఉత్పత్తి ఖర్చు ఏటా పెరుగుతూ ఉండగా.. హైడల్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు క్రమంగా తగ్గుతూ వస్తోంది.

ఎక్కువ జీవనదులు ఉన్న రాష్ట్రం కావడంతో సంవత్సరంలో 9 నుంచి 10 నెలల పాటు నిరంతర హైడల్ పవర్ (జల విద్యుత్) ఉత్పత్తికి అనువుగా ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ ప్రజలకు తక్కువ ధరకు, పర్యావరణ హితమైన విద్యుత్‌ను అందించేందుకు అవకాశం ఉంటుంది. ఈ ప్రాజెక్టులను తెలంగాణ జెన్‌కో నామినేషన్ విధానంలో చేపడుతుంది" అని భట్టి తెలిపారు.




## ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ విచారణకు హాజరైన శ్రవణ్‌రావు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు శ్రవణ్‌రావు సిట్ విచారణకు హాజరయ్యారు. శనివారం తెల్లవారుజామున దుబాయ్ నుంచి హైదరాబాద్ చేరుకున్న ఆయన.. విచారణ కోసం జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి వచ్చారు. విచారణకు సహకరించాలని శ్రవణ్‌రావును సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించింది. ఆయన్ను అరెస్టు చేయొద్దని తెలిపింది. శ్రవణ్‌ను విచారిస్తే కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడిగా ఉండి.. అమెరికాలో తలదాచుకున్న మీడియా సంస్థ నిర్వాహకుడు అరువెల శ్రవణ్‌రావుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇటీవల నోటీసు జారీ చేసింది. ఈనెల 29న(శనివారం) తమ ఎదుట విచారణకు హాజరు కావాలని అందులో సూచించింది. నోటీస్ ప్రతిని ఈనెల 26నే హైదరాబాద్‌లోని ఆయన కుటుంబసభ్యులకు అందించింది. గతేడాది మార్చి 10న పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైన వెంటనే ఆయన తొలుత లండన్‌కు.. అక్కడి నుంచి అమెరికాకు వెళ్లిపోయారు. సిట్ విచారణకు రాకుండా అక్కడే ఉండిపోయారు. ఇటీవలే ఆయనపై రెడ్‌కార్నర్ నోటీస్ సైతం జారీ అయింది. తనకు ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ తెలంగాణ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఇటీవలే సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. దానిపై ఈనెల 24న జరిగిన విచారణలో అరెస్ట్ చేయకుండా ఆయనకు మధ్యంతర ఉపశమనం లభించింది. పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని షరతు విధించింది. అందుకు పిటిషనర్ న్యాయవాది అంగీకరిస్తూ.. అవసరమైతే ఆయన 48 గంటల్లోగా భారత్‌కు తిరిగి వస్తారని ధర్మాసనానికి హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలోనే 72 గంటల గడువు విధిస్తూ శనివారం తమ వద్దకు విచారణకు రావాలని సిట్ స్పష్టం చేసింది. దీంతో ధర్మాసనానికి హామీ ఇచ్చినట్లుగా శ్రవణ్‌రావు విచారణకు హాజరయ్యారు.

## హైదరాబాద్ గుడిమల్కాపూర్‌లో కాల్పుల కలకలం.. అదుపులో నిందితుడు



హైదరాబాద్: నగరంలోని గుడిమల్కాపూర్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్‌లో 'ఆనం మీర్జా' ఎక్స్‌పో జరుగుతోంది. ప్రదర్శనలో ఇద్దరు దుకాణదారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే వారిలో ఒక దుకాణదారుడు గాల్లోకి కాల్పులు జరిపాడు. దీంతో ఎక్స్‌పోకు వచ్చిన సందర్శకులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అక్కడి నుంచి పరుగులు తీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. గాల్లోకి కాల్పులు జరిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు రెండు రౌండ్లు కాల్పులు జరిపినట్లు పోలీసులు నిర్ధరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## సిట్ చేతికి 'బెట్టింగ్ యాప్ కేసులు : ఏం జరుగనుంది?

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం చట్టవిరుద్ధ బెట్టింగ్ యాప్‌లపై ఉక్కుపాదం మోపింది. టాలీవుడ్ ప్రముఖ నటులు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్స్, యూట్యూబర్స్ పాల్గొన్న కేసులతో సహా అన్ని సంబంధిత కేసులను ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని సెషన్స్ కోర్టులో జరిగిన విచారణ సందర్భంగా ఈ విషయం వెల్లడైంది. ఈ పరిణామం ఈ వేదికల వ్యాప్తిని రాష్ట్ర ప్రభుత్వం ఎంత తీవ్రంగా పరిగణిస్తుందో తెలియజేస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రాష్ట్ర అసెంబ్లీలో చట్టవిరుద్ధ బెట్టింగ్ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసిన తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ ఈ కేసును చురుకుగా పర్యవేక్షిస్తుండటం ప్రభుత్వ నిబద్ధతను మరింత స్పష్టం చేస్తుంది. గతంలో ఈ కేసులు హైదరాబాద్‌లోని పంజాగుట్ట , మియాపూర్ పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయి. అయితే ఈ బెట్టింగ్ యాప్‌ల వెనుక ఉన్న నెట్‌వర్క్ యొక్క సంభావ్య పరిధి.. సంక్లిష్టతను, అలాగే ప్రముఖ వ్యక్తుల ప్రమేయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కు అప్పగించాలని నిర్ణయించింది. దీంతో ఈ బెట్టింగ్ విషయంలో మరింత సమగ్రమైన విస్తృతమైన దర్యాప్తుకు ప్రభుత్వం మొగ్గుచూపింది.. స్టార్ సెలబ్రిటీలు గతంలో ఈ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు వార్తల్లో నిలిచారు. అయితే, ఇద్దరు నటులు తమ నిర్దోషిత్వాన్ని గతంలోనే ప్రకటించారు. వారు కొన్ని సంవత్సరాల క్రితం నటించిన ప్రకటనలు ఇప్పుడు ప్రసారం కావడం లేదని, అందువల్ల ప్రస్తుత సమస్యకు వాటి ప్రాముఖ్యత తగ్గిపోయిందని వారి వాదన. అంతేకాకుండా తమ కేసులో అవసరమైన చట్టపరమైన పత్రాలు ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వారు చెబుతున్నారు. సెలబ్రిటీల వాదనలు ఎలా ఉన్నప్పటికీ కేసులను సిట్‌కు బదిలీ చేయడం ద్వారా ప్రభుత్వం ఈ సమస్యపై అన్ని అంశాలను, ఈ వేదికలను ప్రోత్సహించిన వ్యక్తుల పాత్రతో సహా పూర్తిగా పరిశీలించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. సిట్, దాని ప్రత్యేక వనరులు , ఆదేశంతో ఈ బెట్టింగ్ యాప్‌ల కార్యకలాపాలను మరింత లోతుగా పరిశీలిస్తుంది. వాటి వెనుక ఉన్న సూత్రధారులను గుర్తిస్తుంది సోషల్ మీడియా ప్రభావశీలులు , సెలబ్రిటీలను కూడా విచారించే అవకాశం ఉంది. ఇప్పుడు ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ దర్యాప్తును ఎలా ముందుకు తీసుకువెళుతుందనే దానిపై ఆసక్తి నెలకొంది. వారు ఏ విధానాన్ని అవలంబిస్తారో.. తదుపరి విచారణ కోసం సంబంధిత సెలబ్రిటీలను పిలుస్తారా లేదా అనేది చూడాలి.

స్టార్ హీరోలు తమ ప్రకటనల చట్టబద్ధత గురించి చేసిన న్యాయపరమైన వాదనలు సిట్ పరిశీలనలో ముఖ్యమైన అంశంగా ఉంటాయి. ఈ పరిణామం చట్టవిరుద్ధ బెట్టింగ్ యాప్‌లను ఎదుర్కోవడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో ఒక ముఖ్యమైన ముందడుగు. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించడం ద్వారా బెట్టింగ్ యాప్ ల ప్రచారం, వ్యాప్తికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించిన వారిని టార్గెట్ చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా గణనీయమైన ప్రజాదరణ కలిగిన వారిని కూడా బాధ్యులను చేయాలనే బలమైన సంకల్పాన్ని సూచిస్తుంది. రాబోయే రోజుల్లో ఈ కీలకమైన దర్యాప్తు ఎలా ముందుకెళుతుందన్నది వేచిచూడాలి.



## స్వచ్ఛందంగా అమెరికాను వీడండి

వాషింగ్టన్: క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఈమెయిల్స్ పంపినట్లు సమాచారం. కేవలం ఆందోళనల్లో పాల్గొన్నవారికే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన విద్యార్థులకు కూడా హెచ్చరిక సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. ఈ జాబితాలో కొందరు భారతీయ విద్యార్థులు సైతం ఉండే అవకాశముంది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంతో అక్కడి విద్యార్థులు ఆన్‌లైన్‌లో యాక్టివ్‌గా ఉండటం వల్ల కలిగే పరిణామాలు, భావ ప్రకటనా స్వేచ్ఛ పరిమితులపై ఆందోళన రేకెత్తుతోంది. జాతి వ్యతిరేక ప్రచారానికి పాల్పడుతున్న వారి సోషల్ మీడియా ఖాతాలను అమెరికా విదేశాంగశాఖ జల్లెడ పడుతోంది. ఒకవేళ అదే నిజమని తేలితే ఆ విద్యార్థులకు అమెరికాలో చదువుకునే వీల్లేకుండా తక్షణమే స్వదేశానికి పంపించే యోచనలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈమేరకు అమెరికా విదేశాంగశాఖ, కాన్సులేట్ అధికారుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువరించింది. 'బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ వీసా' నుంచి విదేశీ విద్యార్థులకు ఈమెయిల్స్ వెళ్తున్నాయి. "యునైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్, అమెరికా జాతీయచట్టంలోని సెక్షన్ 221(%ఱ%) ప్రకారం.. మీ వీసా రద్దయింది. ఈ మేరకు స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్‌కు బాధ్యత వహించే అధికారులకు సమాచారం వెళ్లింది. మీ వీసా రద్దు అంశం గురించి సంబంధిత కళాశాల యాజమాన్యానికి వారు తెలియజేయవచ్చు" అన్నది మెయిల్ సారాంశం. సరైన అనుమతి లేకుండా దేశంలో ఉంటే నిర్బంధించడంతోపాటు భవిష్యత్‌లో వీసా రాకుండా చేస్తామని హెచ్చరిక సందేశాల్లో అమెరికా విదేశాంగశాఖ పేర్కొంది. హెచ్చరిక సందేశాలు వచ్చినవారు.. తమ స్వదేశాలకు వెళ్లేందుకు సీబీపీ హెూమ్ యాప్ ఉపయోగించుకోవచ్చని తెలిపింది.



## ప్రయాణ వేళల్లో మార్పులు.. ఆ ఆఫర్ మరో ఏడాది పొడిగింపు

హైదరాబాద్: మెట్రో ప్రయాణ వేళల్లో మార్పులు చేసినట్లు హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం రాత్రి 11 గంటల వరకే నడుస్తున్న మెట్రోరైళ్లు.. ఏప్రిల్ 1 నుంచి రాత్రి 11:45 గంటల వరకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అంటే టెర్మినల్ స్టేషన్ నుంచి చివరి రైలు ఇకపై రాత్రి 11.45 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే ఈ మారిన వేళలు అమల్లో ఉంటాయని చెప్పారు.

టెర్మినల్ స్టేషన్‌ల నుంచి ఆదివారం మొదటి రైలు ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

**సూపర్ సేవర్ హాలిడే ఆఫర్.. ఏడాది పొడిగింపు...** ఏప్రిల్ 2024లో ప్రారంభమైన సూపర్ సేవర్ హాలిడే ఆఫర్, ఆఫ్-పీక్ వేళల్లో స్మార్ట్ కార్డులపై ఇచ్చే తగ్గింపు మార్చి 31తో ముగియనుంది. ఈ ఆఫర్‌తో 20 ట్రిప్పులకు డబ్బులు చెల్లించి 30 ట్రిప్పులు ప్రయాణించేలా అవకాశం కల్పించారు.

తాజాగా ఈ ఆఫర్‌ను మరో ఏడాది పొడిగిస్తూ హైదరాబాద్ మెట్రో నిర్ణయం తీసుకుంది. 2026 మార్చి 31 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని సంస్థ పేర్కొంది.

## తొలి తెలుగు సినీ కథా నాయకురాలు కమలాబాయి - మార్చి 30... సురభి కమలాబాయి వర్ధంతి



సురభి కమలాబాయి (1907 – 1971) తొలి తెలుగు సినిమా నటీమణి, గాయని. ఆమె 1931లో హెచ్.ఎం.రెడ్డి నిర్మించిన తొలి తెలుగు టాకీ చిత్రము భక్తప్రహ్లాదలో లీలావతి పాత్ర ధరించారు. కమలాబాయి 1907లో సురభి నాటక కళాకారుల కుటుంబములో జన్మించారు. ఆమె తండ్రి కృష్ణాజీరావు. తల్లి వెంకూబాయి కమలాబాయిని గర్భవతిగా ఉండి ఒక నాటకములో దమయంతి పాత్ర వేస్తున్నప్పుడు పురిటినొప్పులు రాగా తెరదించి ఆ రంగస్థలము పైనే కమలాబాయిని ప్రసవించడం విశేషం. ప్రేక్షకులు ఇదికూడా నాటకములో భాగమనుకొన్నారు. అసలు విషయం తెలిసిన తర్వాత ప్రేక్షకులు చంటిబిడ్డ మీద డబ్బుల వర్షం కురిపించారు. రంగస్థల కుటుంబంలో పుట్టిన కమలాబాయికి చిన్నప్పటి నుండే నటన అలవాటయింది. బాల్యంలో కృష్ణుని, ప్రహ్లాదుని పాత్రలు వేస్తుండే వారు. యుక్త వయసు వచ్చిన తర్వాత మగ పాత్రలు ఆపేసి ఆడ పాత్రలు ధరించడం ప్రారంభించారు. అందరూ మహిళలే నటించి విజయ వంతమైన సావిత్రి నాటకంలో ఆమె సావిత్రి పాత్రను పోషించారు. బాల్యం నుంచి రంగస్థల నటిగా ఎదుగుతూ హెచ్.ఎం.రెడ్డి రూపొందించిన తొలి టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద'లో హిరణ్య కశపునిగా నటించిన మునిపల్లె వెంకట సుబ్బయ్య సరసన లీలావతిగా ఆమె పరిచయమయ్యారు. సర్వోత్తమ బదామి దర్శకత్వంలో సాగర్ ఫిలింస్ రూపొందించిన 'పాదుకా పట్టాభిషేకం'లో సీతగా అద్దంకి శ్రీరామమూర్తి సరసన, సాగర్ ఫిలింస్ బదామి సర్వోత్తంతో రూపొందించిన 'శకుంతల'లో శకుంతలగా యడవల్లి సూర్యనారాయణ తో నటించారు. బి.వి.రామానందం దర్శకత్వంలో కృష్ణా ఫిలింస్ నిర్మించిన 'సావిత్రి'లో సావిత్రిగా టైటిల్ రోల్ పోషించారు. సరస్వతి సినీ టోన్ నిర్మించిన 'పృథ్వీపుత్ర'లో ఓ ముఖ్య పాత్ర పోషించారు. కమలాబాయి ప్రతిభ గురించి విని, ప్రత్యక్షంగా చూసి ముగ్ధుడైన సాగర్ ఫిల్మ్ అధినేత కమలాబాయిని బొంబాయికి ఆహ్వానించారు. అక్కడే పదేళ్లపాటు ఉండి సాగర్ ఫిల్మ్ నిర్మించిన సినిమాలలో నటించింది. మహాభారతం వంటి 25 చిత్రాలలో ఆమె నటించారు. 1939లో విడుదలైన భక్తజయదేవ సినిమాతో మళ్లీ తెలుగు సినిమాలలో నటించడం ప్రారంభించారు. విశాఖ పట్నం లోని ఆంధ్రా సినీ టోన్ అనే చిత్ర నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న ఆ చిత్రాన్ని తెలుగు, బెంగాలీ భాషలలో నిర్మించారు. ఈ రెండు భాషలలోనూ కమలాబాయే కథానాయకి. ఆ చిత్రంలో రెంటచింతల సత్యనారాయణ, సురభి కమలాబాయి ముఖ్య పాత్రధారులు. ఆ చిత్రానికి హిరేన్ బోస్ అనే బెంగాలీ ఆయన దర్శకుడు. అయితే ఆయన సాంకేతిక పరిజ్ఞానం అంతంత మాత్రం కావడంతో చిత్ర నిర్మాణం సరిగా సాగలేదు. నిర్మాణం ఆగిపోయి నిర్మాతలకు భారీగా నష్టం వచ్చే పరిస్థితిలో కథానాయిక పాత్ర ధరించడంతో పాటు దర్శకత్వం, ఎడిటింగ్ కూడా తనే నిర్వహించి, చిత్రాన్ని పూర్తి చేసి అందర్నీ ఆశ్చర్యపరచారు కమలాబాయి. అయితే చిత్రం టైటిల్స్ లో మాత్రం దర్శకుడిగా హిరేన్ బోస్ పేరే కనబడుతుంది. అలాగే తొలి ద్విభాషా చిత్రమైన తుకారాం (1940) తెలుగు వెర్షన్లో ఆమె నటించారు. అప్పటి వరకు కథానాయకి పాత్రలు పోషించిన కమలాబాయి ఆ తర్వాత సినిమాలలో కారెక్టర్ రోల్స్ వెయ్యటం ప్రారంభించారు. ఈ విధంగా నటించిన సినిమాలలో పత్ని, మల్లీశ్వరి, లక్ష్మమ్మ, పాతాళభైరవి, సంక్రాంతి, అగ్నిపరీక్ష ముఖ్యమైనవి. కమలాబాయి సినిమాల ద్వారా సంపాదించిన డబ్బు మొత్తం వేరొక భవిష్యత్తు అవసరాలకై ఒక బ్యాంకులో డిపాజిట్టు చేయగా, ఆ బ్యాంకు దివాళా తీసి, తన డబ్బు కోల్పోయి చివరి దశలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వయసు మీదపడి సినిమాలలో అవకాశాలు సన్నగిల్లినా ఇంట్లో ఊరికే కూర్చోలేక తన అక్క కూతురైన సురభి బాలసరస్వతితో పాటు షూటింగులకు వెళుతుండే వారు. అలా ఆర్థిక ఇబ్బందులలో అవసాన దశలో 1971, మార్చి 30న మరణించారు. భక్తప్రహ్లాద (1931) – లీలావతి శకుంతల (1932)బీపాదుకా పట్టాభిషేకం (1932) – సీతాదేవిబీ సావిత్రి (1933)బీ పృథ్వీపుత్ర (1933)బీ షెహర్ కా జాదూ (1934) – లైలాబీ ద్రౌపదీ మానసంరక్షణం (1936)బీ దో దివానే (1936) బేఖరాబ్ జాన్ (1936)బీ తుకారాం (1938)బీ భక్త జయదేవ (1938) భూకైలాస్ (1940)బీ మంగళ (1951) పాతాళభైరవి (1951) మల్లీశ్వరి (1951)బీ దేవదాసు (1953)బీమాంగల్య బలం (1958) పెళ్లినాటి ప్రమాణాలు (1958) జయభేరి (1959)బీ వాగ్దానం (1961)బీ తదితర చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## అసమాన సేవా తత్పరుడు జనరల్ తిమ్మప్ప - మార్చి 30...కె.ఎస్.తిమ్మయ్య జయంతి



జనరల్ కోదండెర సుబ్బయ్య తిమ్మయ్య భారత సైన్యంలో ఒక విశిష్ట సైనికుడు. ఆయన 1957 నుండి 1961 వరకు భారత చైనా దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న సమయంలో భారత సైన్యంలో ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా కీలకమైన సేవలను అందించారు. రెండవ ప్రపంచ యుద్ధం పదాతి దళానికి నాయకత్వం వహించిన ఏకైక భారతీయుడు. ఆయన భారత సైన్యం అందించిన విశిష్ట అధికారిగా గుర్తింపు పొందారు. కొరియా యుద్ధం తరువాత, యుద్ధ ఖైదీలను స్వదేశానికి తిరిగి పంపే పనిలో ఐక్యరాజ్య సమితి విభాగానికి నాయకత్వం వహించారు. ఆర్మీ నుండి పదవీ విరమణ చేసిన తరువాత 1964 జూలై నుండి డిసెంబరు 1965 వరకు సైప్రస్ దేశంలో ఐక్యరాజ్య సమితి శాంతి సంరక్షక దళానికి కమాండర్ గా నియమించ బడ్డారు. సైప్రస్ లో 18 డిసెంబరు 1965లో మరణించారు. ఆయన కర్ణాటక రాష్ట్రం కొడగు జిల్లా (పూర్వపు పేరు కూర్గ్) మడికెరి గ్రామంలో 1906, మార్చి 30వ తేదీన తిమ్మయ్య సీతమ్మ దంపతులకు జన్మించారు. తల్లి సీతమ్మ విద్యావంతురాలు, సంఘ సేవకురాలు. ఆమెకు బ్రిటిష్ ప్రభుత్వం కైసర్ – ఎ– హింద్ బిరుదును ప్రదానం చేసింది. ఆయన న అన్న పొన్నప్ప, తాను, తమ తమ్ముడు సోమయ్య ముగ్గురూ భారత సైన్యం లో అధికారులుగా పనిచేశారు. మెరుగైన విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో తన 8వ యేటనే తమిళ నాడు రాష్ట్రం కూనూరులోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో చేరారు. ఆ తర్వాత బెంగళూరు లోని బిషప్ కాటన్ బాయ్స్ స్కూలులో చదివారు. ప్రాథమిక విద్య ముగిసిన తరువాత డెహ్రాడూన్ లోని ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రాయల్ ఇండియన్ మిలటరీ కాలేజి లో చేరారు. అక్కడ నుండి పట్టా పొందిన తరువాత ఆయన ఇంగ్లాండు లోని రాయల్ మిలటరీ కాలేజీకి ప్రత్యేక శిక్షణ కోసం ఎంపిక చేయ బడ్డారు. మిలటరీ శిక్షణ తరువాత 1926 ఫిబ్రవరి 4న ఆయనను బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సెకండ్ లెఫ్టినెంట్ గా నియమించారు. ఆ బ్యాచ్‌లో నియమింప బడిన వారిలో ఆయన తరువాత ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా పనిచేసిన ప్రాణ్ నాథ్ థాపర్ ఉన్నారు. తిమ్మయ్య 19వ హైదరాబాద్ రెజిమెంట్‌కు చెందిన 4వ బెటాలియన్‌లో 1927 మే 28 న నియమించ బడ్డారు. 1928 మే 4 న ఇతడు లెఫ్టినెంట్‌గా పదోన్నతి పొందారు.


1930లో రెజిమెంటల్ సహాయాధికారిగా నియమించిన తరువాత తన నైపుణ్యంతో నార్త్ వెస్ట్ ఫ్రంటియర్ (నేటి పాకిస్తాన్) లోని పఠాన్ ఆదివాసీ తిరుగుబాటు దారులను అణచ గలిగారు. 1935 ఫిబ్రవరి 4న ఇతడు కెప్టెన్‌గా పదోన్నతి పొందారు. 1936 ఏప్రిల్‌లో ఇతడు మద్రాసులోని యూనివర్శిటీ ట్రైనింగ్ కార్ప్స్‌కు సహాయాధికారిగా బదిలీ కాబడ్డారు. తరువాత ఆయనను సింగపూర్ బెటాలియన్‌కు బదిలీ చేశారు. 1941లో ఆయనను ఆగ్రాలోని హైదరాబాద్ రెజిమెంటల్ సెంటర్‌లో సెకండ్–ఇన్–కామాండ్‌గా నియమించారు. తరువాత ఇతనిని క్వెట్టాలోని స్టాఫ్ కాలేజీలో శిక్షణ కోసం పంపారు. అక్కడ ఆయన, ఆయన భార్య 1935 క్వెట్టా భూకంప బాధితులకు ఎనలేని సేవలను అందించారు. 1943లో ఆయనను మేజర్ పదవి లభించింది. ఇతడు 25వ పదాతి దళానికి గ్రేడ్2 స్టాఫ్ ఆఫీసర్‌గా నియమితుడైనాడు. సైన్యంలో ఆ పదవిని వరించిన తొలి భారతీ యుడు తిమ్మయ్య. పదాతి దళం అదుపులో యుద్ధ శిక్షణను పొంది రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ సేనలను బర్మాలో ఎదుర్కొంది. 1944లో ఆయన లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి పొంది బర్మాలో 8వ, 19వ హైదరాబాద్ రెజిమెంట్ లకు కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేశారు. 1945లో ఇతడు బ్రిగేడియర్ ర్యాంకుకు ఎదిగారు. యుద్ధంలో ఆయన సేవలకు గుర్తింపుగా డిస్టింగ్విష్డ్ సర్వీస్ ఆర్డర్‌ను ప్రకటించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆయనను స్వదేశానికి వెనుకకు రప్పించారు. 1947లో భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత పాకిస్తాన్ విభజన సందర్భంగా భారత్ పాకిస్తాన్ మధ్య ఆయుధాలు, పనిముట్లు, సైన్యం పంపకాల కమిటీలో ఆయనను సభ్యుడిగా నియమించారు. దాని తరువాత సెప్టెంబర్ 1947లో మేజర్ జనరల్‌గా పదోన్నతి కల్పించి 4వ పదాతి దళానికి కమాండింగ్ ఇచ్చారు. 1948లో కాశ్మీర్‌లో జరిగిన భారత్–పాక్ యుద్ధంలో ఇతడు క్రియాశీలక పాత్రను నిర్వహించారు. 19వ పదాతి దళానికి కమాండర్‌గా వ్యవహరిస్తూ కాశ్మీర్ లోయ నుండి పాకిస్తాన్ సేనను తరిమికొట్టారు. షేక్ అబ్దుల్లా, బక్షి గులాం మొహ మ్మద్, జవహర్‌లాల్ నెహ్రూలతో సత్సంబంధాలను ఏర్పరచు కున్నారు. డెహ్రాడూన్ లోని ప్రతిష్టాత్మక ఇండియన్ మిలటరీ అకాడమీకి కమాండెంట్‌గా వ్యవహరించారు. ఆయనకు గల అపార అనుభ వాన్ని పరిగణనలోకి తీసుకుని ఐక్యరాజ్య సమితి... తటస్థ దేశాల రిపాట్రియేషన్ కమీషన్‌కు ముఖ్యునిగా నియమించి కొరియాకు పంపించి. అది చాల సున్నితమైన, అసాధారణమైన పని కావడంతో చాకచక్యంతో నెరవేర్చ గలిగారు. ఆయన స్వదేశానికి తిరిగి వచ్చి లెఫ్టినెంట్ జనరల్ హోదాలో జనరల్ ఆఫీసర్ కమాండింగ్, సదరన్ కమాండ్‌గా 1953లో నియమితుడైనారు. 1954లో ఇతనికి భారత ప్రభుత్వం పద్మ భూషణ్ అవార్డును ఇచ్చి సత్కరించింది. ఆయన 1957, మే 7న 6వ ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ బాధ్యతలను చేపట్టారు. 1959లో అప్పటి కేంద్ర రక్షణ మంత్రి వి. కె. కృష్ణ మీనన్ తో ఏర్పడిన విభేదాల కారణంగా పదవికి రాజీనామా చేశారు. కానీ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఆయన రాజీనామాను తిరస్కరించడంతో పదవిలో కొనసాగారు. 35 ఏళ్ల మిలటరీ సర్వీసు పూర్తి చేసుకుని 1961 మే 7న పదవీ విరమణ చేశారు. భారత సైన్యం నుండి పదవీ విరమణ తరువాత ఐక్యరాజ్య సమితి ఆయన సేవలను మరోసారి ఉపయోగించు కుంటూ, సైప్రస్‌లో ఐక్యరాజ్య సమితి సేన (%చీఖిఖీ%) లకు కమాండర్‌గా జూలై 1964లో నియమించింది. ఆ పదవిలో ఉన్న సమయం లోనే 1965, డిసెంబరు 17న మరణించారు. ఆయన పార్థివ దేహాన్ని అంత్యక్రియల కోసం బెంగళూరుకు తరలించారు. ఆయన స్మృత్యర్థం బెంగళూరు, పూనే, సైప్రస్‌లోని లార్నకా నగరాలలో కొన్ని వీధులకు జనరల్ తిమ్మయ్య రోడ్ అని నామకరణం చేశారు. 1966లో రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ ఇతని స్మారక తపాలా బిళ్లను విడుదల చేసి గౌరవించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## మార్చి 30... దేవికా రాణి జయంతి



దేవికా రాణి (మార్చి 30, 1908 – మార్చి 9, 1994) సుప్రసిద్ధ సినీ నటి. పద్మశ్రీ, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుల గ్రహీత. ఆమె విశాఖ పట్టణంలో జన్మించారు. ఆమె తండ్రి భారత దేశపు తొలి సర్జన్ జనరల్ కల్నల్ ఎం.ఎన్.చౌదరి. శాంతి నికేతన్‌లో విద్యాభ్యాసం తర్వాత ఉపకార వేతనం మీద లండన్ వెళ్లి అక్కడ రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమాటిక్ ఆర్ట్స్, మ్యూజిక్ సంగీతం, నటనలో శిక్షణ పొందారు. జర్మనీలో ప్రసిద్ధ సినీ నిర్మాతగా పేరుపొందిన హిమాంశు రాయ్ తో పరిచయం ఏర్పడి తర్వాత అది ప్రేమగా మారి 1929లో పెళ్లి చేసు కున్నారు. బెర్లిన్ లోని యు.ఎఫ్.ఎ. స్టూడియోలో దేవికని చేర్పించి మేకప్, కాస్ట్యూమ్ డిజైనింగ్ మొదలైన విభాగాల్లో శిక్షణ ఇప్పించారు. స్వదేశానికి తిరిగివచ్చి స్వంతంగా "కర్మ" (1933) అనే చిత్రాన్ని నిర్మించారు. ఆ చిత్రంలో దేవికారాణి నాయికగా, హిమాంశురాయ్ నాయకుడిగా నటించారు దీనిని హిందీలోకి అనువదించి విడుదల చేయగా ఘనవిజయం సాధించింది. 1934లో "బాంబే టాకీస్" అనే సంస్థను స్థాపించి ఎందరో ఔత్సాహిక కళాకారుల్ని చేర్చుకొని వివిధ రంగాల్లో శిక్షణ నిచ్చారు. బాంబే టాకీస్ తీసిన చిత్రాలలో దేవికారాణి, అశోక్ కుమార్ ల జంట హిట్ పెయిర్ గా పేరు పొందారు. ఈమె నటించిన 16 చిత్రాలలోని చాలా పాత్రలు సంఘర్షణాత్మక మైనవి. సమాజ వివక్షతకు గురయ్యే హరిజన యువతిగా అచూత్ కన్య (1936) లో, తల్లి కాలేని గృహిణిగా నిర్మల (1939) లో, అనాథగా దుర్గ (1939), తిరగబడిన మహిళగా సావిత్రి (1937) లో విభిన్నమైన రాలైన బ్రాహ్మణ యువతిగా జీవన్ ప్రభాత్ (1937) లో ఆమె నటన అనితర సాధ్యమైనది. 1940 మే 19లో హిమాంశు రాయ్ హఠాన్మరణం పొందడంతో బాంబే టాకీస్ నిర్వహణ బాధ్యత ఆమె చేతిలో పడింది. తర్వాత తీసిన బసంత్, కిస్మత్, అంజానా మొదలైన చిత్రాలు ఆర్థికంగా లాభాలు తెచ్చిపెట్టాయి. తర్వాత బాంబే టాకీస్ స్టూడియోను దర్శించడానికి వచ్చిన సుప్రసిద్ధ రష్యన్ చిత్రకారుడు స్వెటోస్లావ్ రోరిక్‌తో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారి 1945లో వివాహానికి దారితీసింది. తర్వాత ఆమె సినీరంగానికి దూరమయ్యారు. ఆమె సినిమా రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1958లో పద్మశ్రీ పురస్కారం ఇచ్చింది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు నెలకొల్పిన తొలిసారి ఆమెకు 1969లో ప్రకటించారు. చివరి రోజుల్లో బెంగుళూరులో గడుపుతూ 1994 మార్చి 9 తేదీన పరమ పదించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## మార్చి 30...ఆనంద్ బక్షి వర్ధంతి



638 హిందీ సినిమాలకు 3500లకు పైగా పాటలను వ్రాసిన రికార్డు ఆయనకే సొంతం. ఉత్తమ గేయ రచయితగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారానికి 40 సార్లు ప్రతిపాదించ బడి, 4 పర్యాయాలు ఉత్తమ గేయ రచయితగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారం దక్కించుకున్న ఘనత ఆయనదే. అయిదు దశాబ్దాల నాడు నాటి సినీ ప్రేక్షకులకు, పాటల శ్రోతలకు సుపరి చితమైన పేరు ఆయనది. నాడు పేరుమోసిన ఎందరో సంగీత దర్శకులకు ఆయన రచనలకు బాణీలు సమకూర్చగా, ఎందరో సినీ నేపథ్య గాయకులు పాటలు పాడారు. ఆయనే అనేకానేక జనరంజకమైన పాటలను రచించి జన హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న సుప్రసిద్ధ హిందీ సినీ కవి ఆనంద్ బక్షి. ఆనంద్ బక్షి (బక్షి ఆనంద్ ప్రకాష్ వైద్) ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న రావల్పిండిలో 1930, జూలై 21న జన్మించారు. ఇతని పూర్వీకులు రావల్పిండి సమీపంలో ఉన్న కుర్రీ గ్రామానికి చెందిన మోహ్యాల్ బ్రాహ్మణులు. వారి మూలాలు కాశ్మీర్‌లో ఉన్నాయి. ఇతడు 5 సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు ఆయన తల్లి సుమిత్ర మరణించింది. దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం పూనే, మీరట్‌ల గుండా ప్రయాణించి ఢిల్లీకి వలస వచ్చి, అక్కడ స్థిరపడింది. అయన ప్రాథమిక విద్య అనంతరం భారతీయ సైన్యంలో చేరారు. చిన్నతనం నుండే కవిత్వం వ్రాయాలని ఉబలాటం ఉండేది. అయితే సైన్యంలో సమయం దొరకక ఎక్కువగా వ్రాయడానికి కుదరలేదు. సమయం చిక్కినప్పుడల్లా కవిత్వం వ్రాసేవారు. తన పాటలను సైన్యంలో స్థానిక కార్యక్రమాలలో ఉపయోగించే వారు. సైన్యంలో ఎక్కువ కాలం పనిచేశారు. బక్షీ హిందీ సినిమాలలో రచయితగా, గాయకుడిగా పేరు తెచ్చుకోవాలని రంగ ప్రవేశం చేసినా, చివరకు గేయ రచయితగానే రాణించారు. బ్రిజ్‌మోహన్ సినిమా భలా ఆద్మీ (1958) చిత్రంతో ఆయనకు గీత రచయితగా గుర్తింపు వచ్చింది. 1956 నుండి 1962 వరకు కొన్ని చిత్రాలకు పని.చేసినా 1962లో మెహెందీ లగీ మేరీ హాథ్ ఆయన విజయ పరంపర ప్రారంభ మయ్యింది. ఆయన మొత్తం 638 హిందీ సినిమాలకు 3500లకు పైగా పాటలను వ్రాశారు. భక్షీ పాటలకు లక్ష్మీకాంత్ ప్యారేలాల్, ఆర్.డి.బర్మన్, కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ, ఎస్.డి.బర్మన్, అను మాలిక్, రాజేష్ రోషన్, ఆనంద్ మి లింద్ మొదలైన సంగీత దర్శకులు బాణీలు కూర్చగా, షంషాద్ బేగం, ఇలా అరుణ్, ఖుర్షీద్ బావ్రా, అమీర్ బాయి కర్ణాటకి, సుధా మల్హోత్రా, కిశోర్ కుమార్, శైలేంద్ర సింగ్, కుమార్ సానూ, కవితా కృష్ణమూర్తి వంటి అనేక మంది గాయనీ గాయకులు పాటలను గానం చేశారు. భక్షీ వ్రాసిన పాటలలో 1972లో వచ్చిన హరేరామ హరేకృష్ణ చిత్రంలోని దమ్ మారో దమ్ పాట ఇతడిని ప్రతిభావంతుడైన రచయితగా నిలబెట్టింది. ఆయన గీతరచన చేసిన చిత్రాలలో బాబీ, అమర్ ప్రేమ్, ఆరాధన, జీనే కీ రాహ్, మేరా గావ్ మేరా దేశ్, ఆయే దిన్ బహార్ కే, ఆయా సావన్ ఝూమ్‌కే, సీతా ఔర్ గీతా, షోలే, ధరమ్ వీర్, నగీనా, లమ్హే, హమ్, మొహ్రా, దిల్ వాలే దుల్హనియా లేజాయేంగే, పర్‌దేశ్, దుష్మన్, తాళ్, మొహబ్బతే, గదర్: ఏక్ ప్రేమ్ కథ, యాదే వంటి అనేక విజయ వంతమైన చిత్రాలున్నాయి. ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతు, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌తో 2002, మార్చి 30వ తేదీన తన 71వ యేట మరణించారు. ఆయన రచించిన పాటలున్న చివరి సినిమా మెహబూబా మరణానంతరం విడుదలయ్యింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## కేశవ్ బలీరాం హెడ్గేవార్ (ఏప్రిల్ 1, 1889 - జూన్ 21, 1940)

## (ఆర్. యస్. యస్.) వ్యవస్థాపకులు...వారి జయంతి సందర్భంగా

యుగ ద్రష్ట 'హిందు చైతన్య శక్తి'కేశవ్ బలిరాంహెగ్డేవార్ మహాపురుషులు మరణించిన వారి బోధనలు కార్యశీలత చూపిన మార్గం సమాజాన్ని ప్రభావితం చేస్తాయి.హిందూ సమాజ సంఘటనకు 'ఐక్యతకు వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దిశ దశను నిర్దేశించిన హెగ్డే వార్ చూపిన మార్గం నేటికిఅనుసరణీయం.

**జన జాగృతి డాక్టర్ హెగ్డేవార్...** కొంతమంది మహాపురుషులు భవిష్యత్తునుగురించినదార్శనికత 'సత్యాన్ని అనుభవించి, తమధృడమైనఆత్మబలంతోను, ధృడ విశ్వాసంతోను ముందుతరాలకుమార్గదర్శనం చేస్తారు. కొంత మంది సమాజ హితమే లక్ష్యంగా తమ జీవన విధానాన్ని గడుపుతూ త్యాగం 'సమాజ సేవా 'జన జాగృతి కొరకు తమ జీవితాన్ని అంకితం చేసిన కారణ జన్ముడు కేశవ్ బలరాం హెగ్డేవార్.

**హిందూ సమాజానికి మార్గదర్శిబి డాక్టర్ 'హెగ్డేవార్...** కొంత మంది ధైర్య సాహసాలతో లక్ష్య సాధనకు పట్టుదల నిరంతరం చైతన్యం తోకృషి చేస్తూ ప్రతికూల పరిస్థితులలో సమాజానికి దారి చూపుతూ జీవిస్తారు. సమాజ చీకటిని పారదోలే దీపంగ వెలుగు నిస్తారు. డాక్టర్ హెగ్డేవార్ అదే మార్గంలో పయనించి హిందూసమాజానికిమార్గదర్శిగా నిలవడం గమనార్హం.

**డాక్టర్ 'జీ బిబిఒక ఆశాజ్యోతి గురుజీ వాఖ్య...** ఏదో ఒకసామాజిక కార్యక్రమం స్వీకరించి చేయడం మొదలు పెట్టిన తర్వాత వచ్చిన కష్టాలను ఎదుర్కొనక నిరాశ' నిస్పృహలకు లోనయ్యే వారికి డాక్టర్ జీ జీవితం నుంచి ఒక ఆశాజ్యోతి 'దివ్య సందేశం ప్రాప్తమై ప్రేరణ లభించగలదు. .. గురుజీ

**డాక్టర్ జీ బియువతపై ప్రభావం...** డాక్టర్ జీ కార్య కుశలత 'దృఢ దీక్ష 'దేశభక్తి యువతను ప్రభావితం చేసింది . వారు మరణించిన తరువాత కూడా వారి దూరదృష్టి సమాజం అంతటికీ వెలుగునిస్తూ ఉంటుంది. అటువంటివారినే 'యుగ ప్రవక్త' లేక 'యుగ ద్రష్ట' అంటారు.

**1925 సం" లో ఆర్ 'ఎస్' ఎస్ స్థాపన బిడాక్టర్ 'హెగ్డేవార్...** హిందూ జాతీయవాద సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక సంఘ వ్యవస్థాపకులు డా౹౹హెడ్గేవార్ మహారాష్ట్ర నాగపూర్ పట్టణంలో 1925 వ సంవత్సరంలోస్థాపించారు.

**డాక్టర్జీ 'హెగ్డేవార్ పై జాతీయవాద ఉద్యమాల ప్రభావం...** డాక్టర్ హెగ్డేవార్ 'స్వామి వివేకానంద 'లోకమాన్య బాల గంగాధర్ తిలక్ ఆలోచనలకు ప్రభావితమై పరాయి పాలన నుండి దేశాన్ని విముక్తి చేసి ధర్మ రక్షణకు జరిగిన ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. అజాద్ హిందూ ఫౌజ్ లాంటి జాతీయవాద సంస్థల ఉద్యమాలు డాక్టర్ జీ నీప్రభావితంచేశాయి.అరబిందో లాంటి హిందూ సామాజిక ఆధ్యాత్మిక సంస్కర్త ల ప్రభావానికి లోనైన హెగ్డే వార్ హిందూ ఐక్యత ధర్మ రక్షణ కొరకు అర్'ఎస్' ఎస్ ను స్థాపించారు .

**ప్రపంచంలో అతిపెద్ద స్వచ్ఛంధ సంస్థ ఆర్ 'ఎస్' ఎస్...** నాగపూర్ పట్టణంలో గుప్పెడు మందితో ప్రారంభమైన ఆర్' ఎస్' ఎస్ నేడు ప్రపంచంలో అతిపెద్ద స్వచ్ఛంధ సంస్థగా గుర్తింపు పొందింది . దేశం నలమూలల ప్రతి రోజు 80'000 శాఖలతో లక్షలాది స్వయం సేవకులు నిండు గుండెల్లో "భారత్ మాతాకీ జై"అంటూ ఐక్యతా మంత్రాన్ని జపిస్తారు. ఆర్' ఎస్ 'ఎస్ హిందూ సమాజ ఐక్యతకు 'ధర్మ రక్షణకు జాతీయవాద పరివ్యాప్తికి నిరంతరం కృషి చేస్తుంది.

**జాతీయవాదం ధర్మ రక్షణ హిందూ ఐక్యత బిఆర్' ఎస్' ఎస్ లక్ష్యం...** భారతీయుల్లో జాతీయవాదాన్ని ధర్మం కోసం హిందూ ఐక్యత కోసం జరిగిన ఎన్నో పోరాటాలకు ఆర్' ఎస్' ఎస్ స్ఫూర్తి. దేశం కోసం వ్యక్తుల్లో సమర్పణ భావాన్ని ప్రేరేపించడంలో ఆర్ 'ఎస్' ఎస్ మహత్తర పాత్రను పోషిస్తుంది.

**సమాజ సేవలోబి భాగస్వామ్యం....** ఆర్ 'ఎస్ 'ఎస్ శాఖకు ప్రత్యక్షంగా రాకపోయినా పరోపక్షంగా అనేక క్షేత్రాల్లో ఎంతో మందిని సమాజ సేవలో దేశ మాత సేవలో తరింపచేస్తున్న గొప్ప సంస్థ ఆర్ 'ఎస్' ఎస్.

**దేశమేమిన్న బిదేశమే సర్వస్వంబిఆర్ 'ఎస్' ఎస్...** హిందూ ఐక్యతే ధ్యేయంగా దేశాన్ని బ్రిటిష్ వారి బానిసత్వం నుండి విముక్తి చేయడానికి అవిరళ పోరాట పటిమ ప్రదర్శించిన ఆర్ ఎస్ ఎస్ సమాజంపై గట్టి ప్రభావాన్ని చూపింది. చారిత్రిక తప్పిదాలను ఎండగడుతూ దేశమే మిన్న దేశమే సర్వస్వం అనుకోగల వ్యక్తుల సమూహాన్ని సమాజానికి అందిస్తుంది. ఆశించిన ఫలితాలు సాకారమై కనపడుతున్నాయి. అలాంటి సంస్థకు అంకురార్పణ చేసిన మనిషి నిజమైన దృష్ట అటువంటి యుగ ప్రవక్తలలో అగ్రశ్రేణి కి చెందిన వ్యక్తి మాత్రమే కాదు హెగ్డేవార్ ఒక చైతన్య శక్తిగా సమకాలీన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు . హెగ్డేవార్ పూర్వీకులు తెలంగాణలోని మహారాష్ట్ర సరిహద్దు సమీపాన బోధన్ తాలూకాలోని కందకుర్తి అనే చిన్న గ్రామానికి చెందిన వారు ఈ గ్రామం వద్ద గోదావరిలో మంజీర హరిద్ర నదులు కలిసి త్రివేణి సంగమం ఏర్పడుతుంది. ఆర్.ఎస్.ఎస్. పేరు దేశ విదేశాల్లో కోట్లమంది ప్రజలకు తెలుసు. కాని ఆర్.ఎస్.ఎస్. స్థాపకులు డా౹౹బలీరాం కేశవ హెడ్గేవార్ పేరు చాలా మందికి తెలియకపోవచ్చు. ఇది వింతగా కనిపించినా నిజం. ఆయన గురించి కొంత తెలిసిన వారికి కూడ వారి గొప్పదనం, వారి దూరదృష్టి గురించి తెలియక పోవచ్చు.

**గొప్ప సంఘసంస్కర్త బిడాక్టర్ హెగ్డేవార్** ... డా౹౹కేశవ్ బలీరాం హెడ్గేవార్ మన జాతికే కాదు యావత్ మానవాళికీ తోడ్పడ్డారు. హిందూ జాతి పునర్ వికాసానికి శక్తి వంతమైన జాతి నిర్మాణానికి బలమైన పునాదులు వేసిన గొప్ప సంఘ సంస్కర్త . నిత్యం జరిగే అర్ 'ఎస్ 'ఎస్ శాఖ ను వ్యక్తిత్వ నిర్మాణానికి వికాసానికి 'ఐక్యతా శక్తికి వేదికగా మార్చిన రూపశిల్పి.

ధర్మ రక్షణ పునాదుల మీద దేశరక్షణకు అవిరళ కృషి చేసిన ఆదర్శ పురుషుడు హెగ్డేవార్.



**యుగ దృష్ట బిడాక్టర్ హెగ్డేవార్...** కొంతమంది మహాపురుషులు భవిష్యత్తును గురించిన సత్యాన్ని అనుభవించి, తమ ధృడమైన ఆత్మ బలంతోను, ధృడ విశ్వాసంతోను ముందు తరాలకు మార్గదర్శనం చేస్తారు. ప్రతికూల పరిస్థితులలో సమాజానికి దారి చూపుతూ జీవిస్తారు. వారు మరణించిన తరువాత కూడా వారి దూరదృష్టి సమాజం అంతటికీ వెలుగునిస్తూ ఉంటుంది. అటువంటి వారు భౌతికంగా ప్రజలకు దూరమైనా, వారిని అనుసరించే వారు పెరుగుతూనే ఉంటారు. అటువంటి మహా పురుషులు తమకు ప్రజలలో పేరు ప్రఖ్యాతులు రావాలనీ, విస్తృత ప్రజానీకానికి తాము పరిచయం కావాలని కోరుకోరు. అటువంటివారినే 'యుగ ప్రవక్త' లేక 'యుగ ద్రష్ట' అంటారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ స్థాపకులు డా౹౹ హెడ్గేవార్ అటువంటి యుగ ప్రవక్తలలో ఒకరు. ఆర్ 'ఎస్' ఎస్ పెద్ద సంఖ్యలో స్వచ్ఛంధ సేవకులను నిర్మాణం చేస్తుంది. దేశం సంక్షోభ సమయంలో దేశానికి సేవ చేయగల వ్యక్తులను మంచి తనం మానవీయత సమర్పణ భావం సంస్కారవంతమైన సమాజాన్ని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం ఆర్ 'ఎస్' ఎస్ యొక్క లక్ష్యం

**నేను కాదు మనం అనే సమిష్టి భావన పరివ్యాప్తిబి ఆర్ 'ఎస్ 'ఎస్...** నేను ఒంటరిని కాదు. నా చుట్టూ ఉన్న సమాజం నాది. ఆది నాతోనే ఉంటుంది అని హిందూ సమాజం నరనరాల్లో నేను కాదు మనం అనే భావన ఇంకిపోవాలనే ఆలోచించి స్థాపించిన ఆర్ ఎస్ ఎస్ వ్యక్తుల్లో సమష్టి భావన వ్యాప్తిలో కృతకృత్త మైందనీ చెప్పవచ్చు.

**భారత్ మాతాకీ జై నినాదం ఐక్యతా మంత్రం...** సంఘ శాఖలో దేశంలో వేర్వేరు సాంప్రదాయాలు పాటించే వారు వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారైనప్పటికీ ముక్త కంఠంతో భారత్ మాతాకీ జై అని నినదిస్థారు. ఇది ఒక ఐక్యతా మంత్రం.తద్వారా భారతదేశం నాదేశం అనే భావన బలపడుతుంది. అంటరాని తనం 'భాషాబేధం 'ప్రాంత బేధం అంతరించి పోతుంది. అందరిని ఒకే విధంగా ప్రేమించడం .'సమానత్వం పాటించడం జరుగుతుంది. అధికార బోధ కాకుండా కర్తవ్య బోధజాగృతమౌతుంది.

**సంఘం పరిధి విస్తరణ....** సంఘం తన కార్యక్రమాలు ప్రారంభించుకొని 99 సంవత్సరాలు పూర్తయింది. సంఘం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆర్ ఎస్ ఎస్ కార్యపరిధిని మరింత విస్తృత పరచడంకోసం సంఘ ఆలోచన పరివ్యాప్తి కోసం జాతీయవాద శక్తుల బలోపేతం ద్వారా దేశ రక్షణ ధర్మ రక్షణలో పౌరసమాజం క్రియా శీలక పాత్రను చోదక శక్తిగా తీర్చిదిద్దాలని సంకల్పంచడం జరిగింది.

**ఐదు అంశాలు ఎంపిక....** సంఘ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని 5 అంశాలను ఎంపిక చేశారు.

**సామరస్యత సంస్కారం...** 1)వ్యక్తిగత కుటుంబ సామాజిక వ్యవహారాలు సామరస్య పూర్వకంగా జరగాలి. అంటరాని తనం నిర్మూలించబడాలి. కుటుంబాల్లో సంస్కారం పెరగాలి.

**పర్యావరణ రక్షణ...** 2) పౌరసమాజం పర్యావరణ రక్షణ 'నీటి వినియోగం 'నీటి సంరక్షణ ప్రతి వ్యక్తి పుట్టిన రోజు ఒక మొక్కను నాటడం కాలుష్య నివారణ 'ప్లాస్టిక్ వినియోగం రద్దు.

**తప్పని సరి ఓటు హక్కు...** 3)సామాజిక బాధ్యతలను నిర్వహించడం తప్పని సరి ఓటు హక్కును వినియోగించాలి.

**స్వదేశీ బిస్వాభిమానం...** 4) స్వదేశీ భావన పరివ్యాప్తి చేయడం స్వాభిమానం ఉపాధిఅవకాశాలను మెరుగుపరచడం. ప్రతి ఒక్కరు ఖద్దరు వస్త్రాన్ని ధరించడం. 5) సహజ వనరుల రక్షణ దేశ భాషల పట్ల స్వాభిమానాన్ని పెంచడం. భూకంపం వరదలు తుపాను అకాల ప్రకృతి విపత్తులు కుంభమేళాలు సంభవించినప్పుడు బాధితులకు సాయం చేయడానికి ముందుకు వచ్చే సమాజ సేవకులను ఆర్ ఎస్ ఎస్ తయారు చేస్తుంది

**మనం అనే భావనతో సేవాకార్యక్రమాలు...** దేశంలో ప్రస్తుతం స్వయం సేవకుల ద్వారా మనం అనే భావన తో 160000సేవా కార్యక్రమాలు జరుగు తున్నాయి. సమాజంలో కర్తవ్య భావనను జాగృతం చేయడం జరుగుతుంది. కరోనా మహమ్మారి విజృంభించిన కాలంలో వలస కూలీలకు ఆహారం నివాసం ఇచ్చి ఆదుకొని ఆపన్న హస్తం అందించిన సమస్త మానవ కళ్యాణం కోసం నిరంతర కృషి చేసే సంస్థ కార్యకలాపాల విస్తరణకు స్ఫూర్తి దాతగా నిలిచిన హెగ్డేవార్ ఆధునిక యుగ ద్రష్ట ప్రవక్త గా నిలవడం భారత జాతికి గర్వకారణం.

**నేదునూరి కనకయ్య, అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక 'తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం**
**9440245771**

## భద్రాద్రి రామయ్య బ్రహ్మోత్సవాలకు సర్వం సన్నద్ధం

అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుమల తర్వాత రాష్ట్రంలో ఆరు పెద్ద దేవాలయాలు ఉండేవి... అవి దేవాదాయ శాఖచే 6ఏ టెంపుల్స్ గా గుర్తింపు పొందాయి. శ్రీశైలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయ వాడ కనక దుర్గమ్మ, భద్రాచలం, వేములవాడ దేవాలయాలను 6ఏ టెంపుల్స్ అని పిలిచే వారు. 6ఏ అంటే ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్ అని అర్థం. రాష్ట్ర విభజన తర్వాత ఈ ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్ లో వేములవాడ, భద్రాచలం తెలంగాణ లోకి రావడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా, భద్రాచలం మండలం లోని రెవెన్యూ గ్రామం భద్రాచలం. ఇక్కడ భక్త రామదాసు నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానము కలిగిన గోదావరి నది దక్షిణ తీర పుణ్యక్షేత్రం. దీనిని భద్రాద్రి, శ్రీరామ దివ్యక్షేత్రం అనే పేర్లుతో కూడా పిలుస్తారు. పూర్వపు జిల్లా కేంద్రమైన ఖమ్మం పట్టణానికి 105 కి.మీ.ల దూరంలో ఉంది. పూర్వం భద్రుడు అను భక్తుడు శ్రీ రాముడుకి తపస్సు చేసి, తను ఒక కొండగా మారి తనపై శ్రీ రాముడు వెలసే విధంగా వరం పొందాడని అంటారు. ఆ కొండకు భద్రుడు పేరు మీద భద్రగిరి అని తరువాతి కాలంలో ఆ పట్టణానికి భద్రాచలం (భద్ర ం అచలం) అని పేరు స్థిరపడింది. గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా పాలనా కాలంలో భద్రాచల ప్రాంతానికి తహశీల్దారుగా కంచెర్ల గోపన్న పని చేసే వాడు. ఇక్కడికి సమీపంలోని నేలకొండపల్లి గ్రామానికి చెందిన గోపన్న శ్రీరామ భక్తుడు. తాను ప్రజల నుండి వసూలు చేసిన పన్ను (6 లక్షల రూపాయలు) సొమ్మును ప్రభుత్వానికి జమ చెయ్యకుండా,1645 – 1680 మధ్య కాలంలో భద్రగిరిపై శ్రీ రాముడు వెలసిన ప్రదేశ మందు రామాలయాన్ని నిర్మించాడు. సీతా రామచంద్ర స్వాములకు రకరకాల నగలు – చింతాకు పతకం, పచ్చల పతకం మొదలైనవి చేయించాడు. ఆ సొమ్ము విషయమై తానీషా గోపన్నను గోల్కొండ కోటలో బంధించగా, ఆ చెరసాల నుండి తనను విముక్తి చెయ్యమని రాముణ్ణి గోపన్న ప్రార్థించాడు. ఆ సందర్భంలో రామునిపై రచించి, పాడిన పాటలే రామదాసు కీర్తనలుగా ప్రసిద్ధి చెందాయి. గోపన్న కీర్తనలకు తన్మయత్వం చెందిన రాముడు, దేవాలయ నిర్మాణానికి ఉపయోగిం చిన ప్రభుత్వ సొమ్మును తానీషాకు చెల్లించి, గోపన్నకు చెరసాల నుండి విముక్తి ప్రసాదించాడని ఐతిహ్యం. అలా కంచెర్ల గోపన్నకు రామదాసు అనే పేరు వచ్చింది. దేవాలయ మందు సీతా, లక్ష్మణ, హనుమంత సమేతంగా శ్రీరామ చంద్రుడు ఇక్కడ అత్మారాముని రూపంలో కొలువు తీరి ఉన్నాడు. సీత, రాముని తొడపై కూర్చొని ఉన్నట్లు ఇక్కడి విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. మరే దేవస్థానం లోనూ లేని ప్రత్యేకత ఇది. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమికి వైభవంగా జరిగే సీతారామ కళ్యాణ ఉత్సవానికి అశేష ప్రజానీకం వస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కళ్యాణోత్సవానికి ముత్యపు తలంబ్రాలు, పట్టు వస్త్రాలు పంపించడం సాంప్రదాయం. ఇక్కడ శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరుగుతుంది. రామ దాసు చేయించిన వివిధరకాల నగలు దేవస్థానపు ప్రదర్శన శాలలో ప్రదర్శనకు ఉంచారు. భద్రాచలం లోని శ్రీరాముడినీ వైకుంఠ రాముడు అని అంటారు. ఇక్కడి రాముడు వైకుంఠమునకు వెళ్ళిన తరువాత మరల భూమి మీదకి వచ్చి, తన భక్తుడైన భద్రుడి కోరిక తీర్చి భద్ర పర్వతంపై నిలిచాడు. భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి కల్యాణ బ్రహ్మోత్సవాల సందడి మొదలైంది. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చాంద్రమాన విశ్వావసు నామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమి ఆదివారం నుండి చైత్ర శుద్ధ పూర్ణిమ శనివారం వరకు 30-03-2025 నుండి 12-04-2025 వరకు వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమీ తిరుకళ్యాణ బ్రహ్మోత్సవములు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఇప్పటికే భద్రాచలం పట్టణాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఇప్పటికే అధికారులు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వేడుకల నిర్వహణపై పలుమార్లు దేవస్థాన ఈవో రమాదేవి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరాది 'ఉగాది' పండుగ సందర్భంగా ఉదయం ఉగాది ప్రసాద వితరణ ఉ.9-00 నుండి ఉత్సవారంభం – ఋత్విక్ వరణం, రక్షాబంధనం, స్నపన తిరుమంజనం, సా. మృత్సం గ్రహణము, తిరువీధి సేవ (కల్పవృక్ష వాహనం) నూతన పంచాంగ శ్రవణము అంకురార్పణమ్ తో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 12-04-2025న ఉ. చక్రతీర్థం, సా.గం.6.00లకు పూర్ణాహుతి, శేషవాహన సేవ, ధ్వజావరోహణము, దేవతోద్వాసనము, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు, శ్రీ పుష్పయాగం బ్రహ్మోత్సవముల సమాప్తి జరుగనుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు

## సంపాదకీయం

# పది లక్షల ప్రాణాలు ట్రంప్ మూడ్ మీద ఆధారపడ్డాయి!

అగ్రరాజ్యమని ఊరికే అనరు. ప్రపంచ దేశాలకు పెద్దన్నగా వ్యవహరిస్తూ.. తన అవసరాలు.. తన అధిక్యతను ప్రదర్శించటంతో పాటు ప్రపంచ దేశాలకు అవసరమైన కొన్ని కార్యక్రమాల్ని చేపట్టే అలవాటు అమెరికాకు ఉంటుంది. రెండోసారి అమెరికా అధ్యక్ష కుర్చీలో కూర్చున్న ట్రంప్ మాత్రం.. అమెరికాకు ప్రయోజనం కలిగించటం మినహా మరేమీ తనకు ముఖ్యం కాదన్న వాదనను వినిపిస్తూ అడ్డదిడ్డమైన నిర్ణయాలు తీసుకుంటూ ఆగమాగం చేస్తున్న పరిస్థితి. ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలకు నిధుల్ని కట్ చేసిన ఆయన.. వ్యాక్సిన్ కూటమికి కూడా నిధులు ఆపేస్తే పరిస్థితి ఏమిటన్నది ఆందోళనకరంగా మారింది. అంతర్జాతీయ వ్యాక్సిన్ కూటమిని 'గావి' అని వ్యవహరిస్తారు. దీనికి అగ్రరాజ్యం దండిగా నిధులు ఇస్తూ ఉంటుంది. దగ్గర దగ్గర 300 మిలియన్ డాలర్ల వరకు సాయం చేస్తూ ఉంటుంది. ఈ నిధులతో 120 దేశాల్లో వివిధ కార్యక్రమాల్ని.. వ్యాక్సిన్లను అందజేస్తుంటారు. అయితే.. ఇలాంటి సాయాలకు చెక్ పెడతానని.. ఉత్తపుణ్యానికి విదేశాలకు ఎందుకు సాయం చేయాలన్న వాదనను తెర మీదకు తీసుకొచ్చారు ట్రంప్. గావికి నిధులు ఇచ్చే విషయంపై ఇప్పటివరకు ట్రంప్ సర్కారు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒకవేళ.. ఇప్పుడు ట్రంప్ వ్యవహరిస్తున్న తీరుకు తగ్గట్లే.. గావి విషయంలోనూ వ్యవహరిస్తే పది లక్షల ప్రాణాలు పోవటం ఖాయమన్న మాట చెబుతున్నారు. గావికి అమెరికా నుంచి వచ్చే నిధులు ఆగిపోతే ప్రపంచ ఆరోగ్య భద్రతపై వినాశకర ప్రభావం చూపుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో మానవతా ద్రక్పథంతో సాయం చేయటానికి ఏరపాటు చేసిన యూఎస్ ఎయిడ్ సంస్థను మూసేస్తున్నట్లుగా ప్రకటించటం తెలిసిందే. అంతేకాదు.. దాదాపు 5 వేలకు పైగా ప్రోగ్రాంలను రద్దు చేస్తున్నట్లుగా అమెరికా అధికారులు ఇటీవల ప్రకటించారు. విదేశాంగ శాఖ కింద కేవలం కొన్ని కార్యక్రమాలకు మాత్రమే నిధులు ఇస్తామని.. మిగిలిన వాటికి నిధుల పంపిణీ నిలిపి వేస్తామని తేల్చేశారు. దీనికి సంబంధించి ఇటీవల లీకైన 281 పేజీల ఫైల్ లో అంతర్జాతీయ వ్యాక్సిన్ కూటమి 'గావి' పేరు కూడా ఉండటం తాజా ఆందోళనకు కారణంగా చెబుతున్నారు. ఒకవేళ గావికి అందించే ఆర్థిక సాయం నిలిపివేస్తే.. నిర్మూలించే అవకాశం ఉన్న వ్యాధులతో దాదాపు 10 లక్షల మరణాలు సంభవించొచ్చని.. ప్రపమాదకర వ్యాధుల వ్యాప్తి అనేక జీవితాల మీద పడుతుందని గావి ఎగ్జిక్యూటివ్ సానియా నిష్టర్ చెబుతున్నారు. అయితే.. నిధులు నిలిపివేస్తున్నట్లుగా అమెరికా నుంచి తమకు ఎలాంటి సమాచారం రాలేదని చెబుతున్నారు. ఈ ఏడాది అమెరికా పార్లమెంట్ ఆమోదించిన 300 మిలియన్ డాలర్లను పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్న గావి విషయంలో ట్రంప్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ట్రంప్ మూడ్ మీద 10 లక్షల ప్రాణాలు ఆధారపడి ఉన్నాయని చెప్పకతప్పదు.

# పంచాంగం గణన



పంచాంగం కాల విభాగాన్ని చెప్తుంది. సమయాన్ని మన పూర్వీకులు వివిధ విభాగాలుగా విభజించారు. అవి తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలు. (1). తిథి: ప్రతి రోజు సూర్యుడు అంశ (1డిగ్రీ) చంద్రుడు 13 అంశలు ముందుకు నడుస్తారు. వారిరువురి భ్రమణములో అంతరము 12 డిగ్రీలు. సూర్యుని భ్రమణమును సాపేక్ష భ్రమణము అంటారు. నిజానికి భూమి తిరగదు. కానీ మనం భూమి నుండి ఖగోళము ను వీక్షిస్తాం, కనుక ఆది సాపేక్ష భ్రమణం ఈ 12 డిగ్రీల అంతరమును “తిథి” అంటారు. మొదటి తిథి పాడ్యమి రోజున సూర్య చంద్రుల మధ్య వ్యత్యాసం 12 డిగ్రీలు అయితే, రెండవ రోజు 24 డిగ్రీలు. ఇలా చంద్రుడు 180 డిగ్రీలు, సూర్యుని నుండి జరిగినప్పుడు పౌర్ణమి, తిరిగి సూర్యుని చేరినప్పుడు అమావాస్య అవుతాయి. ఈమధ్య కాలాలే శుక్ల, కృష్ణ పక్షాలు. ఒక సౌరమానం = 0.9483 చంద్ర తిథి. ఈ విధంగా చాంద్రమానమునకు 29.53 రోజులు ఉంటాయి. (2). వారం: ఉదయాద్ ఉదయం వారం అని చెప్తారు అంటే ఈరోజు సూర్యోదయంతో ప్రారంభమై తెల్లవారి సూర్యోదయంతో పూర్తయ్యేది వారం. నవగ్రహాలలో ఛాయా గ్రహాలైన రాహుకేతువులు మినహా మిగిలిన ఏడు గ్రహాల ఆధారంగా వారాల పేర్లు పెట్టడం జరిగింది. జ్యోతిష శాస్త్ర రీత్యా గ్రహాలలో మొదటిది అయిన సూర్యుని పేరిట ఆదివారం, చంద్రుని పేరిట సోమవారం, మంగళుని పేరున మంగళవారం, బుధుని పేరున బుధవారం, గురువు పేరున గురువారం, శుక్రుని పేరున శుక్రవారం, శని పేరున శనివారానికి పేర్లు పెట్టబడ్డాయి. వార విభాగంలో పాశ్చాత్యులకు అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమైతే, మనకు వారం సూర్యోదయంతో ప్రారంభం అవుతుంది. రెండున్నర ఘడియల కాలం హెూరా (అవర్). రోజుకు 24 హెూరలు. 25వ హెూరా చంద్ర హెూర. అంటే మరుసటి దినము. ఈ ప్రకారం ఏడు వారాలు వస్తాయి. మన హెూరనే పాశ్చాత్యులు “అవర్” గా పిలుస్తున్నారు. యధాతథంగా వారి భాషలో పేర్లను తర్జుమా చేసుకొని వాడుకుంటున్నారు.(3). నక్షత్రం: సాపేక్ష సౌర గమనానికి ఒక ఏడాది కాలం పడితే, ఆ మార్గంలో ఆయనకు 12 మజిలీలు గుర్తించబడ్డాయి. అవే రాశులు. సూర్యుని ప్రయాణాన్ని 27 ప్రాంతాలు నక్షత్రాలు చుట్టినట్లు విభజించారు ఒక్కొక్క నక్షత్రానికి 4o4o1 పాదాలు కలిస్తే ఒక రాశి. 3వ నక్ష త్రం లోని మిగిలిన మూడు పాదములు, నాలుగవ నక్షత్రంలోని 4 పాదములు, ఐదవ నక్షత్రం లోని రెండు పాదములు కలిస్తే 3వ రాశి. అంటే 3o4o2 =9. ఇలా 9 పాదములతో ప్రతి రాశి ఏర్పడుతుంది. అంటే 27 నక్షత్రాల లోని, నాలుగేసి పాదాలను కలిపితే, 108 పాదాలు అవుతాయి. సూర్యుడు, చంద్రుడు మరియు మిగిలిన అన్ని గ్రహాల రాశి, నక్షత్ర విభజన ఇదే విధంగా ఉంటుంది. మానవుని పేర్లు ఆడా, లేక మగా ఏదో ఒక దానికి చెందడం పరిపాటి. సంస్కృత నామాలు కలిగిన ఈ 27 రాశుల పేర్లు లాటిన్, గ్రీకు, బాబిలోనియా, ఇత్యాది భాషలలో ఇంచుమించు ఇవే సంస్కృత అర్థము లను కలిగి ఉన్నాయి. (4).యోగము: యోగం అంటే కలయిక దైనిక చంద్ర గతి సాపేక్ష సూర్య గతి కలిపితే యోగం అంటారు ఇవి 27.(5). కరణము: చంద్రుడు రోజుకు 12 డిగ్రీల వంతున సూర్యుని నుండి ఇ దూరమవుతూ వస్తాడు పాడ్యమి కి 12 డిగ్రీలు అయితే విదియకు 24 డిగ్రీలు. ఇలా 360 డిగ్రీలకు అమావాస్య అవుతుంది. అర్ధ తిథిని కరణము అంటారు. ఏ అర్ధ తిథి అయినా 6చే భావించబడుతుంది.ఇవి 11. మొదటి 7 కరణములు, చంద్ర మాసంలో 8 సార్లు వస్తాయి. అంటే 28 రోజులు. చివరి కరణాలు స్థిరంగా నిలుస్తాయి. సూర్య, చంద్ర, భూ చలనాలను నిశితంగా, కచ్చితంగా, పరిశీలించి భూమిపై వాటి వాటి ప్రభావాలను స్పష్టం చేసిన దేశం, వేరే కాకుండా భారత దేశమే, కావడం గర్వకారణం. సంవత్సరంలో ప్రతి రెండు నెలలకు ఒక రుతువు మారుతుంది. ఆంగ్లంలో ఋతువులను %ంఘుంశీఅం% అని పిలుస్తారు. చైత్ర , వైశాఖమాసములు కలిపి వసంత రుతువు గా, జ్యేష్ఠ ఆషాఢ మాసములు గ్రీష్మరుతువు గా, శ్రావణ భాద్రపద మాసములు వర్షరుతువు గా, ఆశ్వయుజం కార్తీకమాసములు శరదృతువు గా, మార్గశిర, పుష్యమాసములు హేమంత ఋతువు గా, మాఘ ఫాల్గుణ మాసములు శశిర రుతువు గా పిలువబడతాయి. ఇక చంద్రుడు పౌర్ణమి రోజు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటాడో ఆ నక్షత్రం పేరుతో మాసం ఏర్పడింది. చిత్త నక్షత్రం అయితే చైత్రం విశాఖ నక్షత్రం అయితే వైశాఖం ఇలా మాసాల పేర్లు ఏర్పడ్డాయి. ముహూర్తానికి తిథి, వార, నక్షత్రాలతో పాటుగా లగ్నాన్ని కూడా చూస్తారు. పంచాంగం యొక్క ప్రధాన ఉపయోగము మన నిత్య నైమిత్తిక కర్మలు, యజ్ఞయాగాదులు వివాహాది శుభకార్యములు జరుపుకోవడానికి సరైన శుభ సమయాన్ని ఎంచుకోవడం. వైదిక సంస్కృతిలో ఒక పూజ చేయాలన్నా, హెూమం చేయాలన్నా లేదా ఒక శుభకార్యం చేయాలన్నా, పంచాంగ శుద్ధి తప్పనిసరిగా ఉండాల్సిందే. పంచాంగ శుద్ధి దినమంటే, ఏ విధమైన దోషాలు అంటే వర్జ్యము, దుర్ముహూర్తం మొదలైన 21 మహా దోషాలు లేని సమయం. ఇటువంటి రోజున చేసే కార్యక్రమాలు, ఎటువంటి విఘ్నం లేకుండా, పరిసమాప్తం అవుతాయని మన పూర్వికులు విశ్వాసం.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**


# పంచాంగం ప్రాధాన్యత




“కాల సృజతి భూతాని, కాలస్సంహరతే ప్రజా: కాలము చరాచర సృష్టికి, సృష్టి అంతానికి మూలాధారం. అందుకే కాలాన్ని దైవంగా భావిస్తారు. అలాంటి కాలాన్ని గురించి తెలుసుకునేందుకు ఉపయోగపడే సాధనమే పంచాంగము. పంచాంగము అనగా పంచంఅంగము. కాలము యొక్క ప్రధాన అంగాలైన, విభాగాలైన తిథి, వారము, నక్షత్రము, యోగము, కరణము అనే అయిదు అంగముల గురించి తెలుపుతుంది, కనుకనే పంచాంగము అని నమాంకితమైంది. మనం ప్రస్తుతం వాడుతున్న క్యాలెండర్ తేదీలు, మాసాలు, సంవత్సరాలను సూచిస్తుంది. ఋగ్వేదంలో నక్షత్ర ప్రస్తావన ఉంది. పంచాంగం గ్రహ గణితానికి మూలమైన, సూర్య సిద్ధాంతం 10వ శతాబ్దంకు ముందు పేర్కొన బడింది. విక్రమ శకాన్ని ఉత్తర, పశ్చిమ భారతావనిలో, నేపాల్ లో అనుసరిస్తారు. అలాగే శాలి వాహన శకమును దక్షిణ భారత దేశంలో, మహారాష్ట్ర, గోవా, ప్రాంతాలలో ఆచరిస్తారు. పూర్ణిమతో మొదలయ్యే నెలను పూర్ణిమాంత మాసమని, అమావాస్యతో పూర్తయ్యే మాసాన్ని అమాంత మాసమని అంటారు. మన దేశంలో అధిక ప్రదేశాలలో పూర్ణిమాంత మాసం వాడుకలో ఉంది. మనం అనుసరిస్తున్న కాలం ఆరు భాగాలుగా విభజితమైంది. సంవత్సరం, ఆయనము, ఋతువు, మాసము, పక్షం, దినం. ఇక వివిధ సంవత్సరాలను పరిశీలిస్తే....(1). చంద్రుని గమనం ఆధారంగా చైత్ర శుక్ల పాడ్యమి మొదలుకొని ఫాల్గుణ కృష్ణ అమావాస్య వరకు గల కాలాన్ని చాంద్రమాన సంవత్సరం అంటారు. (2). సూర్యుడు మేష రాశిలో ప్రవేశించి మీన రాశి వరకు సంచరించే కాల ప్రమాణాన్ని సౌరమాన సంవత్సరం అంటారు. (3). 30 రోజులకు ఒక నెల చొప్పున 360 రోజులతో పన్నెండు మాసాలు కలిగి ఉండేది సావన మాస సంవత్సరం. (4). అశ్విని నుండి రేవతి వరకు కలిగిన, నక్షత్రాల మీదుగా చంద్రుడు సంచారం చేసే కాలాన్ని ఒక నెలగా, ఇలా పన్నెండు నెలలు అంటే 324 రోజులు కలిగిన కాలం నాక్షత్ర మాన సంవత్సరం.(5). గురువు ఒక రాశిలో ప్రవేశించి ఆ రాశిలో ఉండే కాలానుగుణ్యాన్ని బార్హస్పత్యమాన సంవత్సరం అంటారు. ఇక ఆయనాల విషయానికి వస్తే, ప్రతి సంవత్సరం ఉత్తర, దక్షిణాయనాలు రెండు ఉంటాయి. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన దినం నుండి కర్కాటకం లో ప్రవేశించే వరకు ఉత్తరాయణం, తిరిగి మకరంలో ప్రవేశించే వరకు దక్షిణాయనం. ప్రతి రెండు మాసాలకు కలిపి ఒక ఋతువు. సంవత్సరానికి ఆరు ఋతువులు. చాంద్ర మానం ప్రకారం శుద్ధ పాడ్యమి నుండి అమావాస్య వరకు ఒక మాసం. అవి సంవత్సరానికి పన్నెండు ఉంటాయి. మాసానికి శుక్ల, కృష్ణ రెండుపక్షాలు. దినం అనగా సూర్యోదయం నుండి మొదలై తిరిగి సూర్యోదయంతో ముగిసేది. గ్రహాల పేర్లు ఆధారంగా దినాలకు పేర్ల నిర్ణయాలు జరిగాయి. గణనకు సంబంధించి, అవసరమైన సిద్ధాంత భాగం, ఖగోళ విజ్ఞానం పై ఆధారపడి ఉంటుంది. ఇదే పంచాంగ గణనకు మూలాధారం. గణనకు సంబంధించిన అంశాలను వివరించేవి సిద్ధాంత గ్రంథాలు. సూర్య: పితామహెూ వ్యాస: వసిష్ఠోత్రి పరాశర: కాశ్యపో నారదో గర్గ: మరీచిర్మనురంగిరా: లోమశ: పౌలిశశ్చైవ చ్యవనో యవనో భృగు: శైనకోష్టాదశ హ్యేతే జ్యోతిష శాస్త్ర ప్రవర్తకా: అని మన ప్రాచీన జ్యోతిష సిద్ధాంత కారుల గురించి శ్లోకాధారం. తర్వాతి కాలంలో, భాస్కరాచార్యుడు, వరాహమిహిరుడు, బ్రహ్మ గుప్తుడు, ఆర్యభట్టు తదితర సిద్ధాంత గ్రంథ కర్తలు ఎందరో ఉన్నారు. వరాహ మిహిరుడు తదితరులు పంచాంగ రూపంలో రాయడానికి అవసరమైన, విధానాలను రూపొందించారు. వాటిని తంత్ర గ్రంథాలు అంటారు. గణేశ దైవజ్ఞాది పండితులు కరణ గ్రంథాలను రచించారు. పంచాంగ గణన సులభం చేశారు. ప్రస్తుత కాలంలో, గ్రహలాఘువం, గణకానందం, నర కంఠీరవం, తిథి రత్నావళి, తిథి చంద్రిక తదితరాలు అందుబాటులో ఉన్నాయి. మానవుడు దైనందిన జీవితంలో ఎన్నో రకాల పనులు చేస్తూ ఉంటాడు. అవి ఎలాంటి ఆటంకాలు లేకుండా, సత్ఫలితాలు పొందడానికి, విజయవంతంగా పూర్తి కావడానికి ఉచిత సమయంలో, ప్రారంభించడం అవసరం. కాల ప్రవాహంలో ఎలాంటి సమయం, సదరు వ్యక్తికి అనుకూల లేదా వ్యతిరేక ఫలితాలను ఇస్తుందో, తెలుసు కోడానికి పంచాంగం ఉప యుక్తమవుతుంది. ప్రధానంగా భారత దేశంలో, ప్రతి శుభ, అశుభ కార్యక్రమానికి పంచాంగం ద్వారా ముహూర్తాన్ని లెక్కించి, దానిని ఆచరించడం అనాదిగా వస్తున్న ఆచరణ. పంచాంగాన్ని విశ్వసించే మానవుడు, జన్మించింది మొదలు మరణించే వరకు, ప్రతి కార్యక్రమంలో పంచాంగాన్ని అనుసరిస్తున్నాడు. ఒకనాడు యజ్ఞ, యాగాది క్రతువులకు, సాంప్రదాయ సత్కర్మలకు ముహూర్తాలు నిర్ణయిం ప బడగా, నేడు బారసాల, కేశఖండనం, వివాహం, నామకరణం,గృహాది నిర్మాణ ప్రారంభాలు, ప్రవేశాలు, వ్రతాలు, పూజలు, ఒక్కటేమిటి అన్నింటికీ, హైందవ జీవన విధానంలో పంచాంగానికి విడదీయలేని, సంబంధం అనుబంధం ఉంది.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# ఆరోగ్యకరం... నింబ కుసుమ సేవనం



వేప పువ్వు గుణ వంతమైన ఓషధి. రక్తాన్ని శుద్ధి చేసి, వృద్ధి పరిచే గుణం కలిగి ఉంటుంది. వైద్యానికి చాలావరకు ఉపయోగించే వేప చెట్టుకు ప్రాధాన్యత ఉంది. వృక్ష సర్వాంగాలు వైద్యానికి ఉపయుక్తాలే. ప్రధానంగా రోగ క్రిమి నాశని (యాంటీ బయాటిక్) గా వాడటం కద్దు. మానవునికి ఆరోగ్య ప్రదాయిని అయిన వృక్ష రాజా లలో వేప ముఖ్యమైనది. స్వర్గలోకంలో ని “Ambrosia” వృక్షం యొక్క అంశతో, భూలోకాన “వేపచెట్టు” పుట్టిందని, మహారాష్ట్ర సంప్రదాయక విజ్ఞానం స్పష్ట పరుస్తున్నది. ప్రాణవాయువు మూలాధారమైన వేప వృక్ష గాలి ఆరోగ్య ప్రధానమైనదని, విజ్ఞాన శాస్త్రం స్పష్టం చేస్తున్నది. వేపపువ్వు, వేప ఆకు రెండూ ఉపయోగకరమైనవి. ఆయుర్వేద వైద్యులు వేపాకు విరివిగా వాడతారు. చర్మవ్యాధులకు పచ్చి వేపాకు నలుగు పెడతారు. అమ్మవారి జబ్బులలో రోగులకు, ఆకులు దట్టంగా ఉండే వేప రొట్ట వాడుతారు. వ్యాధులు సోకకుండా, ఇళ్ళ ముంగిళ్ళలో వేపాకు తోరణాలు కడుతుండడం, సర్వత్రా దర్శనమిచ్చే దృశ్యం. వసంత రుతువు సంబంధిత పర్వదినమైన ఉగాదినాడు దొరికే వేప పువ్వు వాడమనే పెద్దల ఉద్దేశం, ప్రాప్త కాలజ్ఞతకు నిదర్శనం. ఆ ఆచారమే సంప్రదాయ సిద్ధం, స్తవనీయం, సర్వోత్తమం. ప్రకృతి ఆరాధనకు పెరు మోసిన మన పెద్దలు, రుతు సంబంధమైన ఆయా పండుగల కార్యకలాపాలలో, ఆయా రోజులలో లభ్యమయ్యే, ప్రకృతి పదార్థాలకు, వేదాంతార్థంతో కలిపి ప్రాధాన్యత కల్పించారు. రాగల కష్టాలను, సుఖాలను అనుభవించడానికి, సంసిద్ధంగా ఉంటామని సూచించడానికి, “ఉగాది” నాడు, “నింబ కుసుమ భక్షణం”, “పచ్చడి సేవనం” విధిని కల్పించారు. వేప చెట్టుకు వృక్ష శాస్త్ర నామం Helia azadirachta అని. ఇందులో Helia అన్నది గ్రీకు పదం. azadirachta అన్నది పారశీక తద్భవం. పారశీక భాషలో వేప చెట్టుకు,Helia azadirachta అని పేరు. దీనికి ఉత్తమ వృక్షం అని అర్థం పంచాంగంలో “నింబ కుసుమ భక్షణం” అని ఉన్నా, “ధర్మసింధువు” ఈ పర్వపు ఆచరణ విధానంలో “నింబ పత్రాషనం” అని ఉంటుంది. దీనినిబట్టి ఉగాదినాడు వేపాకు తినాలని స్పష్టమవుతున్నది. పువ్వైనా, ఆకైనా, వేప చెట్టుకు సంబంధించినవి సేవించడం ఉగాది విధాయక కృత్యాలలో ఒకటిగా మత గ్రంథాలు తెలుపుతున్నాయి. పొరుగు వారైన కర్ణాటక వారు అరవ వారు, ఉగాది రోజులు వేరైనా, ఆనాడు ప్రత్యేకంగా వేప వాడతారు. తెలుగువారితో సంపర్కం ఉన్న తావులలో వారిలాగే వేప పువ్వులు ఉగాది పచ్చడికి వినియోగిస్తారు.ఇక మాళవ, మహారాష్ట్ర, వంగ దేశస్తులు ఉగాది నాడు వేపపువ్వు కాకుండా వేపాకులను వాడతారు. మాళవ దేశస్థులు ఉగాది నాడు, వేపాకులను ముద్దగా నూరి సేవిస్తారు. వంగ దేశస్థుల ఉగాది తెలుగు వారి కంటే నెల రోజుల అనంతరం రావడం చేత, వేపపువ్వు అప్పటికి అరుదుగా లభించే కారణంగా వేపాకు వాడతారు. తెలుగునాట ఉగాది నాటికి వేపచెట్లు, ముమ్మరంగా పోతపోసి ఉంటాయి. అందుకే మన పూర్వీకులు వేప వృక్ష సంబంధిత కొత్త చిగుళ్ళను ఉగాది పర్వదినాన తినడాన్ని నిర్ణయించారు. వేప పువ్వు పచ్చడి ఉగాది నాడు మాత్రమే తినడమే కాదు, దాని లభ్యతను బట్టి విశేషంగా సేకరించి, ఎండబెట్టి ఉంచుకొని, ఏడాది పొడుగునా వేయించుకుని కూరలో, పచ్చడి గానో చేసుకుని, దానితో చారు కాచుకొని సేవిస్తూ, రక్తశుద్ధి, రక్త వృద్ధిని కలిగించుకోవడం, ఆరోగ్య కాముకుల ఆచరణ. “ఉగాది పండుగ నాడు ఏమి చేస్తే, ఏడాది పొడవునా అదే చేస్తుంటారు” అనే నానుడి, వేపపువ్వు వాడకం విషయంలో వాస్తవమే అనిపిస్తుంది. **రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# బియ్యం బకాయిలపై చర్యలకు సిద్ధం!

సిరిసిల్ల: జిల్లాలోని రైస్‌మిల్లుల్లో సీఎంఆర్ బకాయిల వసూలుకు పౌరసరఫరాలశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం 2024-25 సంవత్సరం వానాకాలానికి సంబంధించి మిల్లర్లు సీఎంఆర్ అందిస్తున్నారు. దీనిలో మిల్లులకు కేటాయించిన ధాన్యం నిల్వలను అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపడుతున్నారు. ఇటీవల తంగళ్లపల్లి మండలంలోని ఓ రైస్‌మిల్లుకు కేటాయించిన ధాన్యంలో ఇప్పటికీ సీఎంఆర్ పెట్టకపోగా కేటాయించిన ధాన్యంలో సగానికిపైగా తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై విచారణ నివేదికను కలెక్టర్‌కు అందించారు. గతంలో మిల్లర్లుకు కేటాయించిన ధాన్యంకు సరిపడా సీఎంఆర్ ఇవ్వని వారిపై ఆర్ఆర్ యాక్టు (రెవెన్యూ రికవరీ చట్టం) అమలు చేసేందుకు కూడా వెనుకాడలేదు. ఈ సారి కలెక్టర్ ఎలాంటి చర్యలు ఉంటాయనేది వేచిచూడాలి.

**పక్కదారి పట్టిస్తే దొరికిపోతారు..**

జిల్లాలో సీఎంఆర్, ఎఫ్‌సీఐలకు అప్పగిపంచాల్సిన బియ్యంలో అనేక అక్రమాలు జరిగేవి. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేయడం.. మరోవైపు ఒక సీజన్ బియ్యం మరోసీజన్‌లో కేటాయిస్తుండటంతో జాప్యం జరుగుతుండేది. దీంతోనే మిల్లర్లుకూడా నెట్టుకొస్తుండేవారు. గత



వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం కచ్చితంగా ఒక సీజన్‌లోని ధాన్యం తిరిగి ఆ సీజన్ రాకముందే అప్పగించాలనేది నిబంధన పెట్టింది.

జిల్లా వ్యాప్తంగా 2021 నుంచి 2023 వరకు బియ్యం కేటాయించని 52 రైస్ మిల్లులను గుర్తించారు. వీరు అప్పగించాల్సిన బియ్యంపై 20 శాతం అదనంగా బ్యాంకు గ్యారంటీలు ఇచ్చినవారికే ధాన్యం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రాల నుంచి ధాన్యం తరలింపులో జాప్యం.. నిల్వలు పేరుకుపోతున్నాయని ఒప్పంద పత్రంతో మిల్లులకు ధాన్యం కేటాయించారు.

వానాకాలం ధాన్యం సేకరణలో దొడ్డు, సన్నరకాలకు గన్నీ సంచులపై ప్రత్యేక ముద్రతో గుర్తింపును ఇచ్చారు. దీంతో మిల్లులకు అధికారులు ఎప్పుడు వెళ్లి తనిఖీ చేసినా గన్నీ సంచులపై ఉన్న ముద్రల ఆధారంగా తెలుస్తుంది. పక్కదారి పట్టించేందుకు అవకాశం ఉండదు.

సీఎంఆర్ లక్ష్యాలపై మిల్లర్లకు రోజువారీ లక్ష్యాలను నిర్ణయించారు. వాటిపై పౌరసరఫరాలశాఖ ఎప్పటికప్పుడు లక్ష్యసాధనలో వెనుకబడిన వారిని గుర్తిస్తున్నారు. సీఎంఆర్ ఇవ్వని మిల్లులను ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. ఎంతకీ వినని మిల్లులపై అధికారులు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి, వేములవాడ ప్రాంతాల్లోని మిల్లులు తీసుకున్న ధాన్యానికి బియ్యం ఇవ్వని వాటిని గుర్తించారు.

## ఈసారి వడ్ల సేకరణ.. వేర్వేరుగా..

ఖమ్మం: యాసంగి ధాన్యం సేకరణకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వం బోనస్ ప్రకటించటంతో ఎక్కువ మంది రైతులు సన్నరకాల వరి సాగుకే మొగ్గుచూపారు. అందుకే గతం కన్నా ఈసారి యాసంగిలో ధాన్యం సేకరణ లక్ష్యం గణనీయంగా పెరిగింది. ఉభయ జిల్లాల్లో 488 కొనుగోలు కేంద్రాల ద్వారా 6,12,151 మెట్రిక్ టన్నుల వడ్లను అధికారులు సేకరించనున్నారు. దొడ్డు, సన్నరకాల ధాన్యం సేకరణకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. ఎండల తీవ్రత దృష్ట్యా కేంద్రాల వద్ద రైతులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు.

**ఉభయ జిల్లాల్లో..**

గతంలో యాసంగి సీజన్లలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి ఉభయ జిల్లాల్లో అత్యధికంగా వరి సాగైంది. ఖమ్మం జిల్లాలో 1,38,281



ఎకరాల్లో సన్నాలు, 87,029 ఎకరాల్లో దొడ్డురకాలను రైతులు సాగుచేశారు. 5,45,151.60 (సన్నాలు- 3,16,206.80, దొడ్డురకాలు- 2,28,944.80) మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల సంస్థ అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. భద్రాద్రి జిల్లాలో ఈసీజన్‌లో 35వేల ఎకరాల్లో సన్నాలు, 21వేల ఎకరాల్లో దొడ్డు రకాలు, మరో 7వేల ఎకరాల్లో విత్తన రకం వరి సాగైంది. 67,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సమాయత్తమవుతున్నాం. ఏప్రిల్ 1 నుంచి క్రమేణా కొనుగోలు కేంద్రాలు తెరుస్తాం. సన్నాలు, దొడ్డు రకాల వడ్లను వేర్వేరు కేంద్రాల ద్వారా సేకరిస్తాం. వేసవి తీవ్రత దృష్ట్యా కేంద్రాల వద్ద చలివేంద్రాలు, టెంట్లు ఏర్పాటుచేస్తాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతాం.

- శ్రీలత, డీఎం, పౌరసరఫరాల సంస్థ, ఖమ్మం

కొనుగోలు కేంద్రాలు ఇలా..

సన్నాలు, దొడ్డు రకాల ధాన్యం సేకరణకు ఈసారి వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. డీఆర్‌డీఏ, పీఏసీఎస్, డీసీఎంఎస్, మెప్మా ఆధ్వర్యంలో వడ్లు సేకరించనున్నారు. ఖమ్మం జిల్లాలో సన్నాల సేకరణకు 282, దొడ్డురకాల కోసం 62 కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచనున్నారు. భద్రాద్రి జిల్లాలో 144 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

టార్పాలిన్లు, పాడీ క్లీనర్స్, తేమశాతం యంత్రాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు. ఖమ్మం జిల్లాకు 64,62,326 గన్నీసంచులు అవసరమవుతాయని భావిస్తున్నారు. ప్రస్తుతానికి 1,93,9293 గన్నీసంచులు అందుబాటులో ఉన్నాయని చెబుతున్నారు. భద్రాద్రి జిల్లాలో 15 లక్షల గన్నీసంచులు అవసరమవుతాయని, 7.50 లక్షల గన్నీసంచులు అందుబాటులో ఉన్నాయంటున్నారు. మిగతా సంచుల కోసం టెండర్ ప్రక్రియ నడుస్తోందని తెలిపారు.

# ఇంకేది కొంత.. వాడేది అంతా



హైదరాబాద్ : ప్రాణాధారమైన భూగర్భజలాలు నగరంలో అంతకంతకూ తగ్గుతున్నాయి.. 1.3 కోట్లమంది ఉండే జీహెచ్ఎంసీ పరిధిలో కీలకమైన అత్యంత ప్రధానమైన ప్రాంతాల్లో భూగర్భజలాల పరిస్థితి దారుణంగా ఉంది. చాలాప్రాంతాల్లో ఏటా వర్షాలతో భూమిలో ఇంకే నీటికంటే వినియోగించే భూగర్భజలాలే ఎక్కువగా ఉంటున్నాయి. నగరంలో సాధారణ వర్షపాతం కంటే 31శాతం ఎక్కువ నమోదైనా జనవరి నుంచే జలాలు అడుగంటుతున్నాయి.

భారీగా నిర్మాణాల కారణంగా నీటి వినియోగం అధికమవుతోంది. దీంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోంది.

ఏటా భూమిలో ఇంకే నీటి కంటే ఎక్కువ వినియోగం ఉండే ప్రాంతాలను ఓవర్ ఎక్స్‌ప్లాయిటేషన్ ప్రాంతాలుగా ప్రకటిస్తారు. ఈ ప్రాంతాల్లో భూగర్భజలాల వినియోగంపై నియంత్రణ అమల్లో ఉంటుంది.

క్రిటికల్, సెమీ క్రిటికల్‌గా ప్రకటించిన ప్రాంతాల్లో కూడా భూగర్భజలాల వినియోగంలో ప్రత్యేక నిబంధనలు పాటించాలి.

ఇష్టారాజ్యంగా వినియోగం

నగరంలో భూగర్భజలాల వినియోగంలో ఎక్కడ నిబంధనలు అమలు కావడంలేదు. నియంత్రణ లేకుండా 1500-1800 అడుగుల లోతు వరకూ బోర్లు వేస్తున్నారు.

భూగర్భజలాల వినియోగంలో ప్రైవేటు ట్యాంకర్ల దందా కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత ప్రాంతాల్లో బోర్లు వేసి తోడేస్తున్నారు.

వాణిజ్య అవసరాలకు వినియోగించే బోర్లకు విధిగా భూగర్భజల శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉన్నా ఈ నిబంధన అమలు కావడంలేదు.

జీహెచ్ఎంసీ పరిధిలో అత్యధిక భూగర్భజలాల వినియోగ ప్రాంతాలు ఓవర్ ఎక్స్‌ప్లాయిటెడ్ ప్రాంతాలు: (రీఛార్జ్‌లో వందశాతంకంటే ఎక్కువ భూగర్భజలాల వినియోగం) అమీర్‌పేట, హిమాయత్‌నగర్, బాచుపల్లి, హయత్‌నగర్, శేరిలింగంపల్లి, సరూర్‌నగర్, ఖైరతాబాద్, షేక్‌పేట, సికింద్రాబాద్, చార్మినార్, అంబర్‌పేట, గోల్కొండ, ఆసిఫ్‌నగర్, సైదాబాద్.

క్రిటికల్ ప్రాంతాలు (రీఛార్జ్‌లో 90-100శాతం వరకు వినియోగం) మారేడుపల్లి, బండ్లగూడ, బహదూర్‌పుర, నాంపల్లి, రాజేంద్రనగర్, తిరుమలగిరి, కీసర, మల్కాజిగిరి.

సెమీ క్రిటికల్ ప్రాంతాలు (రీఛార్జ్‌లో 70-90శాతం వినియోగం) మేడ్చల్, ఆల్వాల్, ఘట్‌కేసర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్.

# మూసీ.. పాడవుతున్న ఏసీ



హైదరాబాద్ : ఏసీ మరమ్మతుకు గురైతే ఒకేసారి రూ.5వేల నుంచి రూ.8వేల వరకు ఖర్చవుతోంది. రిఫ్రిజిరేటర్ లేదా టీవీ పాడైతే రూ.5వేలు సమర్పించుకోవాల్సిందే. విడిభాగాలు మారిస్తే జేబుకు చిల్లు పడినట్టే. మూసీ పరీవాహక ప్రాంతాల్లోని సామాన్యుల ఆవేదన ఇది. ఫార్మా, బల్క్‌డ్రగ్ పరిశ్రమలు నిత్యం వ్యర్థ జలాలను మూసీలో వదులుతుండటం ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. జలాల నుంచి కుళ్లిన కోడిగుడ్డు వాసనతో వెలువడుతున్న హైడ్రోజన్ సల్ఫైడ్ ఎలక్ట్రానిక్ ఉపకరణాల్లోని విడిభాగాలు తుప్పు పట్టేలా చేస్తోంది.

**ప్రభావం ఇదీ..:** హైడ్రోజన్ సల్ఫైడ్ ఎయిర్ కండిషనర్ భాగాల్లో ముఖ్యంగా రాగి కాయిల్‌లు తుప్పుపట్టడానికి కారణమవుతోంది. దీంతో లీకేజీలు, బ్రేక్‌డౌన్ వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఏసీ పనితీరు సామర్థ్యాన్ని తగ్గించి విద్యుత్ వినియోగం, నిర్వహణ ఖర్చులను పెంచుతోంది. ఈ వాయువు గాలిలోని తేమతో చర్య జరిపి సల్ఫ్యూరిక్ ఆమ్లం లేదా ఇతర సల్ఫర్ సమ్మేళనాలను ఏర్పరిచి ఏసీలోని కాపర్ కాయిల్‌లు, ట్యూబింగ్, ఇతర భాగాల పనితీరుపై ప్రభావం చూపుతాయని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారి డి.ప్రసాద్ తెలిపారు. ఐఐటీ మద్రాస్‌లోని ఇంజినీరింగ్ విభాగం తన అధ్యయనంలో ఇదే విషయాన్ని ధ్రువీకరించింది.

**పుట్టగొడుగుల్లా మరమ్మతు కేంద్రాలు**

గండిపేట, బాపూఘాట్, ముసారాంబాగ్ బ్రిడ్జి, నాగోల్ బ్రిడ్జి, పీర్జాదిగూడ, ప్రతాపసింగారం వరకు మూసీ నది నీటి నాణ్యతను పీసీబీ పరీక్షిస్తోంది. గండిపేట వద్ద మినహా ఇతర ప్రాంతాల్లో డీవో(డిజాల్వ్‌డ్ ఆక్సిజన్), బీవోడీ (బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్) నిర్దేశిత మోతాదులో లేకపోవడం గమనార్హం. ఫలితంగా లంగర్‌హౌజ్, రాజేంద్రనగర్, కార్వాన్, చాదర్‌ఘాట్, నయాపూల్, గోల్నాక, మూసానగర్, శంకర్‌నగర్, ఇబ్రహీంబాగ్, ఉప్పల్, నాగోల్, మలక్‌పేట్ తదితర ప్రాంతాల్లో కాలుష్య ప్రభావం ఉంటోంది. దీంతో ఏసీల మరమ్మతు కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి.

**మెట్రోరైళ్ల రాకపోకలపై ప్రభావం**

మెట్రో రైళ్ల ప్రయాణాలపైనా ఈ కాలుష్య ప్రభావం ఉంటోంది. ఉప్పల్ నుంచి రాకపోకలు సాగించే సమయంలో సాంకేతిక సమస్యలకు ఈ కాలుష్య కారకాలే కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మురుగు బాగా పేరుకుపోయిన చోట, కలుషిత జలాలతో వాతావరణంలోకి వెలువడే హైడ్రోజన్ సల్ఫైడ్ వల్లే ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. **ఉపరిత జల ప్రవాహమే పరిష్కారం...**

మరమ్మతులు, టెక్నీషియన్ల సూచన మేరకు వేసే రంగులతో తాత్కాలిక పరిష్కారం లభిస్తుందని, ఉపరితల జలాల ప్రవాహం ఎప్పుడూ పారుతూ ఉంటే వాయువు విడుదలవ్వదని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వెల్లడించారు.

కుళాయిలు..గొళ్లాలు సైతం..

హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు కారణంగా ఇంట్లోని వస్తువులు సైతం రంగు మారుతాయని నిపుణులు చెబుతున్నారు. వెండి సామగ్రి, కుళాయిలు, తలుపుల హ్యాండిల్స్, గొళ్లాలు పాడైపోతున్నాయని మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

పీసీబీ లెక్కల ప్రకారం..


మూసీకి ఐదు హాట్‌స్పాట్‌లుండగా.. ఇందులో హైదరాబాద్ జిల్లాలో రెండు, మేడ్చల్‌లో ఒకటి, రంగారెడ్డి జిల్లాలో రెండు ఉన్నాయి.

194 పరిశ్రమల నుంచి 5.65 మిలియన్ లీటర్ల వ్యర్థజలాలు వస్తుండగా...వాటిని శుద్ధి చేసి అక్కడే పునర్వినియోగిస్తున్నట్లు పీసీబీ చెబుతోంది.

మరో 326కి పైగా పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు వెళ్తున్నాయి. అక్కడ శుద్ధి చేశాక ప్రతిరోజూ 4 మిలియన్ లీటర్ల జలాలు అంబర్‌పేట వద్ద నదిలో కలుస్తాయి.

నిర్దేశిత ప్రమాణాల మేరకు శుద్ధి జరిగితే మూసీ మురికికూపంగా మారదు. అంబర్‌పేట తర్వాత ఉప్పల్, మల్లాపూర్, నాచారం పారిశ్రామికవాడల నుంచి వచ్చే జలాలు ఉప్పల్ నల్లచెరువు కింద కలిసే వ్యర్థాలతో మూసీ తీవ్ర కాలుష్యం బారిన పడుతోంది. దిగువన ఘట్‌కేసర్, హయత్‌నగర్‌లోని పరిశ్రమలు సైతం మూసీని కలుషితం చేస్తున్నాయి.

# 129.47 శాతం ఆదాయం



జగిత్యాల : జిల్లాలోని 13 వ్యవసాయ మార్కెట్ యార్డులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.15.98 కోట్ల మార్కెట్‌ఫీజు వసూలు లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటి వరకు రూ.20.69 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో దినుసుల బీటు, మామిడి మండీ, మిల్‌పాయింట్లు, పశువుల వారసంతలు, దిగుమతులు తదితరాలతో పాటు సివిల్ సప్లయిస్ ధాన్యం కొనుగోలు, మార్క్‌ఫెడ్ కందులు, మక్కల కొనుగోలు, గోదాముల అద్దె తదితరాల ద్వారా ఆదాయం సమకూరింది. సన్నధాన్యం, పత్తి, మామిడి, నువ్వులు, మినుములు, సెనగలు, పెసలు, మక్కలు, అలసందలు తదితర ఉత్పత్తుల క్రయవిక్రయాలు మండీలతో పాటు గ్రామాల్లోనూ పెద్దఎత్తున సాగుతాయి. పలు ఉత్పత్తులను మధ్యవర్తులు కొన్నపుడు పూర్తిస్థాయిలో మార్కెటు ఫీజు వసూలు కావటంలేదు. జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి, ధర్మపురి, గొల్లపల్లి, మల్యాల తదితర కొన్ని యార్డుల్లోనే దినుసుల క్రయవిక్రయాలు సాగుతుండగా మిగిలిన అన్ని యార్డుల్లోనూ నిరంతరం ఉత్పత్తుల సేకరణ జరిగేలా ఏర్పాట్లు చేయాలి. సారంగాపూర్ తదితరచోట్ల నూతన మార్కెట్ల ఏర్పాటు, పూర్తి స్థాయిలో ఫీజు వసూలు, ఈనామ్ విస్తరణ, రైతుబంధు అమలు తదితరాలతో రైతులకు విక్రయ అవకాశాలు మరింత మెరుగవుతాయి.

రైతులకు మరిన్ని సేవలు- ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

జిల్లాలోని అన్ని యార్డుల ద్వారా రైతులకు సేవలను విస్తరిస్తాం. రైతులు, అధికారులు, సిబ్బంది, వ్యాపారుల సహకారంతో లక్ష్యాన్నిదాటి మార్కెట్లకు ఆదాయం సమకూరింది. మామిడి ఎగుమతికి, మార్క్‌ఫెడ్ ద్వారా కందులు, మక్కల కొనుగోలుకు చర్యలు తీసుకుంటాము.

# కోవెల విస్తరణతోనే అభివృద్ధికి శ్రీరామరక్ష..!

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి కల్యాణ బ్రహ్మోత్సవాలను అట్టహాసంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను తీసుకొని ఏప్రిల్ 6న జరిగే కల్యాణానికి వస్తారనే సమాచారం అందటంతో ఏర్పాట్లలో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. గతంలో ఎప్పుడూ లేనంత విధంగా ఈసారి సీఎం రాకపై ఆసక్తి నెలకొంది. శ్రీరామనవమి ఉత్సవాలకు ప్రభుత్వం ప్రత్యేక నిధి కేటాయించాలని, ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.15వేలను పెంచాలని భక్తులు కోరుతున్నారు. 2017 నుంచి ప్రతిపాదన దశకే పరిమితమైన రామాలయం బృహత్తర ప్రణాళికకు నిధులు కేటాయిస్తే కోవెలను విస్తరించవచ్చునని ఆశిస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిసారిస్తే..

ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ ఆగ్యుమెంటేషన్ డ్రైవ్) పథకం ద్వారా పర్ణశాల, భద్రాచలంలో చేపట్టిన పనులు శ్రీరామనవమి నాటికి పూర్తవుతాయని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే వసతి, క్యాంటీన్, పార్కింగ్ సదుపాయాలు మెరుగుపడతాయి. రామాలయంలో రోజుకు 2వేల మందికి



అన్నదానం చేయాలని భావిస్తున్నందున 'ప్రసాద్' పథకంలోకి ఈ విభాగాన్ని మార్చే ఆస్కారముంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టిసారిస్తే పురుషోత్తపట్నం భూసమస్య పరిష్కారమవుతుంది. ఈ వివాదానికి స్వస్తి పలికితేనే గోశాలను విస్తరించవచ్చు. విద్యార్థులకు వేదస్మార్త పాఠశాల నెలకొల్పవచ్చు.

**బృహత్తర ప్రణాళిక అమలైతే..**

సెలవు రోజుల్లో 30వేల మంది భక్తులు వస్తేనే ఆలయం కిక్కిరిసిపోతుంది. బృహత్తర ప్రణాళిక అమలైతే కోవెల ప్రాంగణాన్ని విస్తరించవచ్చు. వసతులు మెరుగుపడతాయి. రోజుకు 60వేల మంది స్వామివారిని దర్శించుకోవచ్చు.

2016లో బృహత్తర ప్రణాళిక అమలుకు అప్పటి ప్రభుత్వం రూ.100కోట్లను మంజూరుచేసింది. సర్వేలు చేసినప్పటికీ పైసా పనికాలేదు. ఇప్పటికైనా బృహత్తర ప్రణాళిక నిధులు కేటాయిస్తే ఎకరంలోని ఆలయం మూడెకరాలకు పైగా విస్తరించనుంది. ఇప్పుడున్న ప్రాకారంతో పాటు మరో కొత్త ప్రాకారం అందుబాటులోకి వస్తుంది.

మాడవీధుల విస్తరణకు నిధులు వచ్చినందున ఆప్రాంతంలోని ఇళ్లను తొలగిస్తే ఖాళీ ప్రదేశం నుంచి దేవుడిని ఊరిగించే వెసులుబాటు లభిస్తుంది. రాకపోకలు సులభంగా ఉండేలా తూర్పు, పడమర మెట్లను పండితుల సూచనల ప్రకారం నిర్మించాల్సి ఉంటుంది.

రామాలయం నుంచి గోదావరి వరకు ఫుట్ బ్రిడ్జిని ఏర్పాటుచేయవచ్చు. రామాలయం నుంచి నరసింహస్వామి ఆలయానికి, రామాలయం నుంచి హరనాథ్‌బాబా ఆలయం గుండా రంగనాయకుల గుట్ట వరకు పైవంతెన నిర్మిస్తే యాత్రికులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

మిథిలా మండపం 25వేల మందికే సరిపోతుంది. దీన్ని విస్తరించేందుకు స్థలం అవసరం.

# ఇసుక కనిపిస్తే మాయం

కోహెడ : ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. వాహనాలు పట్టుకున్నప్పుడు కొన్ని రోజులు ఆగి.. మరలా దందా కొనసాగిస్తున్నారు. రాత్రిళ్లు వాగులోంచి ఇసుక తరలిస్తున్నారు. కోహెడ మండలంలోని మోయతుమ్మెద వాగు పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వీరి దందాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.

**అనుమతులు లేకుండా..**

మోయతుమ్మెద పరివాహక ప్రాంతాల్లో గత కొన్ని నెలల నుంచి ఇసుక తవ్వకాలు ఇష్టానుసారంగా కొనసాగుతున్నాయి. వందల సంఖ్యలో ఇసుక ట్రిప్పులు నడిచినప్పటికీ అధికారుల అనుమతి లేకపోవడం గమనార్హం. అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే



ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడపాదడపా కొన్ని వాహనాలను సీజ్ చేస్తున్నా.. పూర్తి స్థాయిలో కట్టడి చేయడం లేదు. ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం గండికొడుతున్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల కోసం ఇసుక తరలిస్తున్నామని చెబుతూ.. కొంతమంది ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నారు. సీసీ దారుల నిర్మాణం పేరిట ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. గుట్టలు, చెట్ల పొదల్లో ఇసుకను డంప్ చేస్తున్నారు.

**ఎండిపోతున్న చెక్‌డ్యాంలు**

మోయతుమ్మెద వాగులో నిర్మించిన చెక్‌డ్యాంల పరిసర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల మూలంగా వేగంగా నీరు అడుగంటింది. చెక్‌డ్యాంలు నీరు లేక ఎడారులుగా కనిపిస్తున్నాయి. జనవరి వరకు నిండుకుండలా కనిపించి ఇప్పుడు బోసిపోతున్నాయి. భూగర్భ జలాలు ఇంత త్వరగా అడుగంటడానికి ప్రధాన కారణం ఇసుక తవ్వకాలేనని రైతులు ఆరోపిస్తున్నారు.

**చర్యలు తప్పవు**

ఇసుక కావాలని తమను ఎవరూ అనుమతులు అడగలేదు. ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు. ప్రభుత్వ పనులు, ఇందిరమ్మ ఇళ్లు, సీసీదారుల నిర్మాణం కోసం ఇసుక తీసుకెళ్తే ఇబ్బంది లేదు. సురేఖ, తహసీల్దార్, కోహెడ

చురకలు



# నీరు అక్కడే.. ప్రమాదాలు ఎక్కువే

ధర్మపురి : ధర్మపురి: గోదావరి నదిలో ప్రమాదవశాత్తు మునిగి చాలామంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. పలువురు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. నదిలో కనీస రక్షణ చర్యలు లేకపోవడంతో ఇలాంటి ఘటనలు ఏటా పునరావృతం అవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ధర్మపురి తీరంలోని సత్యవతి గుండంలో మూడు కాలాల్లో.. ఎల్లంపల్లి వెనక జలాల కారణంగా రాయపట్నం, కోటిలింగాల తదితర ప్రాంతాల్లో వేసవిలో నీరు అధికంగా ఉంటుంది. ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. ముందుగా గోదావరిలో స్నానం చేసి ఆలయాలకు వెళ్తారు. పండగల సందర్భంగా రక్షణ చర్యలు చేపట్టే అధికారులు మామూలు రోజుల్లో పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి అవగాహన లేక స్నానానికి దిగి ప్రాణాలు తీసుకుంటున్నారు. ఎల్లంపల్లి వెనకజలాలతో ఇలాంటి ఘటనలు ఎక్కువగా పెరిగాయి. కొందరు జాలర్ల సాయంతో సురక్షితంగా బయట పడుతున్నారు.

**కొన్ని ఘటనలు...**



కరీంనగర్‌కి చెందిన శ్రీమంతుల విఘ్నేష్(32) ఇటీవల కోటిలింగాల గోదావరి తీరంలో నీటి లోతుపై అవగాహన లేక స్నానానికి దిగి మృత్యువాత పడ్డారు.

గత ఏడాది అక్టోబర్ 8న కరీంనగర్‌కి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు ధర్మపురిలోని గోదావరికి స్నానానికి ఒంటరిగా వచ్చింది. నదిలో మునిగి మృతి చెందింది.

అక్టోబర్‌లోనే దుర్గాదీక్ష చేపట్టడానికి ముందు కరీంనగర్‌కి చెందిన ముగ్గురు స్నేహితులు రాయపట్నం వద్ద స్నానానికి వచ్చి.. ప్రమాదానికి గురయ్యారు. అందులో ఒకరు మృతి చెందారు.

**వేసవిలోనే ఎక్కువ**


వేసవిలో ఎండ, సెలవులు కారణంగా గోదావరిలో స్నానాలు చేసేందుకు పిల్లాపాపలతో చాలామంది వస్తుంటారు. ధర్మపురి సత్యవతి గుండం, రాయపట్నం పురాతన వంతెన ప్రదేశం, కోటిలింగాల ఆలయ ముందు ప్రాంతాల్లోనే ఎక్కువగా స్నానాలు చేస్తుంటారు. అవగాహన లోపం, ప్రమాద సూచిక బోర్డులు లేకపోవడం, చెప్పేవాళ్లు లేక నేరుగా నదిలో స్నానాలకు దిగి గల్లంతవడం తరచూ జరుగుతోంది. రాయపట్నం, కోటిలింగాలలో పుష్కరఘాట్ల వరకు నీరు ఉండటంతో లోతు తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి.

**నూతన వంతెనపై రక్షణ కరవు**

రాయపట్నం వద్ద గోదావరిపై నూతన వారధి ఆత్మహత్యలకు కేంద్రంగా మారింది. వంతెనపై నుంచి నదిలోకి దూకి ప్రాణాలు తీసుకుంటున్నారు. మంగళవారమే మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన యువకుడు ప్రాణాలు తీసుకున్నాడు. వంతెన గోడ ఎత్తు పెంచడం లేదా ఎత్తయిన ఇనుప కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. పోలీసు గస్తీని ఏర్పాటు చేయాలి. అనుమానాస్పదంగా కనిపించేవారిపై ఓ కన్నేసి ఉంచాలి. చాలా మంది వంతెనపై ఆగి సెల్ఫీలు తీసుకుంటుడంతో అప్రమత్తంగా ఉండాలి.


# వరి సిరి

జగిత్యాల : ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాష్ట్ర ధాన్యాగారంగా తన పేరును మరోసారి సార్థకం చేసుకొంది. నిరుడు యాసంగిలో 9.15 లక్షల ఎకరాల్లో వరిపంటను సాగుచేయగా ఈ యాసంగిలో 9.36 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరిపంటను రైతులు సాగుచేసినట్లు వ్యవసాయశాఖ బుధవారం నాటి తాజా నివేదిక వెల్లడిస్తోంది. రైతులు నవంబరు నుంచి ఫిబ్రవరి 15 వరకుకూడా పెద్దఎత్తున వరినాట్లు వేశారు. నాలుగు జిల్లాల్లోనూ అధిక వర్షపాతం నమోదు, భూగర్భ జలలభ్యత, ఆయకట్టుకు శ్రీరాంసాగర్, ఎల్‌ఎండీ తదితర ప్రాజెక్టు నీటిని విడుదల చేయటం, వరదకాలువలో నీటినిల్వ తదితర కారణాలతో రైతులంతా వరిసాగుకే మళ్లారు. ఇతర పంటలకు కూలీల కొరత, వన్యప్రాణులు, కోతుల బెడద, ఉత్పత్తులకు మార్కెటింగ్ సమస్య ఉండగా కనీస మద్దతు ధరకు దొడ్డు ధాన్యం సేకరణ, సన్నాలకు బోనస్



చెల్లింపు తదితర కారణాలతో మెజారిటీ రైతులు వరివైపే మొగ్గారు. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా అధికంగా నమోదు కావటం, పంట చివరి దశలో కొన్ని ప్రాంతాల్లోని ఆయకట్టులో కాలువ చివరి భూములకు నీరు చేరకపోవటం, భూగర్భ జలమట్టం పడిపోవటం తదితర కారణాలతో వరిపంట ఎండిపోయి నష్టం వాటిల్లగా అకాలవర్షాలు, ఈదురుగాలులు, వడగళ్లుకూడా పంటను దెబ్బతీశాయి. వ్యవసాయశాఖ తాజా గణాంకాల ప్రకారం నాలుగు జిల్లాల్లోనూ అన్నిపంటల సాగు విస్తీర్ణం వందశాతం దాటింది. వరి తదుపరి 88 వేల ఎకరాల్లో మక్కను సాగుచేయగా నువ్వు, ఆవాలు, జొన్న, సజ్జ, వేరుసెనగ, అలసంద, కంది, పెసర, మినుము, కూరగాయలు తదితర పంటలను విత్తుకున్నారు. ఏప్రిల్ 2వ తేదీతో ఎల్‌ఎండీ ఎగువ ఆయకట్టులోని జోన్-2 పరిధికి, ఏప్రిల్ 9వ తేదీతో జోన్-1కు నీటితడులు ముగియనుండటంతో ఎస్సారెస్పీ నీటిని మరోతడి వదలాలని, ఇతర ప్రాజెక్టుల నీటిని కూడా మరో తడిని పెంచి ఇస్తేనే పంటలు పూర్తవుతాయని కర్షకులు పేర్కొంటున్నారు. దీంతోపాటు పలు ప్రాంతాల్లో నూర్పిడులు మొదలైనందున ధాన్యం సేకరణకు తగిన చర్యలు తీసుకోవాల్సిఉంది.

# మనమెంత భద్రం ?



కరీంనగర్: భద్రాచలంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవనం కుప్పకూలిన ఘటన ఉలిక్కిపాటుకు గురి చేసింది. కొందరు మృతి చెందిన తీరు అందిరిని కలిచివేసింది. మరి కరీంనగర్ జిల్లా పరిస్థితి ఏంటని కళ్ల ముందు మెదిలింది. కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు హుజూరాబాద్, జమ్మికుంట, కొత్తపల్లి, చొప్పదండి, శంకరపట్నంలాంటి పట్టణాల్లో బహుళ అంతస్తులు నిర్మాణమవుతున్నాయి. మన భవనాల భద్రత ఎంతనేది ప్రశ్నార్థకంగా మారింది.

**నాణ్యతకు తిలోదకాలు**

కేవలం ప్రభుత్వ భవనాల నిర్మాణం విషయంలోనే ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణశైలిని గమనిస్తున్నారు. ఇళ్లు, వాణిజ్య సముదాయాల పరంగా కనీస నిబంధనలను పాటించని నిర్మాణాలే అధికంగా ఉంటున్నాయి. అనుమతులు ఇచ్చింది.. మొదలు అది ఏ తరహాలో పూర్తి చేస్తున్నారనే కోణంలో బల్దియాలోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పరిశీలించాలి.

కేవలం సెట్ బ్యాక్ నిబంధన మాత్రమే చూస్తున్నారు. సెల్లార్ల నిర్మాణం, ఫిల్లర్ల పరిమాణం, అదనపు అంతస్తులను పట్టించుకోవడంలేదు. మరో వైపు గుత్తేదారులు త్వరగా పూర్తి చేయాలనే తపనలో స్లాబ్ వేసిన 10 రోజుల్లోనే మరో స్లాబ్‌ను వేసి నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. జిల్లాలో ఏటా 3500కుపైగా బహుళ అంతస్తుల ఇళ్లకు అనుమతిస్తున్నారు. వాణిజ్య సముదాయాల సంఖ్య కూడా దాదాపు ఏటా వెయ్యి దాటుతోంది.

**పాతవాటితో ముప్పే..!**

ఏటా వానాకాలం వచ్చిందటే బల్దియాల్లో పాత భవనాలను గుర్తిస్తూ యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. కొందరు స్వచ్ఛందంగా వాటిని నేలమట్టం చేసుకుంటుండగా ఇంకొన్నింటి విషయంలో నిర్ణీత వ్యవధి ఇస్తున్నారు. ఇంకొన్నింటికి మరమ్మతులకు అవకాశాన్ని కల్పిస్తున్నారు. కానీ ఈ ప్రక్రియ మొక్కుబడిగానే కొనసాగుతుందనే ఆరోపణలున్నాయి.

గతేడాది వర్షాకాలంలో కరీంనగర్‌లో దాదాపు 72 భవనాలకు నోటీసులు జారీ చేశారు. శిథిలావస్థకు చేరి.. ఇబ్బందికరంగా ఉన్నవాటిని తొలగించే అధికారం, బాధ్యత పురపట్టణ ప్రణాళిక విభాగానికి ఉంటుంది. ముఖ్యంగా 80 నుంచి 100 ఏళ్ల వాటి విషయంలో కఠినంగా వ్యవహరించాలి.

ఇక 30-40 ఏళ్ల కిందట నిర్మించిన వాటిలోని డొల్లతనాన్ని, నాణ్యత లేని తీరుని పసిగట్టి దాని వల్ల ముప్పును తెలియజేయాలి. అత్యంత ప్రమాదకరంగా ఉంటే అందులోని వాళ్లను ఖాళీ చేయించి ప్రత్యామ్నాయ ప్రదేశంలో ఉంచాలి.

వాణిజ్య భవన సముదాయాల విషయంలో మరింత పక్కాగా వ్యవహరించాలి. కరీంనగర్‌లో చాలా భవనాలు తాత్కాలిక మరమ్మతులు, పైపైన పూతలతో తీర్చిదిద్ది అద్దెకిస్తున్నారు.

గతంలో నగరంలోని ఓ హెూటల్ ముందు భాగం పై కప్పు పెచ్చులూడిన సందర్భం ఎదురైంది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

ప్రజల భద్రతే ప్రామాణికంగా యంత్రాంగం వీటి విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిన అవసరముంది. తప్పిదం జరిగిన తరువాత బాధపడేకన్నా.. ముందే మేల్కొని ముప్పును నివారిస్తేనే మంచిది.

# ఎరువుల డిమాండ్ తీరినట్టే!



ఎల్లారెడ్డిపేట: జిల్లాలో అక్కడక్కడ కొంతమేర ఎరువుల బస్తాల కోసం అన్నదాతలు నిరీక్షించినప్పటికీ ఎట్టకేలకు ఎరువుల కొరత తీరినట్లయింది. వరి, మొక్కజొన్న యాసంగి సీజన్‌లో ప్రధాన పంటలుగా రైతులు సాగుచేశారు. అందుకు అనుగుణంగా అధికారులు ఎరువులను సరఫరా చేశారు. కొన్నిచోట్ల వరి పైరు ఈనే దశలో ఉండగా మరికొన్ని మండలాల్లో కోత దశకు చేరింది. పంటల దశలను బట్టి ఆయా ప్రాంతాల్లో ఎరువుల వాడకాన్ని నిలిపివేసిన అన్నదాతలు సస్యరక్షణ చర్యలపై దృష్టి సారించారు. జిల్లాలో దాదాపుగా ఎరువుల అవసరం తీరగా మిగులు బస్తాల నిల్వలు ఉండడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**పంటలు.. పంపిణీ**

యాసంగిలో జిల్లాలో వివిధ రకాల పంటలను కలుపుకొని మొత్తం సుమారుగా 1,77,436 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో దాదాపుగా 1,74,811 ఎకరాల్లో వరి, 1431 ఎకరాల్లో మొక్కజొన్న, 178 ఎకరాల్లో శనగ, 35 ఎకరాల్లో పెసర, 27 ఎకరాల్లో వేరుసెనగ, 805 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 315 ఎకరాల్లో నువ్వులు, 317 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతాయని భావించారు. ఇందుకు అనుగుణంగానే ఎరువుల సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించారు.

పంటకాలం పూర్తయ్యే సరికి దశలవారీగా 21,811 మెట్రిక్ టన్నుల యూరియా, 3359 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4607 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 11,516 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 1440 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువుల అవసరం అవుతాయని లెక్కించారు.

ఈ యాసంగిలో 1,78,350 ఎకరాల్లో వరి, 1975 ఎకరాల్లో మొక్కజొన్న, 300 ఎకరాల్లో శనగ, 43 ఎకరాల్లో పెసర, 26 ఎకరాల్లో వేరుసెనగ, 1206 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 109 ఎకరాల్లో గోధుమ, 232 ఎకరాల్లో నువ్వు పంటలను సాగు చేశారు.

పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి 24,370 మెట్రిక్ టన్నుల యూరియా, 3200 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4387 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 10968 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 1371 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులను సరఫరా చేశారు. జిల్లా మొత్తానికి ఎరువులు సరిపడగా ఇంకా వివిధ రకాల ఎరువుల బస్తాల నిల్వలు మిగిలి ఉన్నాయి.

# చెరువుల బాగుకు టెండర్ల గండం!



కరీంనగర్: పట్టణాల్లో అమృత్ 2.0 నిధులతో చెరువులను బాగు చేయాలనే లక్ష్యం నీరుగారుతోంది. ఓ వైపు నిధులు లేక కొన్నిచోట్ల చెరువులు కబ్జాలకు గురవుతుంటే.. మరోవైపు చెరువుల బాగు కోసం వచ్చిన నిధులు ఖజానాలో మూలుగుతున్నాయి. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ పట్టణ ప్రాంతంలో ఎంపిక చేసిన చెరువులను అభివృద్ధి చేయాలని భావించింది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని 19 తటాకాలను పునరుద్ధరించేందుకు గతేడాది జులైలో రూ.51.21 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులు అందుబాటులో ఉన్నా.. ఇప్పటికీ టెండర్లు పూర్తి కాకపోవడంతో చేపట్టాల్సిన పనుల్లో విపరీతమైన జాప్యం జరుగుతోంది. కట్టల ఆధునీకీకరణ, వాననీటి కాలువలను మెరుగుపర్చడం, పూడిక తీయడం, శుద్ధ నీటి వనరుగా మార్చడం లాంటి పనులతో చిన్ననీటి వనరులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించినా పనులు సాగట్లేదు.

**అదను దాటుతున్నా..** ఇప్పటికే ఈ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయి గుత్తేదారులు సగానికిపైగా పనులు పూర్తి చేయాలి. వానాకాలం వరకు పనులు పూర్తయితేనే వర్షాలకు తటాకాల్లో నీరు చేరుతుంది. కొన్నిచోట్ల ఎక్కడికక్కడే టెండర్లు పిలిచినా పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వీటన్నింటికి ఇటీవల మరోమారు టెండర్లను ఆహ్వానించినా గుత్తేదారులు ఆసక్తి చూపించనట్లు తెలిసింది. కారణాలు విశ్లేషించుకుని టెండర్లు పూర్తి చేస్తేనే పనులు ముందుకు సాగే అవకాశముంది.

**పునరుజ్జీవం చెందేలా..** జనావాసాల నడుమ హద్దులు చెరిగిపోయి ఉన్న పలు చెరువులను ఈ పథకంలో ఎంపిక చేశారు. కేంద్రం కేటాయించిన నిధులను వెచ్చిస్తే ఆ చిన్న నీటి వనరుల రూపురేఖలే మారిపోతాయి. ముఖ్యంగా ఎంపిక చేసిన వాటి నీటి నిల్వ స్థాయి (ఎఫ్‌టీఎల్)ని గుర్తించి విలువైన భూమిని రక్షించుకోవచ్చు. ఈ చెరువు నీటిని శుద్ధి చేసుకుని పట్టణాల తాగునీటి అవసరాలకు ఉపయోగించుకునే అవకాశముంటుంది.

# మిగిలింది అయిదు రోజులే!

పెద్దపల్లి: స్థలాల క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) కింద ప్రభుత్వం ఇచ్చిన గడువు సమీపిస్తున్నా ప్లాట్ల యజమానుల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. 2020లో రూ.వెయ్యి చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారి స్థలాలను ఈ నెల 31లోగా క్రమబద్ధీరించుకుంటే 25 శాతం రాయితీ వర్తింపజేస్తూ ప్రభుత్వం అవకాశం కల్పించింది. మరో అయిదు రోజులే గడువుండగా దరఖాస్తుదారులు ఆసక్తి చూపడం లేదు. గడువు పొడిగించబోమని ప్రభుత్వం స్పష్టత ఇవ్వగా ఇప్పటివరకు అనుమతించిన దరఖాస్తుల్లో కేవలం 9 శాతం మందే ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించడం గమనార్హం.

**ఎందుకీ పరిస్థితి..**

లే అవుట్ అనుమతి లేకుండా భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేసి నాలా మార్పిడి చేయకుండానే స్థలాలు విక్రయించారు. మరికొందరు హైకోర్టు ఉత్తర్వులతో స్థలాల రిజిస్ట్రేషన్లు చేశారు.

పెద్దపల్లి మండలం రంగంపల్లి, పెద్దకల్వల, పెద్దబొంకూరు, చీకురాయి, రాఘవపూర్, అప్పన్నపేట, బంధంపల్లి, సుల్తానాబాద్ మండలం పూసాల, కాట్నపల్లి, సుగ్లాంపల్లి, చిన్నకల్వల, రామగుండం నగరపాలిక



పరిధిలో స్థలాల విక్రయాలు అధికంగా జరిగాయి.

2015 నుంచి 2022 వరకు స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగింది. 2020లో ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ జీవో తీసుకురావడంతో రూ.1000 చెల్లించి క్రమబద్ధీకరణ కోసం నమోదు చేసుకున్న వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు.రూ.1000 చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారిలో కొందరు ప్లాట్లు విక్రయించడం, మరి కొందరు ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో నమోదు చేసుకున్న స్థాయిలో చెల్లించేందుకు ముందుకు రావడం లేదు.

**ఇప్పుడే ఎందుకు..?** అక్రమ లే అవుట్‌లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వాటిని విక్రయిం చడం సాధ్యం కాదు. ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించని వారి ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఇళ్ల నిర్మాణాలకు పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి అనుమతి రాదు. దీంతో బ్యాంకులు రుణాలు మంజూరు చేయవు. నిర్మాణ సమయంలో.. లేకుంటే స్థల విక్రయ సమయంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లిస్తామనుకుంటే ప్రస్తుత 25 శాతం రాయితీ వర్తించదు. దీనికి తోడు ముమ్ముందు భూముల విలువను ప్రభుత్వం సవరించే అవకాశం ఉంది.

# బొగ్గుకు పెరిగిన డిమాండ్

గోదావరిఖని: వేసవి నేపథ్యంలో బొగ్గుకు డిమాండ్ పెరిగింది. విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో సరిపడా సరఫరాకు సింగరేణి చర్యలు చేపట్టింది. ఒప్పందం మేరకు రవాణా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుంది. ప్రతి ఏటా 70 మిలియన్ టన్నులకు పైగా బొగ్గు రవాణా చేస్తుండగా.. ఈ ఏడాది విద్యుత్తు డిమాండ్ పెరగడంతో అందుకు అనుగుణంగా ఉత్పత్తి పెంచేందుకు కసరత్తు చేస్తోంది. సింగరేణి ఎన్టీపీసీతో పాటు తెలంగాణ, ఏపీ జెన్‌కో, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర విద్యుత్తు సంస్థలకు బొగ్గు సరఫరా ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం కొన్ని విద్యుత్తు కేంద్రాల్లో బొగ్గు నిల్వలు పడిపోవడంతో ఆయా కేంద్రాల నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో సింగరేణి ప్రస్తుతం రోజుకు 50 రేక్‌ల(ఒక రేక్ 53 వ్యాగన్లు) ద్వారా బొగ్గు రవాణా చేస్తుండగా.. 60 రేక్‌లకు పెంచాల్సి రావడంతో అందుకు అనుగుణంగా ఉత్పత్తి పెంచుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది.

**ఒప్పందానికి మించి..**

ప్రస్తుతం సింగరేణి రోజుకు 3 లక్షల టన్నులకు పైగా బొగ్గు ఉత్పత్తి చేపడుతోంది. ప్రస్తుత డిమాండ్ మేరకు రోజుకు 2 లక్షల టన్నులకు పైగా బొగ్గును రైలు మార్గం ద్వారానే సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిగతాది రోడ్డు మార్గంలో తరలిస్తోంది. ఈ నేపథ్యంలో ఒప్పందం కంటే ఎక్కువ మొత్తంలో బొగ్గు రవాణా చేసేందుకు ఆయా సంస్థల నుంచి ఒత్తిడి చేస్తున్నారు. ప్రస్తుతం వార్షిక ఉత్పత్తి లక్ష్యం



సాధించడంపై దృష్టి సారిస్తూనే మరోవైపు వినియోగదారులకు సరిపడా బొగ్గు అందించే దిశగా సంస్థ చర్యలు చేపట్టింది. ఈ విషయాన్ని ఇటీవల జీఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎండీ బలరాం సూచించారు.

**అందుబాటులోకి గనులు**

కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి మరికొన్ని గనులను అందుబాటులోకి తీసుకురావడానికి సింగరేణి కసరత్తు చేస్తోంది. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకులోంచి ఏప్రిల్ నుంచి ఉత్పత్తి చేపట్టే అవకాశం ఉంది. వీకే ఓసీపీ కూడా రానున్న ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి రానుంది. వీటితో పాటు విస్తరణ ప్రణాళికలోని మరికొన్ని యాంత్రీకరణ గనుల్లోంచి కూడా బొగ్గు ఉత్పత్తి పెంచుకోవాలని యజమాన్యం భావిస్తోంది. ఎంపిక మేరకు కొన్ని భూగర్భ గనుల్లో కొత్తగా కంటిన్యూస్‌మైనర్, లాంగ్‌వాల్ యంత్రాలను ప్రవేశపెట్టేందుకు సంస్థ చర్యలు తీసుకుంది. దీని ద్వారా మరింత బొగ్గు ఉత్పత్తి పెంచుకోవడానికి ప్రణాళికలు వేసుకుంటుంది.

# ఆనుకొని ఉందని ఆక్రమించేశారు

మాదాపూర్ దాదాపు రూ.10 కోట్ల విలువ చేసే సర్కారు స్థలాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు దర్జాగా కబ్జా చేసి చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. అయినా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తిచూడటం లేదు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖానామెట్ సర్వేనం.41/14లో దాదాపు 65 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలంలో కొంత భాగాన్ని ప్లాట్లుగా విభజించి మూడేళ్ల క్రితం ప్రభుత్వం వేలం వేసి విక్రయించగా ఎకరం రూ.55 కోట్లు పలికింది. ఓ ప్రైవేటు లేఅవుట్‌కు ఆనుకొని ప్రభుత్వ స్థలం ఉంది. ఇప్పుడు ఇదే కబ్జాదారులకు కలిసొచ్చింది. లేఅవుట్‌ను ఆనుకొని ఉన్న 500 గజాల ప్రభుత్వ స్థలంపై కన్నేసిన వ్యక్తులు రాత్రికిరాత్రి రేకులతో ఫెన్సింగ్ వేసి లోపలికి ఎవరూ వెళ్లకుండా తాళం వేశారు. ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.10 కోట్లకుపైనే ఉంటుంది. ఇంతటి విలువైన స్థలాన్ని కబ్జాదారులు మాయం చేస్తున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డిని వివరణ కోరగా.. చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చురకలు



# చిన్నేరు.. ఎన్నాళ్లీ కన్నీరు

భువనగిరి : చిన్నేరు వాగుపై లోలెవల్ కాజ్‌వే వంతెనతో భువనగిరి, బీబీనగర్ మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. భువనగిరి మండలం అనాజిపురం నుంచి బీబీనగర్ మండలం జంపల్లి వరకు గల ఈ మార్గంలో రావిపహాడ్ వద్ద 30 ఏళ్ల కిందట నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. రోడ్డుపై పెద్ద గుంతలతో రాళు మొనదేలి ప్రమాదకరంగా మారింది. ప్యారాపెట్‌వాల్స్(రక్షణ దిమ్మెలు)లేక రాత్రి సమయాల్లో వాహనదారులకు ప్రమాదాలు జరిగిన ఘటనలు చోటు చేసుకున్నాయి.ఈ మార్గంలో సుమారు 15 గ్రామపంచాయతీలకు చెందిన వేలాది మంది ప్రజలు ద్విచక్రవాహనాలు, కార్లు, నడక ద్వారా నిత్యం రాకపోకలు జరుపుతారు. పలు తండాలకు చెందిన రైతులు అనాజిపురం శివారులోని వ్యవసాయ భూములకు, విద్యార్థులు చదువుల నిమిత్తం వచ్చి వెళుతుంటారు. వానాకాలంలో జంపల్లి, రెడ్డినాయక్‌తండా, గొకిరితండా, రావిపహాడ్‌తండాతో పాటు వివిధ గ్రామాల ప్రజలు మగ్దుంపల్లి, బీబీనగర్ మీదుగా చుట్టూ సుమారు 15 నుంచి 20 కి.మీ దూరం తిరిగి రావాల్సి ఉంటుంది. అనాజిపురం వచ్చే పాఠశాల విద్యార్థులు, వివిధ అవసరాలు, వ్యాపారాలు చేసుకునే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయి.గత ఏడాది ఆగస్టు నెలలో ప్రజల కష్టాలను వెలుగులోకి తీసుకురాగా సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి స్పందించి సంబంధిత జిల్లా అధికారులను



ఆదేశించగా పూర్తిస్థాయిలో సర్వే జరిపి రూ.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు.

**ప్రమాదాలకు నెలవు..**

వాగుపై వరద ఉధృతికి రావిపహాడ్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన కావలి నర్సయ్య, భార్య నర్సమ్మ ఒకరి చేయి మరొకరు పట్టుకొని నీటిలో నడుచుకుంటూ వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తు నీటి ఉధృతికి కాల్వలో పడి మృతి చెందారు. ఇతర గ్రామాలకు చెందిన మరో ముగ్గురు ద్విచక్రవాహనాలపై వెళుతూ నీట మునిగి ప్రాణాలు వదిలారు..

**రైతుల భూములకు వెళ్లాలంటే అవస్థలు..:** 50ఎకరాల వ్యవసాయ భూములు, గేదెల షడ్లు ఉన్నాయి.ఉదయం వెళ్లే సమయంలో తక్కువ నీళ్లే ఉంటాయి. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ఉధృతి పెరిగి ప్రమాదకరంగా మారుతుంటుంది. ఆ సమయంలో చాలా అవస్థలు పడుతూ సుమారు 20 కిమీ చుట్టూ తిరుగుతూ ఇంటికి చేరుకోవాల్సి వస్తుంది.

**ప్రతిపాదనలు పంపించాం**

బాల ప్రసాద్, రోడ్డు భవనాల శాఖా ఈఈ

రావిపహాడ్ వద్ద చిన్నేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో సర్వే జరిపి, రూ.16కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. ముఖ్యమంత్రి దృష్టిలో ఉంది.

పాల వ్యాపారం చేస్తుంటాను

పాశం నర్సిరెడ్డి, మాధారం, బీబీనగర్ మండలం

వ్యవసాయం చేస్తుంటాను. నాకు గేదెలున్నాయి. పాలు తీసుకొని వెళ్లి అనాజిపురం, భువనగిరి తదితర ప్రాంతాలలో విక్రయిస్తుంటాను. చిన్నేరు వాగుపై నీటి పెరిగినప్పుడు మగ్దుంపల్లి మీదుగా చుట్టూ తిరుగుతూ వెళ్లాల్సి ఉంటుంది.

మా పొలాలున్నాయి

బానోతు బిచ్చానాయక్, రావిపహాడ్ తండా

మా తండాలకు చెందిన భూములు చాలా వరకు అనాజిపురం రెవెన్యూలో ఉన్నాయి. వాగు దాటి వెళ్లాలి. వాగుపై వరద ఉధృతి పెరిగినప్పుడు రోడ్డు మూసి వేస్తారు. ఆ సమయంలో పొలాలకు వెళ్లాలంటే చుట్టూ (సుమారు 15కిమీ)తిరిగి వెళ్లాలి.

# ప్రకృతి వనం.. పట్టని వైనం

కోదాడ : పట్టణాల్లో కాలుష్యాన్ని తగ్గించి, పచ్చదనం పెంచే లక్ష్యంగా ప్రభుత్వం పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణ మాత్రం అధ్వానంగా ఉంది. మొక్కలు, చెట్లు పెరగాల్సిన ప్రాంతంలో గడ్డి మొక్కలు పెరిగి కనిపిస్తుండటంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. రూ.లక్షలు వెచ్చించి ఒక్కో పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేస్తే, పదుల సంఖ్యలో కూడా మొక్కలు పెరగని దుస్థితి నెలకొంది. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



**బీడు భూమిని తలపిస్తూ..**

పచ్చదనంతో కళకళలాడాల్సిన ప్రకృతి వనాలు బీడు భూములను తలపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 19 పురపాలికలు ఉండగా, వీటిలో 300లకు పైగా పట్టణ ప్రకృతి వనాలను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రకృతి వనానికి బోర్డు, గేటు, స్థలం చుట్టూ రాతి స్తంభాలతో ఫెన్సింగ్, విద్యుత్, బోరు, మొక్కలు ఇలా అన్ని ఏర్పాట్లకు రూ.10 కోట్లకు పైగా ఖర్చుయింది. నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. కొన్ని వనాల్లో కనీసం బోరు కూడా లేదు. ట్యాంకర్లతో ఎప్పుడో ఒకసారి నీళ్లు పోస్తుండటంతో అవి వాడిపోతున్నాయి. స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ స్తంభాలు, విలువైన తీగ, గేట్లను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోతున్నారు.

**నిర్వహణపై దృష్టి సారిస్తాం: రమాదేవి, పుర కమిషనర్, కోదాడ**

పట్టణంలోని పట్టణ ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోయినట్లు మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటాం. పచ్చదనమే లక్ష్యంగా మొక్కలు పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం.

# భాషా నైపుణ్యం.. వ్యక్తిత్వ వికాసం



పెద్దపల్లి : ఆంగ్ల భాషా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆంగ్లంలో ప్రయోగ పరీక్ష నిర్వహిస్తున్నారు. గతేడాది తొలిసారిగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అమలు చేయగా, ఈసారి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేశారు. మొత్తం వంద మార్కులకు గాను ప్రయోగాలకు 20 కేటాయించగా, మిగతా 80 మార్కులకు పరీక్ష రాయాల్సి ఉంటుంది. నాలుగు దశల్లో నిర్వహించే ప్రయోగ పరీక్షలో కనీసం 7 మార్కులు వస్తేనే ఉత్తీర్ణత సాధించనున్నారు. పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థులను అనుత్తీర్ణులుగా ప్రకటిస్తున్నారు. ఈ నెల 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

**నాలుగు విడతల్లో నిర్వహణ**

ప్రయోగ పరికరాలతో కాకుండా తరగతి గదిలోనే విద్యార్థుల భాషా సామర్థ్యాలను పరీక్షిస్తారు.

మొదటి దశలో ఒక అంశంపై ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థుల మధ్య ఆంగ్ల సంభాషణను అధ్యాపకులు పరీక్షిస్తారు.

రెండో దశలో 'జస్ట్ ఎ మినిట్' పేరిట ఒక అంశంపై నిమిషంలోపు అనర్గళంగా మాట్లాడాల్సి ఉంటుంది.

మూడో దశ 'రోల్‌ప్లే'లో తల్లిదండ్రులు, లేక మరేదైనా అంశంపై విద్యార్థుల మధ్య బృంద చర్చ ఉంటుంది.

నాలుగో దశ 'లిజనింగ్ కంప్రహెన్సివ్'లో వినే శక్తి పెంపొందించడంపై అధ్యాపకులు పరీక్షిస్తారు.

చివరగా విద్యార్థుల రాసిన రికార్డులను తనిఖీ చేసి మార్కులు కేటాయిస్తున్నారు.

31 నుంచి ప్రయోగ పరీక్ష

ఉమ్మడి జిల్లాలో మొత్తం 197 కళాశాలల్లో 41,861 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఆంగ్ల ప్రయోగ పరీక్షను ఈ నెల 31న ప్రథమ సంవత్సరం వారికి, ఫిబ్రవరి 1న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తారు. పరీక్షలో మొదటి మూడు దశలను కళాశాల యజమాన్యం వెసులుబాటు ఆధారంగా నిర్వహించారు. చివరి విడతలో మాత్రం ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన తేదీలో ఏర్పాటు చేయాలి. విద్యార్థుల భవితకు కొలమానంగా ఉన్న ఈ పరీక్ష నిర్వహణపై ఉన్నతాధికారులు పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో నామమాత్రంగా కాకుండా విద్యార్థుల ప్రతిభ ఆధారంగా పరీక్ష నిర్వహించనున్నారు.

**నేడు పర్యావరణ విద్య**

ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గతంలో విలువలు, పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహించేవారు. ఇందులో ప్రాజెక్టు రూపొందించి నివేదిక సమర్పిస్తే 40 మార్కులు, పరీక్షకు మరో 60 మార్కులు కేటాయించేవారు. గతేడాది విలువల విద్య రద్దు చేసి పర్యావరణ విద్యపై మాత్రమే పరీక్ష నిర్వహిస్తున్నారు. గురువారం ఈ పరీక్ష నిర్వహించనున్నారు.

**తప్పనిసరిగా హాజరు కావాలి**

విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ప్రయోగ పరీక్ష నిర్వహిస్తున్నాం. ఇందులో తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. 20 మార్కులు కేటాయించడంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి విద్యార్థి తప్పకుండా హాజరు కావాలి.కల్పన, ఇంటర్మీడియట్ పెద్దపల్లి జిల్లా నోడల్ అధికారి

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ విద్యార్థులు

కరీంనగర్ 12,641

జగిత్యాల 11,887

పెద్దపల్లి 10,566

రాజన్న సిరిసిల్ల 6,767

# రాణా గడప తొక్కని గిరిజన పల్లె



ధర్మపురి: సమష్టి జీవనానికి ప్రతీకగా నిలుస్తోంది ధర్మపురి మండలంలోని ఆకుసాయిపల్లె గ్రామం. వందశాతం గిరిజనులు ఉన్న ఈ గ్రామం నుంచి ఎవరూ ఠాణా మెట్లెక్కలేదు. వివాదాలు, ఘర్షణలు ఏమీ తెలియని పల్లె. ఇక్కడి ప్రజలంతా శాంతి, సహనాలతో, సోదర భావంతో మెలుగుతున్నారు. దశాబ్దాలుగా ఒకరికి ఒకరు అండగా ఉంటూ ఎలాంటి వివాదాలు లేకుండా జీవనం గడుపుతున్నారు. ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వెళ్లే జాతీయ రహదారి పక్కనే ఉంది ఈ పల్లె. **అభివృద్ధిలో...**

ప్రభుత్వ పథకాల అమలులో సైతం ఇక్కడి ప్రజలు ఆదర్శంగా నిలుస్తున్నారు. స్వచ్ఛత, పరిశుభ్రత, మొక్కల పెంపకంలో అందరు కలిసికట్టుగా భాగస్వాములవుతున్నారు. ఈ పల్లెలో ఏడు స్వశక్తి సంఘాలుండగా, రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. వాటిని సమృద్ధిగా వినియోగించుకుంటూ సంఘాల పటిష్ఠతకు కృషి చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులున్నారు. పిల్లలకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పేందుకు వారి తల్లిదండ్రులు కృషి చేస్తున్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా విద్యార్థులను పాఠశాలకు పంపుతున్నారు. ప్రధాన రోడ్ల వెంట మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకు అప్పగిస్తున్నారు. ఈ గ్రామం అయిదేళ్ల క్రితం నూతనంగా పంచాయతీగా ఏర్పడింది. పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ఇక్కడ వంద శాతం చేపట్టారు. సమీపంలోని చెరువే స్థానికులకు ప్రధాన నీటి వనరు. ఈ చెరువు కిందే పత్తి, వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. పదేళ్ల క్రితం వరకు ఏమాత్రం సదుపాయాలు లేని ఈ పల్లెలో నేడు మెరుగైన రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువలు, తాగు నీరు, విద్యుత్తు సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

**వర్షాధారంగానే పంటలు**

ఆకుసాయిపల్లె గ్రామంలో వర్షాధారంగానే పంటలను పండిస్తున్నారు. నేరెళ్ల గుట్టపై నుంచి వచ్చే నీరు సమీపంలోని బ్రాహ్మణకుంట వద్దకు చేరుతుంది. చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టి ఈ నీటి ఆధారంగానే సాగు చేస్తున్నారు. మిర్చి, మొక్కజొన్న, పత్తి పంటలను పండిస్తున్నారు.

**రికార్డులోనే లేదు**

ధర్మపురి మండలంలో 29 గ్రామాలుండగా ఆకుసాయిపల్లె నేటికీ పోలీసు రికార్డులోకి ఎక్కలేదు. మిగతా అన్ని గ్రామాల్లో వివిధ రకాల కేసులు నమోదయ్యాయి. ఈ పల్లెల్లో ప్రజలు సోదర భావంతో మెలుగుతున్నారు. ఈ గ్రామం సమష్టి జీవనానికి ప్రతిబింబంగా నిలుస్తోంది.ఉదయ్ కుమార్, ఎస్సై, ధర్మపురి

**ఏళ్లతరబడి ఐకమత్యంగా**

గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా అందరం స్పందించి అండగా నిలుస్తాం. ఎవరి ఇంట్లో వేడుక జరిగినా అందరం కలిసికట్టుగా జరుపుకుంటాం. గ్రామ అభివృద్ధికి సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటాం. ఏళ్లుగా ఎటువంటి వివాదాలకు తావివ్వలేదు. ఇది మాకు గర్వకారణం. నూతన పంచాయతీ కావడంతో కొద్దిపాటి నిధులు మాత్రమే వచ్చాయి. వాటిని పొదుపుగా వాడుకుంటూ అందరి సహకారంతో అభివృద్ధికి పనులు చేపట్టాము.రమేష్, మాజీ సర్పంచి, ఆకుసాయిపల్లె

# ఆక్రమణలకు కోట

భువనగిరి : భువనగిరి కోట భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. నియంత్రించాల్సిన సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో కోట మూడు వైపులా నిర్మాణాల పరంపర కొనసాగుతోంది. ప్రస్తుతం కోట పురావస్తుశాఖ ఆధీనంలో ఉంది. ఈ శాఖ అధికారుల స్థానికంగా ఉండకపోవడంతో కోట ఆస్తులపై పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు ఉన్నాయి. సర్వే నంబర్ 212లోని సుమారు 45 ఎకరాల విస్తీర్ణంలో కోట ఆవరించి ఉంది. దీనికి చెంతనే ఉన్న అమ్మకుంట పరిసరాల్లో మూడెకరాలు, ప్రధాన రహదారి ముఖ్యకూడలి సమీపంలో అర ఎకరం ప్రభుత్వ భూమి ఉంది. కోట భూములకు సర్వే నిర్వహించి గత కొన్నేళ్ల క్రితం మార్కింగ్ చేశారు. కోట పరిధి నుంచి వంద మీటర్ల పరిధిలోని నిషేధిత జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. గతంలో ఈ జోన్‌లో పూర్తయిన నిర్మాణాలకు పురావస్తుశాఖ అధికారులు సంబంధించిన వారికి నోటీసులు, మున్సిపల్ అధికారులకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి నేటికీ చర్యలు చేపట్టకపోవడంతో ఆక్రమణలు, అనుమతులు లేని నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.కోట కొత్తబస్టాండ్‌తో పాటు హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి, పట్టణ ప్రధాన రహదారి వరకు ఆవరించి ఉంది. మరో వైపు అమ్మకుంట, పలు వెంచర్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో భూమి ఖరీదుగా మారింది. దీంతో కోటకు ఆనుకుని సొంత భూములు ఉన్న వారు కోట వరకు నిర్మాణాలు చేపట్టారు. ఇటీవలి కోట పరిధిలోని కోట గడ్డను తవ్వి మట్టిని తరలించినప్పటికి ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ విషయమై పురావస్తుశాఖ ఏడీ నాగలక్ష్మిని వివరణ కోరగా ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చామని, స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశామని వివరణ ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితిపై తమ ఉన్నతాధికారులకు నివేదికను సమర్పిస్తామని ఆమె తెలిపారు.

# గోదా'వరి'తో సాగు

సిద్దిపేట : యాసంగిలో చాలా మంది రైతులు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల ఆధారంగావరి పంట వేశారు. ఈసారి సుమారు 3 లక్షల ఎకరాలకుపైగా సాగయ్యే అవకాశాలున్నట్లు అధికారుల అంచనా. ఇది మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడంతో కర్షకులు వరి వైపు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే వేసిన నాట్లు కొన్ని చోట్ల ఎండిపోతుండటంతో ప్రాజెక్టుల నుంచి సాగునీరు వదలాలని రైతులు డిమాండు చేస్తున్నారు. జిల్లాలో పలు చోట్ల ఇటీవల ఆందోళనలు సైతం చేపట్టారు. ఫిబ్రవరి రెండో వారం వరకు నాట్లు పూర్తి కానున్నాయి. సాగుకు గోదావరి జలాలు ఆదరువు కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాల ప్రత్యక్ష ఆయకట్టుంది. చెరువులు, వాగులు, కుంటల్లోకి



నీరు చేరితేనే పంటలు గట్టెక్కనున్నాయి.

**నీటి పారుదల శాఖ మంత్రికి వినతి**

బోర్లు తట్టి పోస్తుండటం, చెరువు, కుంటలు, వాగుల్లో నీరు లేకపోవటంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే గోదావరి జలాలు విడుదల చేయాలని రైతులు డిమాండు చేస్తున్నారు. కర్షకుల పక్షాన ఇటీవలే దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన అధికారులు మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ కాలువ ద్వారా కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేశారు. చెక్‌డ్యామ్‌లు నిండిన తర్వాత వారం అనంతరం నిలిపేస్తామని అధికారులు చెబుతున్నారు.గోదావరి జలాలు విడుదల చేయక వెలవెలబోతున్న హల్దీవాగు చెక్‌డ్యామ్

**రంగనాయక్ సాగర్ ఎడమ కాలువ ద్వారా..**

జనవరి 18న మంత్రి కొండా సురేఖ రంగనాయక సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం కొనసాగుతోంది. కుడి కాలువకు విడుదల చేయాల్సి ఉంది. కొండపోచమ్మ సాగర్ నుంచి రామాయంపేట, జగదేవపూర్ కాలువ ద్వారా రోజుకు సుమారు 65 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హల్దీవాగు, గజ్వేల్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాల్సి ఉంది. గతేడాది ఫిబ్రవరిలో అవసరమైన మేర గోదావరి నీటిని వదిలామని, ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని నీటి పారుదల శాఖ గజ్వేల్ ఈఈ మోతియా తెలిపారు.

ప్రస్తుత నీటి నిల్వ(టీఎంసీలలో)

అనంతగిరి 3.01

రంగనాయక సాగర్ 2.34

మల్లన్నసాగర్ 17.5

కొండపోచమ్మసాగర్ 9.1

# తుది పని.. జాప్యం ఎందుకని?

సంగారెడ్డి : పేదల వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. సర్కారు దవాఖానాలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని సంకల్పించింది. నూతన భవనాల నిర్మాణాలకు రూ.కోట్లలో నిధులు మంజూరు చేసింది. కొన్ని చోట్ల ఆయా నిర్మాణాలు తుది దశకు చేరుకున్నప్పటికీ.. కొద్దిపాటి పనులనూ పూర్తి చేయడం లేదు. గుత్తేదారులు అర్జీ పెట్టుకోవడం.. అధికారులు పనుల పూర్తికి గడువు పొడిగించడం సాధారణంగా మారింది.

**పటాన్‌చెరులో రూ.70 కోట్లతో..**

పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సూపర్ స్పెషాలిటీ దవాఖానా భవన నిర్మాణానికి గతేడాది రూ.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పరికరాల బిగింపునకు అదనంగా రూ.25 కోట్లు కేటాయించారు. పీసీబీ, ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన భవనాల పనులు చివరి దశకు చేరుకున్నాయి. రంగులు తదితర పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రూ.5 కోట్ల బిల్లుల బకాయిలు ఉండటంతో పనులు నిలిచిపోయాయి. ఏప్రిల్ వరకు ఆసుపత్రి భవనాలను వినియోగంలోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు.

**రంగులు వేసి.. తలుపులు బిగించాలి**

సంగారెడ్డికి మూడేళ్ల క్రితం ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరయింది. ఇందులో భాగంగా జిల్లా ఆసుపత్రి ఆవరణలో ఏడాదిన్నర క్రితం రూ.23.75 కోట్లలో 'క్రిటికల్ కేర్ యూనిట్' భవనం పనులు ప్రారంభించారు. 95 శాతం పనులు పూర్తిచేశారు. కలరింగ్, విద్యుత్తు కనెక్షన్లు, తలుపుల బిగింపు తదితర తుది పనులు మాత్రమే మిగిలి ఉండగా.. గుత్తేదారు జాప్యం చేస్తున్నారు.



**జహీరాబాద్‌లో మాతాశిశు ఆరోగ్య కేంద్రం..**

జహీరాబాద్‌లోని మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్) భవన నిర్మాణానికి ప్రభుత్వం గతేడాది రూ.7.5 కోట్ల నిధులు విడుదల చేసింది. రెండంతస్తుల పనులు పూర్తయ్యాయి. రంగులు, ఇతర తుది పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రూ.3 కోట్ల వరకు గుత్తేదారుకు బిల్లులు చెల్లించాల్సి ఉండటంతో నత్తనడకన పనులు సాగుతున్నాయి. ఏప్రిల్ చివరి నాటిని పనులన్నీ పూర్తి చేస్తామని అధికారులు వివరిస్తున్నారు.

**నర్సింగ్ విద్యార్థులకు 'అద్దె' కష్టాలు**

సంగారెడ్డి పట్టణం రామచంద్రారెడ్డి నగర్‌లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, విద్యార్థులకు వసతి గృహాల కోసం 2022లో రూ.34 కోట్లు మంజూరయ్యాయి. జీప్లస్-2 భవనం కోసం స్లాబ్ వేశారు. బిల్లుల సమస్యతో గుత్తేదారు పనులు నిలిపివేశారు. అద్దె భవనంలో నర్సింగ్ విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

వేగవంతం చేశాం..: రవీందర్‌రెడ్డి, ఈఈ, టీఎస్ఎంఎస్ఐడీసీ

జిల్లాలో ఆసుపత్రుల భవనాలు, నర్సింగ్ కళాశాల, వసతి గృహాల భవనాల పనులు గతంతో పోల్చితే వేగవంతమయ్యాయి. బిల్లుల చెల్లింపునకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మార్చి, ఏప్రిల్ నాటికి భవనాలను వినియోగంలోకి తేవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇటీవల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ దిశగా ముందుకు సాగుతున్నాం.

## నేతల అండ.. గ్రావెల్ దందా

అచ్యుతాపురం : నాయకుల అండతో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వ, ప్రైవేటు భూములనే తేడా లేకుండా గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతున్నారు. కొండలు, గుట్టలను, గెడ్డలను కరగదీస్తూ కాసులు పంచుకుంటున్నారు. కొండకర్ల గ్రావెల్ తవ్వకాలకు చిరునామాగా మారింది. ఈ గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండలతోపాటు చోడపల్లి శివార్లలో ఉన్న కొండలు, గుట్టలను లక్ష్యంగా చేసుకొని ఎర్రమట్టి, విలువైన గ్రావెల్ తరలించుకుపోతున్నారు. పొక్లెయిన్లు ఉపయోగించి గ్రావెల్ తవ్వి టిప్పర్లలో రాత్రికి రాత్రే రవాణా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రాత్రి సమయంలో జనసంచారం లేకపోవడంతో అక్రమ వ్యాపారానికి ఈ ప్రాంతాన్ని అడ్డాగా మార్చుకున్నారు. నాయకులే గ్రావెల్ తవ్వకాల వెనుక ఉండడంతో క్షేత్రస్థాయిలో పనిచేసే రెవెన్యూ



సిబ్బంది ఏమిచేయలేకపోతున్నారు. పోలీసులు ఇక్కడికి రాకుండా ముందుస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బంగారయ్యపాలెం శివారు ప్రాంతం నుంచి రహదారిని నిర్మించి మరీ గ్రావెల్ రవాణా చేస్తున్నారు. కొండకర్లలో గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్నా గనులశాఖ, పోలీసు అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదని పలువురు మండిపడుతున్నారు. ప్రభుత్వ భూములతో పాటు డీపట్టా భూముల్లో సైతం గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవ డంలేదు. జిల్లాస్థాయి అధికారులు జోక్యం చేసుకొని అక్రమ తవ్వకాల నిరోధానికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

## ఆరోగ్యవర్షిణి పల్లె పుష్కరిణి!

పాలకొల్లు : ఇది యలమంచిలి మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న నాలుగెకరాల చెరువు. పూర్వం పశువుల చెరువుగా వినియోగించేవారు. వాటి సంఖ్య తగ్గిపోయాక పంచాయతీకి ఆదాయం తెచ్చే చేపల చెరువుగా మార్చారు. పచ్చని మొక్కలు నాటి దీనిని అభివృద్ధి చేసి అక్కడక్కడ కూర్చోవడానికి బల్లలు, చుట్టూ నడకదారి ఏర్పాటుచేస్తే గ్రామస్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. ఇదేగాక చినచెరువుగా పిలిచే మరో చెరువుతోపాటు ఏడెకరాల విస్తీర్ణంలో తాగునీటి చెరువు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు ఇటువంటి వాటినే పల్లె పుష్కరిణి పేరిట కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి రంగం సిద్ధం చేసింది.

ప్రతి మండలంలో చెరువులు, కోనేర్లుగా పిలవబడే మంచినీటి వనరులు చాలాకాలంగా నిరుపయోగంగా ఉంటున్నాయి. కొన్ని ఆక్రమణలకు గురికాగా మరికొన్ని పూడిపోయి తామరాకు, తూడుతో నిండిపోయా యి. వెయ్యి జనాభా దాటి ఉన్న గ్రామాల్లో ఏడాదికి 8 నుంచి 12 నెలల వరకు నీటితో నిండి ఉండే ఎకరా మొదలు ఐదెకరాల విస్తీర్ణంలో



చెరువుల చుట్టూ జాతీయ ఉపాధి హామీ పథకంలో వాకింగ్ ట్రాక్‌లను నిర్మించి అభివృద్ధి చేయడానికి ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలోని 20 మండలాల్లోను ఇటువంటి చెరువులను గుర్తించే పనిలో ఉపాధి హామీ సిబ్బంది నిమగ్నమయ్యారు.

**అందరి ఆమోదంతోనే..**

ఆయా గ్రామాల్లో పుల్లె పుష్కరిణి పథకంలో అభివృద్ధి చేయనున్న చెరువులను మండలానికి కనిష్ఠంగా ఒకటి గరిష్ఠంగా రెండు ఎంపిక చేయనున్నారు. వీటి నిమిత్తం ఏప్రిల్ 7న గ్రామసభలు నిర్వహించి అందరి అభిప్రాయం మేరకు పరిపాలన ఆమోదం తీసుకోనున్నారు. అనంతరం పనులు చేపట్టి జూన్ నెలాఖరుకు పూర్తిచేయాల్సి ఉంది. పనులిలా.. పల్లె పుష్కరిణి పనుల్లో చెరువులకు నీరందించే పంట కాలువల్లో పూడిక తీయాలి. తీసిన మట్టిని రైతులు సొంత ఖర్చుతో సాగు అవసరాల నిమిత్తం తీసుకెళ్లవచ్చు. ఉపాధి కూలీలతో మాత్రమే పూడిక తీయించాలి. నక్షత్రవనం మొక్కలు పెంచాలి. దీనిపై డ్వామా పీడీ కె.సిహెచ్.అప్పారావును సంప్రదించగా చెరువు విస్తీర్ణం బట్టి ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. జిల్లాలో 30 నుంచి 40 చెరువులను దీనిలో అభివృద్ధి చేయనున్నామని చెప్పారు.

## ఎల్లలు దాటిన హస్తకళ

నరసాపురం : దేశంలోని వివిధ రాష్ట్రాల్లో రూపొందించిన హస్తకళల ఉత్పత్తుల విక్రయానికి వచ్చిన వారితో రుస్తుంబాదలోని అంతర్జాతీయ లేసుట్రేడింగ్ సెంటరు గత ఐదురోజులుగా కళకళలాడింది. గ్రామీణ ప్రాంతాల్లో సహజంగా దొరికే చెట్ల కాండం, వెదురు, గుర్రపుడెక్క ఆకులతో రూపొందించిన ఉత్పత్తులు వీక్షకులకు కనువిందు చేశాయి. పలు రాష్ట్రాల నుంచి ఉత్పత్తులు తెచ్చిన మహిళలకు లాభాల పంట పండింది. ప్రభుత్వం ఇదే విధంగా దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే మహిళల ఆర్థిక స్వావలంబనకు ఢోకా ఉండదని వారంతా చెబుతున్నారు.మంచి లాభాలు వచ్చాయి.. మేము 15 మంది సభ్యులం. మా ఇంటి ఆవరణలో పెంచే ఎదురు కలపతో సామగ్రి తయారు చేస్తాం. దీంతో పాటు గ్రామంలో దొరికే ఇతర కలపతో కూడా అలంకరణ ఉత్పత్తులు రూపొందించి విక్రయిస్తాం. ఇక్కడ ఐదు రోజులుగా విక్రయించిన సామగ్రికి మాకు రూ.30వేలు పైబడి లాభం వచ్చింది. మాకు చాలా సంతృప్తిగా ఉంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో రూపొందించిన హస్తకళల ఉత్పత్తుల విక్రయానికి వచ్చిన వారితో రుస్తుంబాదలోని అంతర్జాతీయ లేసుట్రేడింగ్ సెంటరు గత ఐదురోజులుగా కళకళలాడింది. అరుతిచంద్‌ఘోష్, పశ్చిమబెంగాల్ ఇక్కడ లేసు ఉత్పత్తులు.. మేము లేసు ఉత్పత్తులు రూపొందిస్తాం. మేము ఇతర ప్రాంతాల్లో ప్రదర్శనలకు వెళ్లి విక్రయిస్తుంటాం. మా గ్రామం లోనే ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేయడం మంచి పరిణామం. సుధారాణి, రుస్తుంబాద నెలకు రెండు, మూడు ఉండాలి.. మా బృందం ఇమిటేషన్ జ్యుయలరీ తయారు చేసి విక్రయిస్తున్నాం. ప్రస్తుతం మూడు, నాలుగు నెలలకు ఒక పర్యాయం ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మేము తయారు చేసిన సామగ్రి విక్రయానికి అవకాశం ఉ ండటం లేదు. అలా కాకుండా ప్రతినెలా రెండు, మూడు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే మాకు ఉపాధి దొరుకుతుంది.రమాదేవి, తెలంగాణ

# ఫలరాజును చెరబట్టారు!



బుక్కరాయసముద్రం : గత వైకాపా ఐదేళ్ల పాలనలో అన్ని వ్యవస్థలను నాశనం చేసినట్లే బుక్కరాయసముద్రం సమీపంలో ఉన్న ఖైదీల వ్యవసాయ క్షేత్రాన్ని సైతం అధ్వానంగా మార్చారు. క్షేత్రంలోని మామిడి తోటను లీజుకు తీసుకున్న వైకాపా నాయకుడు గుత్త డబ్బులు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నాయిడు. మరోవైపు తోట నిర్వహణను గాలికి వదిలేశారు. అక్కడి పరిస్థితిపై పరిశీలన కథనం. ఇక్కడి క్షేత్రంలో దాదాపు 200 ఎకరాల్లో 4,200 పైబడి మామిడి చెట్లు ఉన్నాయి. సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టారు. జైలు ఉ న్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఏటా మామిడి కాయలను బహిరంగ వేలంలో విక్రయించేవారు. తద్వారా జైళ్లశాఖకు ఏటా రూ.లక్షల్లో ఆదాయం వచ్చేది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బంగారు బాతులాంటి మామిడి చెట్లను పదేళ్ల కాలానికి ఓ వైకాపా నాయకుడికి లీజుకు ఇచ్చారు. సదరు నాయకుడు మామిడి కాయలను విక్రయించు కుని, మామిడి చెట్లను సంరక్షించే బాధ్యతలను పూర్తిగా విస్మరించాడు. గడచిన ఐదేళ్లలో దాదాపుగా 500 పైగా మామిడి చెట్లు ఎండిపోయా యి. అనంతపురం- అమరావతి జాతీయ రహదారి విస్తరణలో భాగం గా పదుల సంఖ్యలో చెట్లు నరికివేశారు. దీంతో జైలులో మామిడిచెట్లు సంఖ్య 3,500కి పడిపోయింది.

**వైకాపా నాయకుడి నిర్వాకమిది**

2022లో వైకాపా ప్రభుత్వ హయాంలో జైలు నిబంధనలు తుంగలో తొక్కి మండలానికి చెందిన ఓ వైకాపా నాయకుడికి 10 ఏళ్లకు ఏడాదికి రూ.26.5 లక్షలకు చొప్పున చెల్లించేలా లీజుకిచ్చారు. తర్వాత ఏడాదికి 5 శాతం చొప్పున లీజు పెంచి మొత్తం చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. మొదటి, రెండో సంవత్సరంలో లీజును సక్రమంగా చెల్లించిన వైకాపా నాయకుడు, 2024 ఎన్నికల సంవత్సరంలో కాయలు మొత్తం విక్రయించినా రూ.29.2 లక్షల గుత్తను మాత్రం చెల్లించలేదు. జైలు అధికారులు చేసేదేమి లేక బుక్కరాయసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారు. ఇప్పటికీ డబ్బులు ఇవ్వలేదు. అప్పటి నుంచి తోట నిర్వహణ గాడి తప్పింది.

**బహిరంగ వేలంతోనే విక్రయాలు**వివిధ కారణాలతో మామిడి చెట్లు వందల సంఖ్యలో ఎండిన మాట వాస్తవమే. గతంలో జరిగిన తప్పులను దృష్టిలో ఉంచుకుని ఈసారి చెట్లను సంరక్షించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. మామిడిచెట్ల ఫలసాయాన్ని బహిరంగ వేలం ద్వారానే విక్రయిస్తాం. కాంతరాజ్, జైలు సూపరింటెండెంట్

# అదిగో 'లులు'... నెరవేరే ఉపాధి కలలు



విశాఖపట్నం: గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నో పరిశ్రమలు, సంస్థలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయి. కొన్ని ఇటు వైపే చూడనన్నాయి. దీంతో స్థానిక యువతకు పెద్ద సంఖ్యలో ఉ పాధి అవకాశాలు దూరమయ్యాయి. కూటమి ప్రభుత్వం రాకతో నగరానికి బహుళజాతి సంస్థలు పెట్టుబడులతో వరుసకడుతున్నాయి. విశాఖలో టీసీఎస్, గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు కార్యాల యాల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. అదే బాటలో ఇప్పుడు 'లులు' సంస్థ కూడా సాగర తీరానికి తిరిగొచ్చేందుకు మార్గం సుగమం అయింది.

బీచ్‌లోని 13.43 ఎకరాల్లో: బీచ్ రోడ్డులో టౌన్ సర్వే నంబరు 1011/1ఏ1, ఏ2 లోని ఏపీ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనాభివృద్ధి సంస్థ (ఏపీఐఐసీ)కు చెందిన 13.43 ఎకరాలను 2018లో 'లులు'కు ఇచ్చేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం గుర్తించింది. సంస్థ సైతం షాపింగ్ మాల్ నిర్మాణానికి ముందుకొచ్చింది. తరువాత ప్రభుత్వం మారడంతో ఆ ఒప్పందాన్ని వైకాపా పాలకులు రద్దు చేశారు. అక్కడితో ఆగకుండా ఆ స్థలాన్ని విక్రయించాలని కూడా చూశారు. ఇందుకు ఏపీఐఐసీ నుంచి ఆ స్థలాన్ని వీఎంఆర్‌డీఏ (విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ)కు అప్పగించారు. ఆ స్థలాన్ని మూడు భాగాలుగా చేసి రూ.1000 కోట్లకు అమ్మి ఖజానాకు డబ్బు సమకూర్చాలని వ్యూహం పన్నినా అమలు సాధ్యం కాలేదు.

ఆసక్తి చూపడంతో: కొద్ది రోజుల కిందట ముఖ్యమంత్రి చంద్రబాబును 'లులు' సంస్థ ఛైర్మన్ కలిసి పెట్టుబడులపై చర్చించారు. మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపడంతో గతంలోని స్థలాన్నే కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే వీఎంఆర్ డీఏ నుంచి ఆ స్థలాన్ని తిరిగి ఏపీఐఐసీకి అప్పగించాలని ఉత్తర్వులిచ్చిం ది. వీఎంఆర్‌డీఏ అందుకు సంబంధించిన దస్త్రాన్ని సిద్ధం చేస్తుంది.

పోరాటంతో:

బీచ్ రోడ్డులో స్థలాల విలువ భారీగా ఉంది. అటువంటి ఇక్కడ 13 ఎకరాలను ప్రభుత్వం కోల్పోతే తిరిగి రావడం కష్టం. గత ప్రభుత్వం దీన్ని విక్రయించాలని చూడగా విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మరికొందరు న్యాయపోరాటం చేశారు. విలువైన ప్రభుత్వ స్థలం ప్రైవేటుపరం కాకుండా ఆగింది. ప్రస్తుతం ఆ స్థలం అందుబాటులో ఉండడంతో లులు మాల్ ఏర్పాటుకు దారి ఏర్పడింది. వేల మందికి ఉపాధి లభించనుంది.

# ఇంకా పెత్తనంపైనే ధ్యాస



విశాఖపట్నం: వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (వైజాగ్ ఫిల్మ్‌నగర్ క్లబ్) నిధులపై నీలి నీడలు కమ్ముకున్నాయి. వైకాపా పాలనలోని ఐదేళ్లు నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేసి కాకిలెక్కలు చూపించారన్న విమర్శలున్నాయి. దీనిపై విచారణ చేయాలని కొందరు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు కూటమి అధికారంలోకి వచ్చాక శాశ్వత కమిటీ రద్దైనా, మేనేజ్‌మెంట్ కమిటీలో ఇంకా వైకాపా నాయకులున్నారు.

**నిధుల ఖర్చుపై ఆరోపణలివే:** వైకాపా నాయకులు కొందరు క్లబ్‌ను వీడకుండా ఉండేలా పావులు కదుపుతున్నారు. గతేడాది విజయవాడ వరద బాధితులకు రూ.25లక్షలు విరాళంగా ఇచ్చారు. క్లబ్ నిధులను ఇచ్చేందుకు కనీసం సభ్యుల ఆమోదం తీసుకోలేదు. ఉనికిని కాపాడుకునేందుకే విరాళాలిచ్చారన్న విమర్శలున్నాయి. గతేడాది డిసెంబరు 31 వేడుకల పేరుతో రూ.20లక్షలు ఖర్చు చేసినట్లు చూపించారు. సినీ రంగానికి చెందిన వారు లేకుండా వేడుక సాగింది. అంత ఖర్చు చేసినా రూ.3-4లక్షల టికెట్లు కూడా అమ్ముడుపోలేదు. ఇప్పటికే క్లబ్ ప్రాంతంలో పోర్టికోలు నిర్మించి రూ.1.50కోట్లు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలున్నాయి. క్లబ్ ఉన్న స్థలానికి అద్దె నెలకు రూ.4లక్షలు ఉండగా.. దాన్ని రూ.7లక్షలకు పెంచి చెల్లిస్తున్నారు. స్థల యజమాని వైకాపాకు చెందిన నాయకుడు కావడంతోనే ఇలా చెల్లిస్తున్నట్లు సమాచారం. ఇటీవల మద్యం, శీతల పానీయాల లెక్కల్లో రూ.3లక్షల వరకు తేడాలు రాగా, వాటిని సరిచేశారని కొందరు సభ్యులు చెబుతున్నారు.

**నాడు ఇలా:** క్లబ్ ఛైర్మన్‌గా ఉన్న కేవీస్ రామారావును తప్పించి బైలాస్‌లో మార్పులు చేసి శాశ్వత కమిటీ, మేనేజ్‌మెంట్ కమిటీలను నాడు తెరపైకి తెచ్చారు. శాశ్వత కమిటీకి ఛైర్మన్‌గా జగన్ సలహాదారుగా ఉన్న సాగి దుర్గాప్రసాద్‌రాజు, సభ్యులుగా ఏసీఏ మాజీ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి, ఏయూ మాజీ వీసీ ప్రసాద్‌రెడ్డి, పలువురు చేరారు. మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడిగా మారిటైం బోర్డు మాజీ ఛైర్మన్ కాయల వెంకటరెడ్డిని నియమించారు.

**ఏప్రిల్ 20న ఎన్నికలు**

కూటమి అధికారంలోకి రాగానే గతేడాది ఆగస్టు 24న వార్షిక సర్వసభ్య సమావేశంలో శాశ్వత కమిటీని రద్దు చేస్తూ మేనేజ్‌మెంట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న కాయల వెంకటరెడ్డి రాజీనామా చేసినట్లు ఇటీవల లేఖ ఇచ్చారు. అయితే రాజీనామా ఆమోదించి, పదవిని రద్దు చేసినట్లు క్లబ్ కార్యదర్శి శ్రీనివాసరాజు ఇప్పటి వరకు ప్రకటించకపోవడం గమనార్హం. మరో వైపు సంయుక్త కార్యదర్శి క్లబ్‌లోనే కొనసాగేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఈ నెల 6న క్లబ్ అంతర్గత సమావేశం నిర్వహించి ఏప్రిల్ 20న ఎన్నికలకు వెళుతున్నట్లు ప్రకటించారు. కానీ, నోటీసు బోర్డులో ఇప్పటి వరకు ఎన్నికల అంశం పెట్టలేదని సమాచారం. సభ్యులందరికీ ఈ విషయం తెలియజేయలేదు. ఎన్నికల నోటిఫికేషన్‌కు 21 రోజుల ముందే సభ్యులకు నోటీసులివ్వాల్సి ఉ ంటుంది కనుక ఈనెలాఖరులోగా ఫిల్మ్ క్లబ్ ఎన్నికలపై స్పష్టత రావొచ్చు.

## రాయితీ గాలిలో దీపం!

మార్టేరు : అత్తిలి మండలంలో సుమారు 26 వేల మందికి గ్యాస్ కనెక్షన్లు ఉండగా ఇప్పటి వరకు 19,902 మంది లబ్ధి పొందారు. మిగిలిన వారికి ఏ కారణంతో సొమ్ము అందలేదో అధికారులు చెప్పలేకపోతున్నారు. లబ్ధి చేకూరని అర్హులు కొందరు అధికారులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**కొరవడిన స్పందన**

పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన రాజు నెల రోజుల కిందట గ్యాస్ సిలిండర్ తీసుకున్నారు. రాయితీ సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ కాక గ్యాస్ ఏజెన్సీ సిబ్బందిని సంప్రదిస్తే వివరాలు ఓపెన్ కావడం లేదంటూ పంపేశారు. టోల్‌ఫ్రీ నంబరుకు మాట్లాడే ప్రయత్నం చేయగా స్పందన లేక వదిలేశారు.

**వినతుల స్వీకరణతో ఊరట**

జిల్లాలో 27 గ్యాస్ కంపెనీల పరిధిలో సుమారు 15 వేల మంది వివిధ కారణాలతో పథకం లబ్ధి పొందలేకపోయారు. గతేడాది అక్టోబర్ 23 నుంచి ఉచిత సిలిండర్లు బుక్ చేసుకునే అవకాశం కల్పించారు.



బుక్ చేసుకుని నెలలు గడుస్తున్నా రాయితీ సొమ్ము ఖాతాల్లో పడలేదు. ప్రస్తుతం వీరి నుంచి వినతులు స్వీకరిస్తుండటంతో కొంత ఊరట చెందుతున్నారు.

**పనిచేయని టోల్‌ఫ్రీ నెంబరు**

వినియోగదారుడి హెల్ప్‌లైన్ నంబర్‌తోపాటు హెల్ప్‌లైన్ సపోర్టు పేరుతో పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేసిన రెండు నంబర్లు పనిచేయడం లేదని పలువురు వాపోయారు.

**సాంకేతిక సమస్యలతో..**

సూపర్ సిక్స్ పథకం అమల్లో భాగంగా గతేడాది నవంబరు ఒకటి నుంచి దీపం-2 పథకం కింద పేద కుటుంబాలకు ఏడాదికి ఉ చితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలి ఉచిత సిలిండర్‌ను 2025 మార్చి31లోగా తీసుకోవడానికి అవకాశం కల్పించింది. సాంకేతిక సమస్యలు, లబ్ధిదారుల అర్హత వివరాల నమోదులో చోటు చేసుకున్న తప్పిదాలతో అనేక మందికి రాయితీ అందడం లేదు.

## గోరంత పని.. కొండంత దోపిడీ

ఏలూరు : ఇది తంగెళ్లమూడిలో నిర్మాణంలో ఉన్న చెత్త తరలింపు కేంద్రం. రూ.94.34 లక్షల కేటాయించారు. పునాదుల దశ కూడా దాటలేదు. గుత్తేదారులకు రూ.62.3 లక్షలు చెల్లించారు. దాదాపు 70 శాతం పూర్తి చేసిన తర్వాత ఇవ్వాల్సిన బిల్లులు ముందే ఇచ్చేశారు.వైకాపా పాలకులు ఏలూరు నగరపాలికను అక్రమాలకు అడ్డాగా మార్చేశారు. అభివృద్ధి పనుల మాటున దోపిడీ చేశారు. నిర్మాణాలు పునాదుల దశ దాటకున్నా..బిల్లులు మాత్రం 50శాతం పైగా చేసుకున్నారు. అధికారులు అప్పటి పాలకుల ఆదేశాలు నెత్తిన పెట్టుకోవడం..నిబంధనలకు నీళ్లొదిలి వారు చెప్పిందానికి తలాడించ డంతో నిధులు స్వాహా అయ్యాయి.

**రూ.కోటి పైనే కొట్టేశారు..**



తంగెళ్లమూడి, పంపుల చెరువు, వెంకన్న చెరువులో మూడు చెత్త తరలింపు కేంద్రాలు, వెంకన్న చెరువులో శ్మశానంలో అంత్యక్రియల షెడ్డు, ఇతర సౌకర్యాలకు రూ.3.3 కోట్లు కేటాయించారు. ఈ పనులు ఎక్కడా 20 శాతం మించి చేయలేదు. నిబంధనల ప్రకారం రూ.66 లక్షలకు మించి బిల్లులు ఇవ్వకూడదు. ఇక్కడ మాత్రం అడ్డగోలుగా రూ.1.64 కోట్లు అప్పనంగా ఇచ్చేశారు. అంటే దాదాపు రూ.కోటి వరకు నొక్కేశారు. మోడల్ స్మార్ట్ స్ట్రీట్ పనుల్లోనూ రూ.20 లక్షలకు పైగా మింగేశారు.ఇది ఏలూరు కర్రల వంతెన దగ్గర నిర్మాణంలో ఉ న్న మోడల్ స్మార్ట్ స్ట్రీట్. ఇది పాత బస్టాండ్ నుంచి జూట్‌మిల్లు వరకు దాదాపు 400 మీటర్ల మేర నిర్మించాలి. 50 మీటర్లు మేర పుట్‌పాత్ ఏర్పాటు చేసి రూ.40.5 లక్షల వరకు బిల్లులు చేసేసుకు న్నారు. అంతా ఆయన మాయ.. ఈ వ్యవహారం ఓ బడాబాబు కనుసన్న ల్లోనే జరిగినట్లు తెలుస్తోంది. క్షేత్ర స్థాయిలో చేసిన పనులకు.. పెట్టిన బిల్లులకు పొంతన లేకున్నా అధికారులు నిధులు జమచేశారంటే ఏ స్థాయిలో మభ్యపెట్టారో తెలుస్తోంది. అప్పట్లో వైకాపా నేత అండ పుష్కలంగా ఉండటంతో ఆడిందే ఆట..పాడిందే పాట అన్నట్లు వ్యవహ రించారు. పనుల్లో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోందని..విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కమిషనర్ భాను ప్రతాప్ తెలిపారు.

## పోలవరం 'పరుగులు'

ఏలూరు: వైకాపా పాలనలో నత్తనడకన సాగిన పోలవరం నిర్మాణ పనులు పరుగులు పెడుతున్నాయి. అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ముందుకు వెళుతున్నారు. అధికారం చేపట్టిన 9 నెలల్లో మూడో మారు పోలవరం వస్తున్నారంటే ప్రాజెక్టుకు ఆయన ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. నిర్మాణంతో పాటు పునరావా సం, పరిహారం తదితర అంశాలపై కీలక ప్రకటనలు చేసేందుకు అవకాశం ఉంటుందన్న చర్చ సాగుతోంది. శరవేగంగా నిర్మాణం.. సీఎం డిసెంబర్- 16న రెండోసారి ప్రాజెక్టు నిర్మాణంపై సమీక్షించారు. జనవరి 18న డయాఫ్రంవాల్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఇందులో 389 ప్రైమరీ, సెకండరీ ప్యానళ్లు నిర్మించాల్సి ఉండగా ఇప్పటికి 28 ప్రైమరీ ప్యానళ్ల నిర్మాణం పూర్తి చేశారు. జూన్-అక్టోబరు మధ్య వరదల ప్రభావంతో పనులు ఆపకుండా ఎగువ కాఫర్ డ్యాంను అనుకుని సమాంతరంగా డ్యాం నిర్మిస్తున్నారు. దీంతో పనులు జరిగే ప్రాంతానికి నీరు రాకుండా ఉంటుంది. వరదల అనంతరం ఈసీఆర్ఎఫ్ డ్యాంకు అనుసంధానంగా మట్టి, రాళ్లతో జరగాల్సిన నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

# శిథిల వారధి.. వెళ్లే దారేదీ?

కణేకల్లు : కణేకల్లు మండలంలో వంతెనలు శిథిలావస్థకు చేరి ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయి. కనీసం మరమ్మతులు చేపట్టడం లేదు. వాటి స్థానంలో కొత్తవి నిర్మించడం లేదు. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు, రైతులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే రెండు వంతెనలు కూలిపోగా, ఐదు శిథిలావస్థకు చేరి దిబ్బతిన్నాయి. మరికొన్ని ఇరుకుగా మారి విస్తరణకు నోచుకోవడం లేదు.

**ఎక్కడెక్కడ ఎలా..**

బిదురుకొంతం వద్ద వ్యాసాపురం గ్రామానికి వెళ్లే దారిలో వంకపై నిర్మించిన పాత కాలం నాటి వంతెన ఇటీవల ఉన్నఫళంగా కూలిపోయింది. ఈ మార్గంలో బిదురుకొంతం, డి.హెొన్నూరు గ్రామాల రైతులు పొలాలకు వెళ్తుంటారు. మీనహళ్లి, గరుడచేడు, తుంబిగనూరు, డి.హెొన్నూరు, గోవిందవాడ తదితర 20 గ్రామాల ప్రజలు వ్యాసాపురానికి రాకపోకలు సాగిస్తుంటారు. కూలిన వంతెనపై స్థానికులు మట్టి తోలి తాత్కాలికంగా బాగు చేసుకున్నారు.

గరుడచేడు, మీనహళ్లి గ్రామాల నడుమ వంతెన మధ్యలో ఏడాది కిందట రంధ్రం పడింది. ఇరువైపులా మట్టిగట్లు, పిల్లర్ల గోడలు



కొంతమేర కూలిపోయాయి. వంతెన కూలిపోతే కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని 30 గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోతాయి.

ఆదిగానిపల్లి వద్ద వేపరాల దారిలో రెండు వంతెనలలో ఒకటి పూర్తిగా కూలిపోగా, మరొకటి సగం కూలిపోయి ప్రమాదకరంగా తయారైంది. ఆదిగానిపల్లి సర్పంచి చొరవ తీసుకొని వంతెన కూలిన చోట మట్టి పోశారు. ప్రజలు కూలిన వంతెనపై ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. ఈ విషయమై పీఆర్, ర.భ డీఈలు సుధాకర్‌నాయక్, రవిశంకరరెడ్డిని వివరణ కోరగా తాత్కాలిక మరమ్మతులు, కొత్త వంతెనల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు.

# అమితవేగం.. అధిక లోడు అడిగేదెవరు?

అనకాపల్లి : జిల్లాలో నిబంధనలు మీరి రోడ్లపైకొస్తున్న భారీ వాహనాలు స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. క్వారీ లారీలు ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సిన అధికారులు హెచ్చరికలకే పరిమితమవుతున్నారు. దీంతో దారులు ధ్వంసమైపోతున్నాయి. బడా బాబుల కనుసన్నల్లో మైనింగ్ జరుగుతుండడంతో బండ రాళ్లు జారిపడుతున్నాయి. ఇటీవల విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి గడ్డర్‌ను బండ రాళ్ల లారీ బలంగా ఢీకొట్టింది. దీని ధాటికి ఏకంగా రైలు పట్టాలే ధ్వంసమైపోయాయి. అయిదు గంటలపాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి.

అనకాపల్లి సమీప కొండలన్నింటి నుంచి రాంబిల్లి ఎన్ఏవోబీ పనులకు బండరాళ్లను తరలిస్తున్నారు. వైకాపా హయాంలో అప్పటి నేతలు వీటి రవాణా వ్యవహారాలు చూసుకునేవారు. అప్పట్లోనే విచ్చలవిడిగా పరిమితికి మించిన బరువుతో క్వారీ లారీలు తిరుగుతుండేవి. వాటి కారణంగానే రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక బండరాళ్ల రవాణా నేతల చేతులు మారింది. నిబంధనల ఉల్లంఘనల్లో తీరు మాత్రం మారలేదు. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం, రాంబిల్లి వరకు భారీ బండరాళ్లతో ప్రతి అయిదు నిమిషాలకో లారీ తిరుగుతూనే ఉంది. కూటమి ప్రభుత్వం రోడ్లు కొంతవరకు బాగుచేసినా ఈ క్వారీ లారీలతో యథాస్థితికి వచ్చేస్తున్నాయి.

నిబంధనల ప్రకారం 12 టైర్ల లారీకి 20 టన్నుల వరకు, 10 టైర్ల లారీకి 16 టన్నుల వరకు రాళ్లు తరలించడానికి అనుమతులుంటాయి. డబ్బు ఆశతో వాహనదారులు పరిమితికి మించి లోడ్ చేస్తున్నారు. 20 టన్నులు వేయాల్సిన టిప్పర్‌లో 50 నుంచి 60 టన్నులు నింపుతున్నారు. ఇంత బరువుతో వెళ్లే లారీలు 30 నుంచి 40 కి.మీ మించి వేగంతో వెళ్లకూడదు. వీరు మాత్రం జనావాసాల చెంత కూడా 50 కి.మీ వేగం తగ్గకుండా నడుపుతున్నారు. ఇలా వెళ్లే వాహనం ఢీకొని మునగపాక వద్ద ఓ వృద్ధుడు ప్రాణం కోల్పోయాడు. రెండు



సార్లు రైల్వే గడ్డర్లను ఢీకొన్నాయి. మరోవైపు పరవాడ మార్గంలో బూడిద లారీలు, నర్సీపట్నం, తాళ్లపాలెం మార్గంలో ప్రైవేటు కంపెనీ లారీలు పరిమితికిమించి బరువుతో రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి వల్ల ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు పలుమార్లు వాహనాలను అడ్డగించి ఆందోళన చేపట్టినా పరిస్థితి మారడం లేదు.

**కలెక్టర్ చెప్పినా బేఖాతర్..**

ఇటీవల రైల్వే పట్టాలు ధ్వంసమైన తర్వాత క్వారీ నిర్వాహకులతో కలెక్టర్ విజయకృష్ణన్ సమావేశమయ్యారు. అనకాపల్లి మీదుగా రాత్రి వేళల్లో బండరాళ్లు తరలించొద్దని ఆదేశించారు. ఈ సమావేశం తర్వాత కూడా అయిదు లారీలు పట్టుబడ్డాయంటే అధికారుల ఆదేశాలను ఏమాత్రం పాటిస్తున్నారో అర్థమవుతుంది. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం రహదారిలో నిత్యం 350 నుంచి 400 వరకు లారీలతో బండరాళ్లను తరలిస్తున్నారు. వారిలో నిబంధనలు పాటించని క్వారీ వాహనాలకు అదుపు చేయడానికి రవాణా, పోలీస్, గనులు, భూగర్భ శాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. అయితే ఈ దిశగా తనిఖీలు చేయడం లేదన్నది స్పష్టం. ఏదైనా ఘటన జరిగినప్పుడు హంగామా చేయడం.. తర్వాత మిన్నకుండిపోవడం పరిపాటిగా మారిపోతోంది.

# ఆయన కన్నేస్తే.. భూమి హాంఫట్!



అనంత : భూముల ఆక్రమణల్లో ఆయన ఆరితేరిపోయారు. రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు.. రెవెన్యూ అధికారుల మాయాజాలంతో అప్పనంగా ఆక్రమించేందుకు పావులు కదుపుతారు. ప్రస్తుతం ఆయన పేరుపై రూ.13 కోట్ల విలువైన భూమి ఉందంటే సారు చేతివాటం ఏ పాటిదో అర్థమయ్యే ఉంటుంది. అంత స్థాయిలో ప్రభుత్వ భూమిని ఎలా సంపాదిస్తాడో ఎవరికీ అంతుచిక్కని ప్రశ్న. అన్ని హక్కులు ఉన్న భూములు అడంగల్‌లో నమోదు చేయాలంటే సవాలక్ష సాకులు చెప్పే అధికారులు ఒక ఎంపీపీగా ఉన్న ఆతని పేరుపై ఎలా నమోదు చేశారో అర్థం కాని విషయం. గతంలోనూ ఓ నాయకుడి అండతో ఎంపీపీ దందా కొనసాగించినట్లు చర్చనీయాంశమైంది. తాజాగా అనంతపురం గ్రామీణ మండలం ఇటుకలపల్లి గ్రామానికి కూడా ఆక్రమణలు విస్తరించినట్లు వెలుగు చూసింది. ఇటుకలపల్లి పొలం సర్వే నం 248-1సి1, 3బీ, 3సీ, 3డీ, 3ఈలో మొత్తం 2.56 ఎకరాల భూమి అతను కొనుగోలు చేసినట్లు రెవెన్యూ రికార్డుల్లో చూపిస్తోంది. గత ఏడాది డిసెంబరు 17, 2014లో మ్యుటేషన్ ఆమోదించడం వివాదాస్పదమైంది.

**ఐదు భాగాలుగా విడగొట్టి..**

ఇటుకలపల్లి పొలం సర్వే నం.248లో మొత్తం 9 ఎకరాల ప్రభుత్వ అసైన్‌మెంటు భూమి ఉంది. ఈ గ్రామానికి సంబంధించి ప్రభుత్వ బోర్లు, ధోబీఘాట్లు ఉన్నాయి. ఈ భూమి గ్రామానికి చాలా అవసరమని ప్రభుత్వం ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. ఆత్మకూరు మండలానికి చెందిన ఓ వ్యక్తికి పాసు పుస్తకాన్ని సృష్టించి అతని ద్వారా ఎంపీపీ కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ భూమిని ఐదు విభాగాలు విడగొట్టి కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఈ భూమిని కోట్ల రూపాయలకు బేరం పెట్టారు. ఇక్కడ భూమి విలువ ఎకరా రూ.5 కోట్లకు పైగానే ఉంది.

**విచారణ చేస్తాం..**

ఇటుకలపల్లి పొలం సర్వే నం 248లో ఉన్న భూమి ప్రభుత్వానిదే. దీని విక్రయం ఎలా జరిగిందో సమగ్ర విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

మోహన్‌కుమార్, తహసీల్దార్

# మామిడి బోర్డు.. 7 ఎంఎస్ఎంఈ పార్కులు



చిత్తూరు : జిల్లాలోని వనరులు అందిపుచ్చుకుని ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు తెస్తామని సీఎం చంద్రబాబుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు. రైతాంగం ఉద్యాన పంటలపై ఆధారపడ్డారని.. ఆధునిక సాంకేతికతను వినియోగించి అన్నదాతల ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో తలసరి ఆదాయం రూ.2,64,798గా ఉంటుందని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ల సదస్సులో రెండో రోజైన బుధవారం ఆయన జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రణాళికలను సీఎంకు వివరించారు.

**విరూపాక్షపురం- కుప్పం వరకు నూతన లైన్**

తిరుపతి-కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్ భూసేకరణకు సర్వే చేపట్టామన్నారు. విరుపాక్షపురం నుంచి కుప్పం వరకు 18 కి.మీ మేర నూతన రైల్వే లైన్ ఏర్పాటుపై మే చివరి నాటికి డీపీఆర్ సిద్ధం చేసి రైల్వేబోర్డుకు పంపుతామన్నారు. తిరుపతి-బెంగళూరు మధ్య (వయా కాట్పాడి, కుప్పం) డబ్లింగ్‌కు ప్రతిపాదించమన్నారు. చిత్తూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ సెప్టెంబరు నాటికి పూర్తవుతుందన్నారు.

**92,554 ఇళ్లపై సౌర ఫలకాలు**

పీఎం సూర్యఘర్ యోజనతో 92,544 ఇళ్లపై 2026 మార్చి నాటికి సౌర విద్యుత్తు ఫలకాలు అమరుస్తామన్నారు. పీఎం కుసుమ్ కింద వ్యవసాయ పంప్‌సెట్ల ఏర్పాటుకు రూ.వెయ్యి కోట్లు వెచ్చిస్తామన్నారు. చిత్తూరులోని తిమ్మసముద్రంలో 19 ఎకరాల్లో ఎంఐజీ లేఅవుట్ వేశామని, పుంగనూరు మండలం మేలుందొడ్డిలో ఆరు నెలల్లో మరో లే అవుట్ అందుబాటులోకి తెస్తామన్నారు. జిల్లాలో 330 క్వారీల్లో కార్యకలాపాలు నిలిపేశారని.. సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో నెలకొల్పితే వ్యవసాయ, ఉద్యాన, పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతికి ఇబ్బందులు ఉండవన్నారు.

**సీఎం సానుకూల స్పందన**

కలెక్టర్ ప్రస్తావించిన సమస్యలు పరిష్కరిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. 13.22 శాతం వృద్ధిరేటుతో చిత్తూరు, అన్నమయ్య జిల్లాలు ఏడో స్థానంలో నిలిచాయని ప్రశంసించారు. మల్లెమడుగు, బాలాజీ జలాశయాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తామన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమల నుంచి ఎగుమతులు నిలిచిపోయాయని ముఖ్యమంత్రి దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లగా మామిడి గుజ్జు సమస్యనూ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కోరారు. 'స్కిల్ అప్' చిత్తూరు కార్యక్రమం ద్వారా 15వేల మందికిపైగా రైతులకు సాంకేతికతపై అవగాహన కల్పిస్తామన్నారు. రూ.2 కోట్లు విడుదల చేస్తే చిత్తూరులో అగ్రి ల్యాబ్ నిర్మాణం పూర్తవుతుందని విన్నవించారు. కుప్పంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించామని.. కేంద్రం నుంచి వేగంగా సాయమందేందుకు చొరవ చూపాలని విన్నవించారు. అది అందుబాటులోకి వస్తే ప్రతి సీజన్‌లో 15 వేల మంది రైతులకు శిక్షణ ఇవ్వవచ్చని కలెక్టర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

పర్యాటకానికి మణిహారంగా ననియాల

రామకుప్పం మండలం ననియాలను పర్యాటకానికి మణిహారంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎకో టూరిజం పార్కు, జంగిల్ సఫారీ ట్రాక్, సాహస క్రీడలు, రెస్టారెంట్, ట్రెక్కింగ్, క్యాంప్ ఫైర్ వంటి సౌకర్యాలు ఇక్కడ కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఏడు జలవనరుల శాఖ ప్రాజెక్టులకు సంబంధించి రూ.96.04 కోట్లు రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉందని.. అవి విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కుప్పం, చిత్తూరులో కేంద్రీయ విద్యాలయాలు, కుప్పంలో పట్టు పరిశోధన కేంద్రం ఏర్పాటుకు సహకరించాలన్నారు. పలమనేరులో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.91 లక్షలు ఆర్థిక సాయం అందించాలని కోరారు.

**నెలలో కోశలనగరం కొలిక్కి..**

విజయపురం మండలం కోశలనగరం పార్కులో అప్రోచ్ రోడ్ల వివాదాన్ని నెల రోజుల్లో పరిష్కరిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఏడు నియోజకవర్గాల్లో ఏడు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు 351.93 ఎకరాలు గుర్తించామన్నారు. కుప్పం కేంద్రంగా పరిశ్రమలు ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఓ తైవాన్ సంస్థ ముందుకొచ్చిందని.. 10వేలు- 20వేల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.

**2,628 సీసీ కెమెరాల ఏర్పాటు**

జిల్లాలో 3 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ఈ ఏడాది మార్చి 21 నాటికి 2,628 సీసీ కెమెరాలు అమర్చామన్నారు. నాలుగు డ్రోన్లతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. పూతలపట్టు, తవణంపల్లె, పలమనేరు, గంగవరంలో ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలను పట్టుకున్నామని వివరించారు.

# పెన్నాలో ఇసు'కాసుల' పంట

బుక్కరాయసముద్రం : బెళుగుప్ప మండలంలోని కాలువపల్లి గ్రామ సమీపంలో ఉన్న పెన్నానదిని ఇసుక అక్రమార్కులు చుట్టుముట్టారు. రాత్రింబవళ్లు నదిలోని ఇసుకను తోడేస్తున్నారు. ట్రాక్టర్లలో అనంతపురం తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడి నుంచి జిల్లా కేంద్రం 30 కిలోమీటర్ల దూరం ఉంటుంది. నిర్మాణాలకు ఇసుక పెద్ద ఎత్తున అవసరం అవుతుండటంతో ఇసుకాసురుల కన్ను పెన్నానదిపై పడింది. నదిలో నుంచి రోజూ వందల ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తవ్వి ఆత్మకూరు మీదుగా జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. ఒక ట్రాక్టరు ఇసుకను రూ.3 వేల వరకు అమ్ముతున్నారు. రాత్రిళ్లు టోల్‌గేట్ సిబ్బంది నుంచి సమస్యలు రాకుండా ట్రిప్పునకు రూ.200 వరకు ముట్టజెబుతున్నట్లు తెలిసింది. పెద్దఎత్తున ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ షర్మిల దృష్టికి



తీసుకెళ్లగా పరిశీలించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

# నిల్వలో తేడా.. బియ్యంలో కోత

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఏప్రిల్ కోటాకు సంబంధించి బియ్యం కేటాయింపుల్లో 4,540 టన్నుల కోత పడినట్లు సమాచారం. ఒక్క కర్నూలు జిల్లాలో 25 శాతానికి పైగా కోత విధించారు. రేషన్ దుకాణంపై 6(ఏ) కేసు నమోదై ఉంటే అక్కడ రేషన్ సరకుల పంపిణీ జరగదు.అలాంటి దుకాణాలకు జీరోకోటా వచ్చే అవకాశాలున్నాయి. కొన్ని దుకాణాలకు 10, 20, 50, 75, 100 క్వింటాళ్లు కేటాయించినట్లు సమాచారం. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఉగాది, రంజాన్ పర్వదినాల్లో పేదలు ఇబ్బంది ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

**నాటి తప్పులు.. నేటి తిప్పలు**

ఐదేళ్ల వైకాపా హయాంలో ప్రజాపంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. వైకాపా నేతలు, కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో కలిసి వేల టన్నుల బియ్యాన్ని స్వాహా చేశారు. ఆదోని, బనగానపల్లి, నంద్యాల తదితర ప్రాంతాల్లో గోదాముల్లో పెత్తనం చేశారు. లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా సరిహద్దు(కర్ణాటక) దాటించారు. ఆ సరకు నిల్వ ఉన్నట్లు లెక్కలు రాశారు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలించగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. మిగులు పేరుతో టన్నుల బియ్యాన్ని మింగారు. ప్రక్షాళన అంటూ బియ్యం కోటాకు



కోత పెట్టారు.

**లెక్కలు చూడకుండానే**

తక్కువ మొత్తంలో బియ్యం కేటాయింపులతో డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. లబ్ధిదారులకు సర్దుబాటు చేయడం కష్టమవుతుంది.. పంపిణీ మా వల్ల కాదంటూ ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. ఎవరో చేసిన తప్పులకు మమ్మల్ని ఇబ్బందులకు గురి చేయడం ఏంటని ప్రశ్నించారు.ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల బియ్యం కేటాయింపులు, కార్డుదారులకు పంపిణీ సరాసరి లెక్కించి.. ప్రభుత్వం ఏప్రిల్ కోటా ఇచ్చింది. డీలర్ల దగ్గర మిగులు నిల్వలు ఎంత ఉన్నాయి.. లెక్కగట్టి రేషన్ కోటా ఇవ్వాలి. అలా కాకుండా వరుసగా మూడు మాసాల పాటు రేషన్ తీసుకున్న వారి లెక్క ప్రకారం కేటాయింపులు చేస్తే ఎలా అని డీలర్లు అంటున్నారు.

**వలస జీవులకు ఉపవాసమే**

వాస్తవంగా ప్రతి నెలా 10-12 శాతం మంది మాత్రమే రేషన్ సరకులు తీసుకోవడం లేదు. ఇంటింటికి రేషన్ పంపిణీలో భాగంగా ఎండీయూ వాహనాలు గ్రామాలకు, వీధులకు సరిగా తిరగకపోవడం, కొన్ని ప్రాంతాల్లో అసలు రేషన్ బండ్లు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయకపోవడం తదితర కారణాలతో కార్డుదారులకు సరకులు అందని పరిస్థితి. మరికొందరు కార్డుదారులు బతుకుదెరువు కోసం వలసలు వెళ్లారు. ఈ రెండు కారణాల వల్లే రేషన్ సరకులు తీసుకోవడం లేదు. పండగల నేపథ్యంలో వారంతా జిల్లాలకు వస్తారు. అలాంటప్పుడు వారికి రేషన్ సరకులు లేనట్టేనా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

# శ్మశానాన్నీ అమ్మేసుకున్నారు

యర్రగొండపాలెం : ఖాళీ స్థలాలు, ప్రభుత్వ భూములు, కొండలు, వాగులు.. కావేవీ ఆక్రమణకు అనర్హం అన్నట్లు సాగింది వైకాపా హయాంలో కొందరి తీరు. చివరికి శ్మశానాలనూ అక్రమార్కులు వదల్లేదు. ఆక్రమించి ప్లాట్లుగా మార్చేశారు. ఆపై అమ్మకానికి పెట్టారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి చేతులు దులుపుకొంది.

**మాజీ చెప్పారని రాళ్ల తొలగింపు**

వై.పాలెం పట్టణం కొలుకుల రోడ్డులో సర్వే నంబరు 600లోని 2.14 ఎకరాల శ్మశాన వాటిక ఉంది. ఈ భూమి ప్రస్తుతం చాలావరకు ఆక్రమణకు గురైంది. శ్మశాన వాటిక పక్కనే ఉన్న ప్రైవేట్ భూమిని కొందరు వైకాపా నాయకులు గతంలో ప్లాట్లుగా మార్చారు. పనిలో



పనిగా శ్మశాన భూమిని 35 సెంట్లకు పైగా ఆక్రమించారు. రెండింటికీ కలిపి గోడ కట్టి ప్లాట్లు వేశారు. స్థానికుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు కొలతలు వేసి హద్దురాళ్లు పాతారు. అప్పటి మంత్రి అండతో అక్రమార్కులు వాటిని తొలగించారు. ఆక్రమణకు గురైన శ్మశాన స్థలం విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.అర కోటి పైనే ఉంటుంది.

**ఇక మిగిలింది అరెకరం**

వైకాపా నాయకుల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో ఇతరులు మరికొంత భూమిలో పాగా వేశారు. దీంతో 2,14 ఎకరాలకు గాను ప్రస్తుతం అరెకరం మాత్రమే మిగిలింది. పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్తులో శ్మశానమే కనుమరుగయ్యే ప్రమాదముందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం శోచనీయం.


# జీవాల గొంతుకు జలం

బేస్తవారపేట : ఎండలు మండుతున్న వేళ మనుషులకు నీరు దొరకడమే కష్టంగా ఉంటోంది. పశువులకు మరింత ఇబ్బందిగా మారుతోంది. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు అడుగంటడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మూగజీవాల దాహార్తి తీర్చేలా ఉపాధి హామీ పథకంలో కొత్తగా నీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పదిహేను రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అమరావతిలో సోమవారం నాటి కలెక్టర్ల సదస్సులో విధివిధానాలు రూపొందించింది.

పంచాయతీకి రెండు: ఉపాధి హామీ పథకంలో చేపట్టబోయే పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు పంచాయతీకి రెండు చొప్పున మంజూరు చేశారు. ఒక్కోటి నిర్మాణానికి సుమారు రూ.25 వేలు ఖర్చు చేయనున్నారు. నీటి వసతి ఉన్న చోట ముందుచూపుతో వీటిని నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో తొట్టెను 5,200 లీటర్ల నీటితో నింపుతారు. అవి కూడా రక్షిత పథకం నీటితో నింపేలా చర్యలు తీసుకోనున్నారు.

# ఇక్కడ పేరు.. అక్కడ చదువు

పాడేరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి కొన్నిచోట్ల ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారు. పిల్లల పేర్లు మాత్రమే తమ పాఠశాలల్లో చూపిస్తున్నారు.. వారి చదువులు మాత్రం ప్రైవేటు పాఠశాలల్లో సాగించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. నర్సీపట్నం మండలంలో కేడీపాలెం, నగరం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సంధ్య, సూర్యప్రకాశ్ పిల్లలు ప్రైవేటు స్కూళ్లకు పంపించి ప్రభుత్వ పాఠశాలల్లో చూపించడంతో వారిద్దరిపై వేటు వేశారు. చోడవరం మండలంలోనూ కొంతమంది ఉపాధ్యాయులు ఈ తరహా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి చర్యలకు సిద్ధం చేస్తున్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)తో గురువుల లీలలు బయటపడుతున్నాయి. వాటిపై ప్రాథమిక విచారణ చేపట్టి ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఈ తరహా అక్రమాలు చాలానే జరిగినట్లు గుర్తించినా ఆ వివరాలు బయటకు




రాకుండా విద్యాశాఖ అధికారులు గోప్యత పాటిస్తున్నారు. గతేడాది మొదలుపెట్టిన అపార్ నమోదు ఇప్పటికీ పూర్తికాకపోవడానికి విద్యార్థుల లెక్కలు తేలకపోవడం కూడా ఓ కారణమని సంబంధిత అధికారులే చెబుతున్నారు.

**ప్రవేశాల్లో మాయాజాలం..** విద్యార్థుల సంఖ్య తగ్గిపోతే ఆయా పాఠశాలల్లో పోస్టులు కోతపెడతారని కొంతమంది ఉపాధ్యాయులు ప్రవేశాలను (అడ్మిషన్లు) రికార్డుల్లోనే చూపిస్తున్నారు. వారు బడికి రాకపోయినా హాజరుపట్టీలో మాత్రం వచ్చినట్లే టిక్ పెట్టేస్తున్నారు. నవోదయ, సైనిక్ పాఠశాలలు, ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకే ఎక్కువ అవకాశం కల్పిస్తుంటారు. దీనికోసం ప్రైవేటు స్కూల్ పిల్లలను కొన్నిచోట్ల సర్కారీ బడుల్లో చదువుతున్నట్లు చూపిస్తున్నారు. అల్లూరి జిల్లాలో మొత్తం 1,97,049 మంది విద్యార్థులున్నారు. వీరిలో 1,55,809 మంది వివరాలు అపార్‌లో నమోదు చేశారు. ఇంకా 41,418 మంది పెండింగ్‌లో ఉన్నారు.

**మిగతా వారిపై దృష్టి..** ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో చదువుతున్న ఒకటో తరగతి నుంచి జూనియర్ కళాశాల విద్యార్థుల వరకు 'వన్ నేషన్.. వన్ స్టూడెంట్' ఐడీ పేరిట అపార్ నమోదు చేయిస్తోంది. ఒక విద్యార్థి అడ్మిషన్ ఒకే చోట ఉండాలి.. రెండు మూడుచోట్ల చూపడానికి వీల్లేదు. ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసి అపార్ నమోదులో అనధికార విద్యార్థులు వెలుగులోకి వస్తున్నారు. ఈ విషయమై డీఈవో అప్పారావునాయుడు వద్ద ప్రస్తావించగా పరీక్షల దగ్గర పడటంతో అపార్ నమోదుపై ఒత్తిడి తగ్గించామని, అందుకే ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు. అనధికార విద్యార్థుల వివరాలు కొన్నిచోట్ల వెలుగు చూడగా ఇద్దరిపై చర్యలు తీసుకున్నామని మిగతా వారిపైనా దృష్టిసారించినట్లు చెప్పారు. సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చేందుకు యత్నించగా ఉపాధ్యాయులు అందుబాటులో లేరని ఎంఈవో తెలుపులు చెప్పారు.

# పల్లె పయనం.. ఇక పదిలం

నంద్యాల : కొన్నేళ్లుగా నిర్వహణ, మరమ్మతులు కరవై దారుణంగా దెబ్బతిన్న గ్రామీణ రహదారులకు మోక్షం కలుగనుంది. ఇటీవల ఆర్‌అండ్‌బీ రహదారులపై గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం.. తాజాగా పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులపై దృష్టిపెట్టింది. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో ఈ రహదారులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. కొత్త రహదారులు వేయకపోగా.. దెబ్బతిన్న వాటికి మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో చాలా గ్రామాల పరిధిలో రోడ్లు రూపు కోల్పోయాయి. త్వరలో నిధులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సంబంధిత శాఖ అధికారులను ప్రతిపాదనలు పంపాలని ఇటీవల ఆదేశించింది.

**ఐదేళ్లు పట్టించుకోలేదు** జిల్లా పంచాయతీరాజ్‌లో రెండు విభాగాలు ఉన్నాయి. పీఐయూ నుంచి 49 రోడ్లకు ప్రతిపాదనలు పంపారు. 183.01 కి.మీల పొడవున మరమ్మతులకు రూ.68.56 కోట్లతో ప్రతిపాదించారు. పీఆర్ డివిజన్ నుంచి 47 రోడ్లకు 184.94 కి.మీల పొడవున మరమ్మతులు చేసేందుకు రూ.83.06 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఇవన్నీ బాగా దెబ్బతిన్న బీటీ రోడ్లే. వీటిని గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించారు. గత ఐదేళ్లలో కనీస నిర్వహణ లేకపోవడంతో ఛిద్రమయ్యాయి. కొన్ని రహదారు లపై పెద్ద ఎత్తున గుంతలు పడ్డాయి. మరికొన్ని రహదారులపై తారు కొట్టుకుపోయి కంకర రాళ్లు దర్శనమిస్తున్నాయి. పంట పొలాల మధ్య వేసిన రహదారులు కోతకు గురవడంతో వీటిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

**ఎట్టకేలకు వీటికి మోక్షం**

పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల మండలంలో ఎనిమిది చోట్ల రహదారులు బాగా దెబ్బతిన్నాయి. ప్రత్యేకించి నంద్యాల- నందికొట్కూరు రోడ్డు నుంచి భోగేశ్వరం రహదారి వరకు 4.17 కి.మీల పొడవున దారి దారుణంగా ఉంది. గని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పైబోగుల రోడ్డు, ఎన్ఎచ్ రోడ్డు నుంచి- బిలకలగూడూరు వరకు దారి ఛిద్రమైంది. 6.9 కి.మీ ఉన్న చిందుకూరు- పరమటూరు రోడ్డు కూడా అధ్వానంగా మారింది. మంచాలకట్ట- ఎల్‌కే తండా రహదారి మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. శ్రీశైలం నియోజకవర్గంలోని బండిఆత్మకూరు మండలంలో ఈర్నపాడు- మణికంఠాపురం మధ్య 4 కి.మీ, మణికంఠాపురం- ఓంకారం మధ్య 3.3 కి.మీ, బండిఆత్మకూరు- ఈర్నపాడు మధ్య 11 కి.మీల పొడవున్న రోడ్లను బాగు చేయాలని ప్రతిపాదించారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మండలం మహదేవపురం నుంచి కె.కొత్తూరు వరకు 2.58 కి.మీలు, బాచపల్లి నుంచి అహోబిలం వరకు 9 కి.మీల ఉన్న రోడ్ల మరమ్మతులకు నిధులు రానున్నాయి. నంద్యాల మండలంలోని పోలూరు- రాయమాల్పురం, అయ్యలూరు- మసీదుపురం, గోస్పాడు మండలం జిల్లెల్ల- పసురపాడు రోడ్డును మరమ్మతులు చేయనున్నారు.

# పట్టురైతులకు లభించని ప్రోత్సాహకం



హిందూపురం : బైవోల్టిన్ పట్టు రైతులు, రీలర్లకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహక మొత్తం చేతికి అందడం లేదు. దీనిపై ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు రైతులు, రీలర్లు ఎన్నిదఫాలు వినతులు ఇచ్చినా, ప్రదక్షిణ చేసినా.. ప్రయోజనం చేకూరడం లేదు. దీనివల్ల అటు రైతులు, ఇటు రీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్‌సెంటివ్ మొత్తాన్ని ప్రభుత్వం అందించకపోవడంతో ధరలు గిట్టుబాటు కావడం లేదని రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. మరోవైపు కర్ణాటకలో ఇక్కడి ధరల కన్నా కొంత అధికంగా ఉండటంతో అక్కడికే సింహభాగం గూళ్లు తరలిస్తున్నారు. దీనివల్ల హిందూపురంలో ఉన్న 180 మంది రీలర్లకు సరిపడా గూళ్లు స్థానిక మార్కెట్లో లభించక మహారాష్ట్రకు వెళ్లి తెచ్చుకుని సిల్క్‌దారం తీస్తున్నారు. ప్రభుత్వం తమకు సిల్క్‌దారంపై ఇచ్చే ఇన్‌సెంటివ్ సత్వరమే అందించాలని రీలర్లు కోరుతున్నారు.

**కొండలా పెరుగుతున్న బకాయిలు**

2019 నుంచి వైకాపా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు బైవోల్టిన్ రైతులకు అందించాల్సిన ప్రోత్సాహ మొత్తం, అన్ని రకాల రాయితీలు కొండలా పెరుగుతున్నాయి. రైతులకు రూ.70 కోట్లు, రీలర్లకు రూ.7 కోట్లు ప్రోత్సాహక, రాయితీ బకాయిలు అందాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ బకాయిలో కొంత మొత్తం ఓటాన్ అకౌంట్ కింద మంజూరు చేసిందని, ఈ మొత్తం రైతులు, రీలర్ల ఖాతాలోకి జమ చేస్తారని ఆశాభ అధికారులు అంటున్నా ఇప్పటివరకు ఎలాంటి మొత్తం అందక వారు నిరాశ నిస్పృహకు లోనవుతున్నారు.

**ఇన్‌సెంటివ్ ఇవ్వకపోతే అక్కడే విక్రయిస్తాం : బసవరాజ్, దాసేగౌడనహళ్లి, అగళి మండలం**

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధరలు గిట్టుబాటు కావడం లేదు. అందువల్ల కర్ణాటకలోని రామ్‌నగర్, శిడ్లఘట్టకు గూళ్లు తీసుకెళ్లి విక్రయించుకొంటాం. ఇక్కడి ధర కన్నా అక్కడ కొంత అధికంగా ఉన్నందున రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. అందువల్ల ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలి.

**రీలర్లు నష్టపోతున్నారు : ముస్తఫా, పట్టురీలర్ల సంఘం కార్యదర్శి, హిందూపురం**

రీలర్లకు సిల్క్‌దారంపై ప్రభుత్వం అందించే ప్రోత్సాహక మొత్తం అందక అధిక ధరకు గూళ్లు కొని రీలర్లు నష్టపోతున్నారు. ప్రభుత్వం ఇన్‌సెంటివ్ అందిస్తే కొంత అధిక ధరకు గూళ్లు కొనుగోలు చేయవచ్చు. పట్టురైతులు, రీలర్లకు అందాల్సిన బకాయిల విషయం ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లాము.

**రైతుల ఖాతాలోకి డబ్బు జమ చేస్తాం : సురేశ్, పట్టుపరిశ్రమ సహాయ సంచాలకుడు, హిందూపురం**

2024 ఏప్రిల్ నుంచి జనవరి వరకు రూ.1.97 కోట్లను ప్రభుత్వం ఓట్ ఆన్‌అకౌంట్ కింద రైతులకు ప్రోత్సాహక మొత్తం మంజూరు చేసింది. దీనికి మేము 2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు బిల్లులు అందించాము. సిల్క్ ఇన్‌సెంటివ్ కింద రీలర్లకు నాలుగు క్వార్టర్స్ మొత్తం రూ.76 లక్షలు మంజూరైంది. 2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఈ మొత్తం సరిపోవడంతో దీనికి సంబంధించిన బిల్లులు ట్రెజరీ ద్వారా సీఎఫ్ఎంఎస్‌కు పంపాం. ప్రభుత్వం నుంచి నేరుగా మార్చిలోపు ఈ నిధులు రైతుల ఖాతాలోకి జమ అవుతాయి.

# కంది రైతు కంట నీరు

కర్నూలు : మార్క్‌ఫెడ్ నిబంధనలతో రైతులు 'కంది'పోతున్నారు.. కల్లాల్లో పంట అమ్ముడుపోగా కన్నీరు కారుస్తున్నారు.. పప్పు ధాన్యాలకు ధర బాగుంటుంది సాగు చేయమన్నారు.. తీరా పంట చేతికొచ్చిన తర్వాత కొనుగోలు చేయకుండా కొర్రీలు పెడుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాఫెడ్ నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా గతేడాది డిసెంబరు నుంచి మద్దతు ధర రూ.7,550కు కందులను కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించారు. ఓ వైపు కొనుగోలు కేంద్రాల్లేక మరో వైపు నిబంధనల కత్తి విధించడంతో రైతులు తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. క్వింటా రూ.7,200- రూ.7,300 వరకు చెల్లించి కొనుగోలు చేసిన సరకును గోదాముల్లో నిల్వ చేస్తున్నారు.

**ఏడిపిస్తున్న 8 నిబంధనలు**

నాణ్యతా ప్రమాణాలకు సంబంధించి మార్క్‌ఫెడ్ 8 రకాల నిబంధనలు విధించింది. నవంబరు, డిసెంబరు నెలల్లో వరుస తుపాన్లు, ఆ తర్వాత చిరు జల్లులు కురిశాయి.. ఫలితంగా పంట బాగా దెబ్బతింది. దీంతో కందుల్లో నాణ్యత తగ్గింది. నాణ్యమైన పంటనే కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు కొర్రీలు పెట్టడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం



చేస్తున్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో ఈ నెల 7 నుంచి 28 వరకు 65,779 క్వింటాళ్ల కందుల క్రయవిక్రయాలు జరిగాయి. క్వింటాకు మధ్యస్థ ధర రూ.6,689 నుంచి రూ.7,249 దక్కింది. ఏ ఒక్క రోజూ మధ్యస్థ ధర రూ.7,550 లభించలేదు.

రోజువారీ ఏదో ఒకటి, రెండు లాట్లకు గరిష్ఠ ధర రూ.7,800, రూ.7,900, రూ.8001 వ్యాపారులు రాస్తున్నారే తప్ప వాస్తవానికి మధ్యస్థ ధర రూ.7,250 రాని పరిస్థితి నెలకొంది.

నాఫెడ్ నుంచి మార్క్‌ఫెడ్ వారు కందుల కొనుగోలు చేస్తున్నామని ప్రకటన జారీ చేసిన నాటి నుంచి కందుల ధరలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు.

**కొన్నది కొసరంత**

రైతులంతా వ్యాపారులకు విక్రయించిన తర్వాత ఆలస్యంగా మేల్కొన్న అధికారులు ఈ నెల 22 నుంచి కొనుగోలు చేస్తున్నామని ప్రకటించింది. మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్‌లు, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 53 మండలాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసింది. నంద్యాలలో రెండు, కర్నూలు జిల్లాలో మూడు మండలాల్లో కలిపి వారం రోజుల్లో 182 మంది రైతుల నుంచి రూ.1.53 కోట్ల విలువైన 295 టన్నులు కొన్నారు. ఏ ఒక్క రైతుకు ఇప్పటి వరకు నగదు జమ చేయలేదు. కర్నూలులో పండించిన పంటలో 25 శాతం మేర మొదట 16,750 టన్నుల కొనుగోలు చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 9,000 టన్నుల మేర కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు.

# కబ్జాలపై కన్నెత్తి చూడరా!



అనంతపురం : గత ప్రభుత్వంలో వైకాపా నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వందలాది ఎకరాల ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. పేదలకు పంచాల్సిన భూములను సైతం స్థానిక నాయకులు కాజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైకాపా నాయకులు కబ్జా చేసిన భూముల్ని స్వాధీనం చేసుకుంటారని అంతా భావించారు. అయితే 8 నెలలు కావొస్తున్నా.. ఎలాంటి కదలిక కనిపించడం లేదు. చర్యల మాట దేవుడెరుగు కనీస విచారణకు నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ధర్మవరం మండలం రేగాటిపల్లిలో వైకాపా సర్పంచి సురేశ్‌రెడ్డి అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అండతో సుమారు 28 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేశారు. పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించడంతో పాటు అర్హత లేకపోయినా కుటుంబ సభ్యుల పేరుతో సాగుపట్టాలు పొందారు. దీనిపై స్థానిక తెదేపా నాయకులు రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

**కబ్జా చేసి.. కంచె వేసి..**

రేగాటిపల్లి పరిధిలోని 227 సర్వే నెంబరులోని భూమిని 2009లో ఇళ్ల పట్టాల కోసం ప్రభుత్వం తీసుకుంది. అదే లేఅవుట్‌లో గుడి, బడి, మసీదు నిర్మాణాల కోసం భూమి కేటాయించారు. ఇదే లేఅవుట్‌లో గతంలో తెదేపా ప్రభుత్వం 13 ఎకరాలను బీసీ్ల రెసిడెన్షియల్ పాఠశాలకు కేటాయించింది. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్పంచి సురేశ్‌రెడ్డి ఆ 13 ఎకరాలను ఆక్రమించి చుట్టూ కంచె వేశాడు. అందులో ప్రస్తుతం చీనీ తోట సాగు చేస్తున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా భార్య సోదరుల పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించారు. సర్పంచి ఆక్రమించిన 13 ఎకరాల భూమి విలువ సుమారు రూ.15 కోట్లు ఉంటుంది. సర్పంచి సురేశ్‌రెడ్డి భూకబ్జా బహిరంగమే అయినా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటికీ సురేశ్‌రెడ్డి ఆ భూమిలో పంటలు సాగుచేస్తూనే ఉన్నారు.

**సాగుపట్టాలు పేరుతో 15 ఎకరాలు**

పేదలు అనధికారికంగా సాగుచేసుకుంటున్న భూములకు సాగుపట్టాలు అందించాలని గత వైకాపా ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని అడ్డుపెట్టుకుని సర్పంచి సురేశ్‌రెడ్డి కుటుంబ సభ్యుల పేరుతో పట్టాలు రూపొందించి 15 ఎకరాలను కాజేశాడు. ఆశావర్కర్‌గా పనిచేస్తున్న సురేశ్‌రెడ్డి సోదరి పేరుతో 2 ఎకరాలకు సాగుపట్టా ఇచ్చారు. సురేశ్‌రెడ్డి సోదరుడి కుమారుడు సూర్యప్రతాప్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. అతని కుటుంబానికి ఇదేవరకే భూమి ఉంది. అయినా సర్వే నెంబరు 470లో 5 ఎకరాల భూమికి సాగుపట్టా అందించారు. తల్లి లీలావతి పేరుతో సర్వే నెంబరు 422లో మరో 4 ఎకరాలు, సోదరుడు కొండారెడ్డికి 4.65 ఎకరాలు కట్టబెట్టారు. బహిరంగ మార్కెట్లో ఇక్కడి భూముల విలువ ప్రస్తుతం రూ.కోట్లలో ఉంది. సర్పంచి సురేశ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పంపిణీ చేసిన సాగుపట్టాలను రద్దుచేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అనర్హులుగా తేలితే పట్టాలు రద్దు చేస్తాం : మహేశ్, ఆర్డీవో, ధర్మవరం**


పాఠశాలకు కేటాయించిన భూమి కబ్జాకు గురైనట్లు నా దృష్టికి రాలేదు. వెంటనే క్షేత్రస్థాయిలో విచారించి ఆక్రమణలు ఉంటే తొలగిస్తాం. అలాగే రేగాటిపల్లి పరిధిలో పంపిణీ చేసిన సాగుపట్టాలపై విచారణ జరిపి అందులో అనర్హులు ఉంటే వాటిని రద్దు చేస్తాం.

# ఈరన్నకు కుంభాభిషేకం

కౌతాళం : ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి ఆలయం కుంభాభిషేకోత్సవానికి సిద్ధమైంది. ఆలయంలో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయ రాజగోపురాల ప్రారంభం, కలశ స్థాపన, లక్ష్మి, గణపతి, నవగ్రహ, ధ్వజస్తంభం, యాగశాల, మంటపాలు, విగ్రహాల ప్రతిష్ఠాపన, సప్తనదీజలాలతో కుంభాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సుమారు 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తజనం ఎలాంటి ఇబ్బందులు పడకుండా దర్శనానికి ఏర్పాట్లు, సామియానాలు ఏర్పాటు చేశారు. వీఐపీలు, దాతలు, ప్రజాప్రతినిధులు, మంత్రులు తదితర ముఖ్యమైనవారికి అన్ని రకాల సౌకర్యాలతో సుమారు 170 గదులు సిద్ధం చేశారు.

**ఖర్చంతా దాతలదే**

దాతలు సమర్పించిన రూ.3 కోట్లను ఉత్సవాలకు ఖర్చు చేయనున్నారు. లక్ష్మి, గణపతి, నవగ్రహ, ధ్వజస్తంభం, యాగశాల, మంటపాలు, విగ్రహాల ప్రతిష్ఠాపన, ఐదు రాజగోపురాలకు, ఐదు ముఖద్వారాలకు రంగులు, రుత్వికులు, వేదపండితులు తదితర వాటి కోసం ఖర్చు చేస్తున్నారు. మూడు రోజులు భక్తులకు అన్నదానం చేయనున్నారు. చివరి రోజు 3వ తేదీన పూల వర్షం కురిపించేందుకు బెంగళూరుకు చెందిన మంజునాథ్ అనే భక్తుడు హెలికాప్టర్‌ను ఏర్పాటు చేసినట్లు



ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దీనికి ప్రభుత్వ అనుమతి కూడా తీసుకున్నామన్నారు.

**ఐదుగురు పీఠాధిపతుల రాక**

ఈరన్న స్వామి ఆలయంలో 3వ తేదీన జరిగే ప్రధాన ఘట్టానికి ఐదుగురు పీఠాధిపతులు రానున్నారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి, పుష్పగిరి మఠం పీఠాధిపతి శంకరాచార్య, విద్యానృసింహ భారతిస్వామి, శ్రీశైల పీఠాధిపతులు చెన్నసిద్ధరామ శివాచార్య స్వామి, మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు, హాల్వి మఠం పీఠాధిపతి అభినవ మహంత మహాస్వాములు పాల్గొంటున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

ఫిబ్రవరి 1: ఉదయం 9:45 గంటలకు వేద పండితులతో ఆలయంలో అఖండ దీపారాధన, గోపూజ, గణపతి పూజ, దీక్షధారణ, త్రిశూల పూజ చేస్తారు. సాయంకాలం 4:30 గంటలకు మృత్సంగ్రహణం, మూలమంత్రహోమం, ధ్వజారోహణం ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. 2న ఉదయం 9 గంటలకు వాస్తు పూజ, హోమం, క్షీరాభిషేకం, జలాధివాసం, సాయంత్రం 4 గంటలకు విగ్రహాలు, రాజగోపురాల కలశాలతో గ్రామంలో భారీ ఊరేగింపు చేపట్టనున్నారు. చివరి రోజు 3న పీఠ పూజ, నవరత్నాన్యాసం, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో ఉదయం 11:59 గంటలకు జీవన్యాసం, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి కల్యాణం వంటి నిర్వహిస్తారు.

# ఇబ్బందులు చూడండయ్యా!




అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద ప్రజలకు ఆరోగ్య సమస్య తలెత్తితే మొదట గుర్తొచ్చేది అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాల్టీ వైద్యశాలలు. ఇవి పేరుకు పెద్దాసుపత్రులైనా రోగులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం 16 నెలలుగా నిర్వహించలేదు. పలు సమస్యల పరిష్కారానికి నోచుకోలేదు. గురువారం సాయంత్రం 3 గంటలకు అనంతపురం సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షతన హెచ్‌డీఎస్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉప ఛైర్మన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, సభ్యులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతోపాటు అధికారులు పాల్గొననున్నారు.

**ఎన్నో వ్యయ ప్రయాసలు..** సర్వజన వైద్యశాలలో క్యాజువాల్టీకి రోజువారి సగటున 300 వరకు రోగులు వస్తున్నారు. పడకలు 20 మాత్రమే ఉన్నాయి. ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురిని ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. క్యాజువాల్టీలో పీడియాట్రిక్, గైనకాలజీ విభాగాల్లో పడకల సంఖ్య పెంచాల్సి ఉంది. పార్కింగ్ లేకపోవటంతో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపి ఉంచటంతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులు విశ్రాంతి తీసుకునేందుకు ఎక్కడా చోటు లేకపోవటంతో ఆవరణలో ఇబ్బంది పడుతూ పడుకుంటున్నారు. రక్తపరీక్షలు వివిధ గదుల్లో నిర్వహిస్తుండటంతో రోగులు నమూనాలు ఇచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని రక్తపరీక్షలు ఒకేచోట నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ రిపోర్టులు ఏ రోజుకు ఆరోజే ఇచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో ఇప్పటివరకు మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో వైద్యులు లేకపోవటంతో ప్రారంభించలేదు. ఎండోక్రైనాలజీ విభాగం ఉన్నప్పటికీ ఐపీ సేవలు అందించడం లేదు. కార్డియాలజీ విభాగంలో స్టంట్లు వేస్తున్నప్పటికీ కొరత ఉంది. బైపాస్ సర్జరీలు చేసేందుకు వైద్యులున్నప్పటికీ అవసరమైన సామగ్రి లేక పెద్ద ఆపరేషన్లు చేయటం లేదు. యూరాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ వైద్యులు రాసే మందులు అందుబాటులో ఉండకపోవటంతో రోగులు ప్రైవేట్ మందుల దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో ఎంఆర్ఐ లేకపోవటంతో సర్వజన వైద్యశాలకు రోగులు వ్యయ ప్రయాసలు కోర్చి వెళ్లాల్సి వస్తోంది. రక్తనిధి కేంద్రం అందుబాటులో లేదు.

## తిరుపతి మురుగంతా చెరువులకు

రేణిగుంట : తిరుపతి నగర పాలక సంస్థ నిర్లక్ష్యం రేణిగుంట మండలానికి శాపంగా పరిణమిస్తోంది. నగరంలోని మురుగు నీరు రేణిగుంట మండలంలోని చెరువుల్లోకి చేరడంతో జలకాలుష్యంతో పాటు ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
తిరుపతి నగరపాలక సంస్థ నుంచి వచ్చే మురుగు, వ్యర్థాల నీటిని శుద్ధి చేసే ప్లాంటును గతంలో తూకివాకం పంచాయతీలో నిర్మించారు. 25 ఏళ్ల కిందట అప్పటి జనాభాకు సరిపడేలా ఏర్పాటు చేశారు. అనంతరం తిరుపతి నగరం విస్తరించడంతో ఈ ప్లాంటు సరిపోవడం లేదు. దీంతో చెన్నయ్యగుంత వద్ద 2017లో శుద్ధి చేసే ప్లాంటు నిర్మాణానికి శ్రీకారం చుట్టినా ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. వైకాపా ప్రభుత్వం పూర్తిగా పక్కన పడేసింది. దీంతో నీరు శుద్ధి కాకుండానే రేణిగుంట మండలంలోని వెంకటాపురం, అన్నస్వామిపల్లె, కరకంబాడి, తిమ్మయ్యగుంత చెరువులకు చేరుతోంది. ఈ చెరువుల



కింద 500 ఎకరాల వరకు ఆయకట్టు రైతులు మురుగు నీటితో అల్లాడుతున్నారు.

**నాలుగు చెరువుల కింద సమస్య**

ఇప్పటి వరకు చెరువులు మాత్రమే మురుగు గుంతలుగా మారిపోవడంతో చేపల వ్యాపారం తగ్గుముఖం పట్టింది. ఈ చెరువుల్లోని చేపలు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఆయకట్టులోని వ్యవసాయ భూములు సైతం నిస్సారంగా మారుతున్నాయి.

**ఉన్నతాధికారుల దృష్టికి..**

చెరువులు కలుషితమవుతున్న విషయం ఇటీవలే గుర్తించాం. ఇక్కడ మురుగునీటి శుద్ధి ప్లాంటును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఈ అంశంపై తమశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.హరి, ఏఈ, ఇరిగేషన్ శాఖ, రేణిగుంట

## రుయా.. వేడినీళ్లు లేవయా..!

తిరుపతి : చలికాలంలో సామాన్యులు సైతం వేడినీళ్లపై ఆధారపడు తారు. స్నానానికి.. తాగడానికి తప్పక వినియోగిస్తారు. అలాంటిది ఆస్పత్రి పడకలపై ఉన్న బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులకు వేడినీళు ఎంతో అవసరం. రుయా, ప్రసూతి ప్రభుత్వ ఆస్పత్రి, చిన్నపిల్లల విభాగాల్లో వేడినీటి సరఫరా లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.
వెయ్యికిపైగా పడకల సామర్థ్యం ఉన్న రుయాలో వేడినీళ్లు పూర్తిగా రోగులకు అందడం లేదు. 80 పడకల సామర్థ్యం ఉన్న పోస్ట్ ఆపరేటివ్ వార్డు, ఏ క్లాస్ గదుల వార్డులో మాత్రమే అప్పుడప్పుడూ వేడినీళ్లు వస్తాయి. ఇటీవల గీజర్లు పనిచేయక అక్కడా వేడినీటి సరఫరా లేదనే విమర్శలున్నాయి. వృద్ధుల వార్డులోనూ వేడినీళ్ల వెసులుబాటు లేదు. చలికాలంలో పడకలపై ఉన్న వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



**చిన్నపిల్లల ఆసుపత్రిలో తాగునీటికీ కటకటే**

చిన్న పిల్లల ఆస్పత్రిలో వేడినీళ్లు కాదు కదా.. తాగునీరు అందని దుస్థితి. కొంతకాలం కిందట మంచినీటి సరఫరా నిమిత్తం కుళాయిలు అమర్చారు. వాటిలోనూ సరఫరా లేకపోయింది. చిన్నారులు, నవజాత శిశువులు ఉండే వార్డుల్లోనూ వేడినీళ్లు సరఫరా చేయడం లేదు. అక్కడున్న క్యాంటీన్‌ను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. ః ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో గీజర్లు ఉన్నా నిర్వహణ సరిగా లేకపోవడంతో వేడినీళ్లు నిరంతరం అందడం లేదు. లేబర్ రూమ్ మినహా మిగిలిన వార్డుల్లో వదలడం లేదనే విమర్శలున్నాయి. తిరుపతి, సమీప ప్రాంతాలకు చెందిన వారు ఆహారం తరహాలో ఇంటి నుంచి వేడినీళ్లు తెచ్చుకొనే పరిస్థితి ఉంది.

**నిర్వహణ లేక పాడైన పరికరాలు**

రుయాకు వచ్చే రోగుల సౌకర్యార్థం కొవిడ్ సమయంలో 500 వరకు గీజర్లు ఏర్పాటు చేశారు. తర్వాత నిర్వహణ విస్మరించడంతో చాలావరకు మూలన పడేశారు. బాలింతలు, చిన్నారులు, వృద్ధుల కోసమైనా గీజర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనిపై ప్రసూతి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి వివరణ కోరగా.. బాలింతలకు వేడినీళ్లు అందజేస్తున్నామని, ఎక్కడైనా రాకుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## తూకాల్లో మాయాజాలం

గుంతకల్లు : రైతులు పండించిన కందులను కొనుగోలు చేసి మేలు చేయాలని కూటమి ప్రభుత్వం భావించగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో తూకాల్లో భారీ మోసాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 12 వరకు తేమ శాతం మించరాదన్న నిబంధన ఉంది. ఇదే అదునుగా భావించి కందుల తేమ శాతంలో వ్యత్యాసాల కారణంగా రైతుల నుంచి 50 కిలోల సంచి తూకం వేసే సమయంలో అదనంగా 100 నుంచి 150 గ్రాముల వరకు అదనంగా తీసుకుంటున్నారు.

**నిబంధనల పేరుతో లాలూచీ**

తూకం వేసేటప్పుడు సంచి తూకం 550 గ్రాములు ఉండగా మార్క్‌ఫెడ్ నిబంధనలు ప్రకారం సంచి తూకం 750 గ్రాములు వస్తుందని 200 గ్రాముల వరకు అదనంగా తేమశాతం చూపి ఒక్కో సంచి బరువు 51.100, లేదా 51.150 బరువు ఉండేలా తీసుకుంటున్నారు. కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 700 క్వింటాళ్ల పట్టినట్లు మార్క్‌ఫెడ్ ప్రతినిధులు తెలిపారు.
కందుల కేంద్ర ప్రారంభించిన రోజు తేమశాతం వ్యత్యాసాలు రాకుండా రైతులు ఇబ్బందులకు గురి కాకుండా ఉండాలనే ఉద్దేశంతో క్వింటాకు 50 గ్రాముల అదనంగా తీసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు. అదికూడా క్వింటాకు తీసుకోమంటే మార్క్‌ఫెడ్ వాళ్లు 50 కిలోలకే 100 నుంచి 150 గ్రాములు అదనంగా తీసుకుంటూ రైతుల్ని మోసం చేస్తున్నారు.దీనిపై మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి వివరణ తీసుకోగా నిబంధనలు ప్రకారం ఒక్కో సంచి 51 కిలోల తూకం మాత్రమే ఉండాలన్నారు. 51 కిలోలకు అదనంగా తీసుకుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

# 'హంద్రీనీవా'కు రాజకీయ గ్రహణం



అనంతపురం : కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న సాగునీటి ప్రాజెక్టుల్లో హంద్రీనీవా ఒకటి. సీమ జిల్లాల తాగు, సాగునీటి ప్రయోజనాలు తీరుస్తోంది. ఈ ప్రాజెక్టు కింద ఉన్న మొత్తం 6 లక్షల ఎకరాల్లో సగానికిపైగా ఉమ్మడి అనంత జిల్లాలోనే ఆయకట్టు ఉంది. ఇంతటి కీలకమైన అనంత హంద్రీనీవా ప్రాజెక్టు (హెచ్ఎన్ఎస్ఎస్) పర్యవేక్షక ఇంజినీరు (ఎస్ఈ) పోస్టు భర్తీకి 'రాజకీయ' గ్రహణం పట్టుకుంది. జలవనరులశాఖలో పనిచేస్తున్న ఓ కీలక అధికారి తన స్వార్థ ప్రయోజనాల కోసం ముఖ్య ప్రజాప్రతినిధులను సైతం మభ్యపెడుతున్నారు. ఆ పోస్టు భర్తీ కాకుండా మోకలడ్డుతున్నారు. సుదీర్ఘకాలంగా అటకెక్కిన ఎస్ఈల పదోన్నతి వ్యవహారాన్ని రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వం చాకచక్యంగా పరిష్కరించింది. ఇందులో భాగంగా ఈనెల 11న రాష్ట్రవ్యాప్తంగా అర్హత కలిగిన 41 మంది ఈఈలకు అడహక్ ఎస్ఈలుగా పదోన్నతి కల్పించింది. ఈ సందర్భంగా ఇక్కడి హంద్రీనీవా ఎస్ఈ పోస్టు తప్పక భర్తీ అవుతుందని అందరూ భావించారు. ఇద్దరు ఈఈలు సైతం తీవ్ర పోటీ పడ్డారు. కానీ.. సదరు కీలక అధికారి తనకున్న పరిచయాలతో ఆ పోస్టు భర్తీ కాకుండా చక్రం తిప్పారన్న చర్చ జోరుగా సాగుతోంది.

**ఆధునికీకరణ పనులపై ప్రభావం**

గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో హంద్రీనీవా, హెచ్చెల్సీ మరమ్మతు, నిర్వహణ కోసం నయాపైసా నిధులు ఇవ్వలేదు. ప్రస్తుత తెదేపా కూటమి ప్రభుత్వం ఆరు నెలలోపే హంద్రీనీవా తొలి దశ ప్రధాన కాలువ విస్తరణ, రెండో దశ, పుంగనూరు ఉప కాలువ (పీబీసీ) లైనింగ్‌తో ఆధునికీకరించే బృహత్తర పనులకు పూనుకుంది. ఇందుకు ఈ మూడింటికీ ఏకంగా రూ.1952.3 కోట్లు మంజూరు చేయడం రికార్డు. ఇప్పటికే టెండర్లు సైతం ఖరారయ్యాయి. తొలి దశ ప్రధాన కాలువ పనులు కూడా సాగుతున్నాయి. నీటి సీజన్ పూర్తికాగానే అటు హెచ్చెల్సీ, ఇటు హంద్రీనీవా పెండింగ్ పనులు పునఃప్రారంభం అవుతాయి. ఈ క్రమంలో కీలక హంద్రీనీవా ఎస్ఈ, ఈఈ పోస్టుల భర్తీ చేయాల్సి ఉంది. లేదంటే రూ.1952.3 కోట్ల అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితి ఉంది.

**ఒకే అధికారికి ఐదు పోస్టులా..!**

జలవనరులశాఖలో హంద్రీనీవా ఎస్ఈ పోస్టు ఒక్కటే కాదు.. కీలక కార్యనిర్వాహక ఇంజినీరు (ఈఈ) పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. అత్యంత దయనీయం ఏమంటే.. ఒక అధికారికి ఏకంగా ఐదు పోస్టుల బాధ్యతలు ఇవ్వడం సంచలనం రేపుతోంది. హెచ్చెల్సీ ఐ (ఇన్విస్టిగేషన్) డివిజన్ ఈఈ రాజాకు అదనంగా నాలుగు పోస్టులు ఇన్‌ఛార్జి ఇవ్వడం ప్రస్తావనార్హం. హంద్రీనీవా ఉప సీఈ, హెచ్చెల్సీ ఉప ఎస్ఈ, డీసీ, లొకలైజేషన్ డివిజన్లను కూడా ఆయనకు అప్పగించారు. హెచ్చెల్సీ గుంతకల్లు, అనంత డివిజన్లకు కూడా ఇన్‌ఛార్జిలే పనిచేస్తున్నారు. హంద్రీనీవాలోనూ డివిజన్-6లో మాత్రమే రెగ్యులర్ ఈఈ ఉన్నారు. డివిజన్-7, పెనుకొండ డివిజన్లకు కూడా ఇన్‌ఛార్జిలే దిక్కుగా మారింది. పదోన్నతి కోసం నిరీక్షించే సీనియర్ డీఈలు పదుల సంఖ్యలో ఉన్నా ఎవరికీ ఈఈ ఇన్‌ఛార్జి ఇవ్వలేదు.

# పట్టాతోనే నెగ్గుకురాలేం!



అనంతపురం :ఒకప్పుడు బీటెక్ పూర్తి చేయగానే సాఫ్ట్‌వేర్, పారిశ్రామిక, నిర్మాణ రంగాల్లో సులువుగా ఉద్యోగాలు వచ్చేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సాఫ్ట్‌వేర్ కుదేలై ఇప్పుడిప్పుడే కోలుకుంది. ఈ సంవత్సరం కొంత మెరుగుపడింది. సాధారణ బీటెక్ పట్టా సరిపోదు. అదనపు పరిజ్ఞానం అవసరం. పారిశ్రామిక రంగంలో ఇంటర్న్‌షిప్ చేయాలి. లేదా బీటెక్ పూర్తి చేసిన వెంటనే స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేయాల్సి ఉంటుంది. బీటెక్‌లో 90 శాతం మార్కులు సాధించినా ఉద్యోగాలు రావు. అదనపు కోర్సులు, నైపుణ్యం ఉంటేనే కొలువులు దక్కుతున్నాయి. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సుకే కాదు. బీటెక్‌లో ఏ విభాగం అయినా పర్వాలేదు. సర్టిఫికెట్ కోర్సులు తప్పనిసరిగా చేసి ఉండాలి. జావా, పైథాన్, పీహెచ్‌పీ, హెచ్‌టీఎంఎల్5, ఒరాకిల్, మ్యాంగోడిబీ, ఎంవైఎస్ క్యూఎల్ వంటి అంశాల్లో ప్రావీణ్యం సంపాదించి ఉండాలి. ఎస్కేయూ, జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ అభ్యసించి, సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేసుకొని ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు కొత్త విషయాలను సూచిస్తున్నారు.

**సంస్థలకు అవసరమైన నైపుణ్యంతోనే - ఇమాముల్ హక్, ఎస్కేయూ**

ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో బీటెక్ పూర్తి చేశాను. గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీస్ సంస్థలో హెచ్ఆర్ లీడ్‌గా పనిచేస్తున్నాను. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు రావడం అంత సులువు కాదు. బీటెక్‌తోపాటు నైపుణ్యాలు అవసరం. స్వల్పకాలిక కోర్సు ద్వారా నైపుణ్యం పెంచుకొన్నందుకు ఉద్యోగం దక్కింది. సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేసే స్థాయిలో ఉన్నాను. జావా, పైథాన్, ఒరాకిల్ కోర్సులు చేయాలి. కళాశాలల్లో ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగం సాధిస్తే ఇబ్బంది లేదు.

**అమ్మాయిలకు ఎన్నో అవకాశాలు - స్నేహాంజలి, ఎస్కేయూ**

నేను ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాను. ఇంజినీరింగ్ చేస్తున్న సమయంలోనే కళాశాల సహకారంతో పైథాన్ కోర్సు చేశాను. హాక్డివా ఉమెన్ కాంటెస్ట్‌లో రాతపరీక్ష, మౌఖిక పరీక్షలో నెగ్గాను. పైథాన్ చేయడం వల్ల ఆ సంస్థ నిర్వహించిన పరీక్షల్లో సులువుగా రాణించాను. ప్రస్తుతం హాక్డివా సంస్థలో ఉద్యోగం చేస్తున్నాను. మహిళలకు మాత్రమే ఉద్యోగాలున్న సంస్థలు కూడా ఉన్నాయి. కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్ చేయడం నేర్చుకొంటే మహిళలు ఉద్యోగాలు సాధించవచ్చు.

**సబ్జెక్టుపై పట్టు సాధించాలి - ఇంతియాజ్, జేఎన్‌టీయూ**

జేఎన్‌టీయూలో మెకానికల్ ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్నాను. ఓ పారిశ్రామిక సంస్థలో ఉద్యోగ అవకాశం వచ్చింది. రూ.6 లక్షల వార్షిక వేతనం ప్రకటించారు. మెకానికల్ ఇంజినీరింగ్‌కు గత సంవత్సరం వరకూ తక్కువ అవకాశాలుండేవి. ఎల్అండ్‌టీ, జిందాల్ పరిశ్రమలు ఉద్యోగాలు కల్పించడానికి ముందుకు వస్తున్నాయి. మెకానికల్ చేసినా, కంప్యూటర్ సైన్స్‌తో సంబంధం ఉన్న సర్టిఫికెట్ కోర్సులు చేయాలి.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత

కదిరి : గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత వైద్యసేవలకు అడ్డంకిగా మారుతోంది. చాలాకేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది పోస్టులు చాలాకాలంగా ఖాళీలు ఉన్నా భర్తీ చేయడంలో జాప్యం జరుగుతోంది. సిబ్బందిని భర్తీ చేస్తేనే సేవలు అందే అవకాశం ఉంది.
శ్రీసత్యసాయి జిల్లాలో 47 ప్రాథమిక, 18 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, నర్సుల కొరత లేదు. 47 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 70 మంది వైద్యులకుగాను 68 మంది ఉన్నారు. రెండు ఖాళీలున్నాయి. స్టాఫ్‌నర్సులు 126 మందికిగాను 113 మంది, ల్యాబ్ టెక్నీషియన్స్ 47 కిగాను 41 మంది పనిచేస్తున్నారు. మలేరియా విభాగంలో 27 ల్యాబ్ టెక్నీషియన్స్‌కుగాను 27, ఫార్మసిస్టు పోస్టులు 45కిగాను 5 ఖాళీగా ఉన్నాయి. ఎంఎల్‌హెచ్‌పీలు 3, ఏఎన్ఎంలు 2, ఆశా కార్యకర్తలు 37, ఎల్‌జీఎస్ 4 చొప్పున పోస్టులు జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్నాయి.

**రోజూ 50 నుంచి 60 మంది రోగులు**

ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సరిపడా లేకపోవడంతో వివిధ రోగాలతో ఆసుపత్రులకు వస్తున్న రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోజూ 50 నుంచి 80 మంది వరకు సీజనల్ వ్యాధులతో పాటు మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో బాధపడే రోగులు, గర్భిణులు వస్తుంటారు. వీరికి సక్రమంగా సేవలు అందడం లేదు.

**సిబ్బందిపై ఒత్తిడి**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఆ భారం ఇతర సిబ్బందిపై పడుతోంది. పోస్టులు ఖాళీ ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో, వైద్యులు, నర్సులు సెలవులో ఉన్న సమయాల్లో మిగిలిన సిబ్బంది 12 గంటలపాటు పనిచేయాల్సిన పరిస్థితి. దీంతో వైద్య



సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది. దీంతో సిబ్బంది ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతోంది.

**ప్రైవేట్ ల్యాబ్‌లే దిక్కు : ఆనంద్‌బాబు, తలుపుల**

తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పదిహేనేళ్లుగా ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు అందుబాటులో లేనికారణంగా రోగులు సొంతంగా ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోంది.

**ఖాళీల భర్తీకి చర్యలు : ఫైరోజా బేగం, జిల్లా వైద్యాధికారిణి**

జిల్లావ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది పోస్టుల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. సిబ్బందిని నియమించి ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్యసేవలు పూరిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటాం.

## స్మార్ట్‌గా నడుపుదాం.. ఇక కొత్త కార్డుల జారీ

పుత్తూరు : పుత్తూరుకు చెందిన వ్యక్తి ఒకరు ఏడాదిన్నర కిందట కారు కొన్నారు. అప్పటి నుంచి ఆర్‌సీ రాలేదు. ఆయన పక్క రాష్ట్రానికి వెళ్లినపుడు పోలీసులు ఆర్‌సీ అడగ్గా తన వద్ద ఉన్న డిజిటల్ పత్రాన్ని చూపారు. ఒరిజినల్ కార్డు లేకుంటే చలానా చెల్లించాలని చెప్పడంతో అవాక్కయ్యాడు. విధిలేని పరిస్థితుల్లో అపరాధ రుసుము చెల్లించారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్(ఆర్‌సీ), డ్రైవింగ్ లైసెన్స్(డీఎల్)లు తీసుకునే వారికి కూటమి ప్రభుత్వం మంచి వార్త చెప్పింది. వైకాపా హయాంలో నిలిపేసిన స్మార్ట్ కార్డులు మళ్లీ అందజేయాలని నిర్ణయం తీసుకోవడంతో వాహన చోదకుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. లైసెన్సులు పొందిన చోదకులు సదరు కార్డులు పొందేందుకు అర్హులని పేర్కొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేల సంఖ్యలో త్వరలో కార్డులు జారీ చేయనున్నారు.

**రెండేళ్లుగా కార్డులు ఇవ్వక..** వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందాలంటే ఆర్టీవో కార్యాలయంలో వాహన చోదక పరీక్షల్లో ఉ




త్తీర్ణత సాధించాలి. వైకాపా హయాంలో రెండేళ్లుగా డ్రైవింగ్ వాహనా రిజిస్ట్రేషన్ కార్డుల జారీ నిలిపేసింది. వాటికి బదులుగా ఆన్‌లైన్ ద్వారా లైసెన్స్ చూసుకోవచ్చని చెప్పింది. ఈ నిబంధనలు వాహన చోదకులకు ఇబ్బందిగా మారాయి. ప్రమాదాలు జరిగినపుడు బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఇబ్బందులు ఎదుర్కొనేవారు.


**రూ.235 చెల్లిస్తే పోస్టు ద్వారా..** డీఎల్, ఆర్‌సీలకు మళ్లీ స్మార్ట్‌కార్డులు అందజేయనున్న నేపథ్యంలో రవాణాశాఖ నిర్వహించే ఈ-ప్రగతి పరివాహన్ పోర్టల్‌లో నమోదు అవకాశం కల్పించారు. కార్డు ఫీజు రూ.200, పోస్టు ద్వారా పంపడానికి రూ.32, ఇతరత్రా కలిపి రూ.235 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. గతంలో డబ్బులు చెల్లించినా కార్డులు రాలేదని, ఇప్పుడు టెండర్ల ప్రక్రియ నిర్వహించకుండా ఫీజు వసూలు చేయడంపై వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వైకాపా హయాంలో వాహనదారుల నుంచి వసూలు చేసిన సొమ్ము గుత్తేదారుకు ఇవ్వకపోవడంతో సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కచ్చితంగా కార్డులు వచ్చేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

**రుసుము చెల్లిస్తే కార్డులు వస్తాయి..**

ప్రభుత్వం వాహన చోదకులకు డీఎల్ కార్డుల జారీకి ఉత్తర్వులు ఇచ్చింది. రుసుం చెల్లించిన వాహన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు కార్డులు పొందే అవకాశం కల్పించింది. కార్డులు ముద్రణ పూర్తయింది. రుసుం చెల్లించిన వెంటనే కార్డులు తపాలాలో పంపుతున్నారు.చంద్రశేఖర్, మోటారు వాహనాల తనిఖీ అధికారి, పుత్తూరు

## కుప్పంలో అక్రమాలకు ఉపాధి

కుప్పం : వైకాపా హయాంలో 2019 నుంచి 2024 వరకు కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉపాధి హామీ ద్వారా రూ.236 కోట్లు ఖర్చు చేశారు. ఐదేళ్లకు సంబంధించి.. రామకుప్పం మండలంలో అత్యధికంగా రూ.72.65 కోట్లు, కుప్పంలో రూ.63.56 కోట్లు, శాంతిపురంలో రూ.60 కోట్లు, గుడుపల్లెలో రూ.49.80 కోట్లు వ్యయం చేశారు.పులివెందుల తరహాలో కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని వైకాపా హయాంలో సాక్షాత్తు నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గొప్పలు చెప్పారు. ప్రగతి పనులు అటుంచి



అక్రమంగా ఆరగించడంలో మాత్రం దూసుకెళ్లారని తేటతెల్లమవుతోంది. ఈ నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంలో నిధుల వ్యయంపై జరుగుతున్న విజిలెన్స్ విచారణలో ఈ విషయమే స్పష్టమవుతోంది. స్థానిక తెదేపా నేతలు కూటమి ప్రభుత్వానికి లేఖ రాయగా విచారిస్తున్న అధికారులకు ఈ విషయమే వెల్లడవుతోంది.

**కొవిడ్ సమయంలో అత్యధికంగా..**

ప్రజలను గడగడలాడించిన కరోనా మహమ్మారి (కొవిడ్) కాలంలోనే అత్యధికంగా ఉపాధి నిధులు ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కరోనా తీవ్రతతో జనం చాలా వరకు ఇళ్లకే పరిమితమైన 2020-21 ఆర్థిక సంవత్సరంలో.. నాలుగు మండలాలకు రూ.68.78 కోట్లు ఖర్చు చేశారు. రామకుప్పం మండలంలో రూ.20.15 కోట్లు, కుప్పంలో రూ.16.79, రామకుప్పంలో రూ.19.12, గుడుపల్లెలో రూ. 12.72 కోట్లను ఉపాధి పనులకు వెచ్చించారు. కొవిడ్ భయాందోళనతో కూలీలు చాలా వరకు ఉపాధి పనులకు వెళ్లలేదు. ప్రభుత్వ కార్యాలయాలు సైతం మూతపడిన విషయం తెలిసిందే.

**అధికారం అండతో అక్రమాలకు తెరతీసి..**

కరోనా కాలాన్ని సద్వినియోగం చేసుకున్న అక్రమార్కులు ఉపాధిలో అక్రమాలకు తెరతీసినట్లు స్పష్టమవుతోంది. నాలుగేళ్లకు గాను రూ.167 కోట్లు ఖర్చు చేయగా.. కరోనా ఏడాదిలో రూ.68.78 కోట్లు వ్యయం చేసినట్లు గణాంకాలు ఉండటంతో అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో అధికారం అండతోనే సామాజిక తనిఖీలను తూతూమంత్రంగా ముగించినట్లు స్పష్టమవుతోంది.

**విజిలెన్స్ అధికారుల ఆరా**

తిరుపతికి చెందిన విజిలెన్స్ అధికారుల బృందం బుధవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటించి ఉపాధి నిధుల వ్యయం వివరాలు సేకరించారు. నెలన్నర కిందట మండల ప్రజాపరిషత్తు, ఉపాధి కార్యాలయాల్లో వీరు రహస్యంగా వివరాలు తీసుకెళ్లగా.. తాజాగా మరోదఫా సేకరించారు. త్వరలోనే సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

చురకలు



# ఎర్ర కోకలో జిల్లనిపించిన ఎల్లీ

ఎల్లి అవ్రామ్ పరిచయం అవసరం లేదు. సోషల్ మీడియాల్లో నిరంతరం వేడెక్కించడం ఈ అమ్మడి హ్యాబిట్. అందమైన బికినీలు మోనోకినీల్లో ట్రీటిచ్చే ఎల్లీ ఈసారి పద్ధతిగా చీరకట్టులో కనిపించింది. ఎల్లీ రెడ్ హాలి శారీలో ముగ్ధమనోహరిని తలపిస్తోంది. ది చెర్రీ ఆన్ ది కేక్ లాగా అనిపించింది అంటూ ఎల్లీ ఈ ఫోటోషూట్ కి ట్యాగ్ ని ఇచ్చింది. అలాగే మరాఠీ ఇండస్ట్రీలో తన తొలి అవార్డును అందుకున్న సందర్భంగా ఈ భామ ఉబ్బితబ్బిబ్బయింది. నేను 12 సంవత్సరాల క్రితం బాలీవుడ్ డ్రీమ్‌తో ముంబైకి వెళ్లినప్పుడు, ఒక రోజు నేను మరాఠీ సినిమాలో కూడా నటిస్తానని, మరాఠీలో మాట్లాడతానని, డబ్బింగ్ చెబుతానని, తర్వాత దానికి గుర్తింపు లభిస్తుందని నాకు తెలియదు. చాలా కృతజ్ఞతగా ఉన్నాను అని ఎల్లీ చెప్పింది. ధన్యవాదాలు ముంబై మేరీ జాన్! అని కూడా అభిమానం చాటుకుంది. మరాఠీలో డెబ్యూ నటిగా రేడియో సిటీ ముంబై ఐకానిక్



అవార్డుకు ఎంపికైనందున కృతజ్ఞతతో ఎల్లీ ఇలా తన ఆనందం వ్యక్తం చేసింది. చెర్రీ అంటే ఆనందం .. నేను ఆ చిన్న చిరునవ్వును చూసినప్పుడు వావ్ అనిపిస్తుంది..చాలా అందంగా ఉంది పారో! అంటూ ఒక అభిమాని ఎల్లీపై ప్రేమను కురిపించాడు. తాజా లుక్ పై వ్యాఖ్యానిస్తూ.. ఎల్లీ చంపుతోంది.. మరిగిస్తోంది! అంటూ ఒక అభిమాని ఒకరు దీనిపై వ్యాఖ్యానించారు. మరికొందరు కామెంట్స్ విభాగంలో ఫైర్- హార్ట్ ఎమోజీలను షేర్ చేసారు. ప్రస్తుతం ఈ ఫోటోలు వేగంగా యువతరంలో షేర్ అవుతున్నాయి. కిస్ కిస్కో ప్యార్ కరూన్, గణపత్, గుడ్ బై, మలంగ్, కోయి జానే నా.. లాంటి చిత్రాల్లో నటించింది ఎల్లీ అవ్‌రామ్. ఆమె సల్మాన్ ఖాన్ వివాదాస్పద రియాలిటీ షో బిగ్ బాస్ 13లో కూడా పాల్గొంది. గత సంవత్సరం, ఎల్లి అవ్రామ్ హౌటర్‌ఫ్లైకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కన్యత్వానికి సంబంధించిన విషయాలను మాట్లాడి, సినీఇండస్ట్రీలో తన అనుభవాలను గురించి ఓపెనైంది. పరిశ్రమలోని ఒక వ్యక్తిని కలిసినప్పుడు.. అతడు తన కన్యత్వం గురించి నిర్మొహమాటంగా అడిగిన సంఘటన గురించి ఎల్లీ వెల్లడించింది. ఎల్లీ విదేశీ వనిత కాబట్టి తనతో పడక సుఖం పంచుకోవడం సులభం! అని అతడు భావించాడని కూడా చెప్పింది. ఈ వ్యాఖ్యలతో తాను ఎంతగా అవమానానికి గురైందో తెలిపింది. పరిశ్రమలో తన దశాబ్దపు కెరీర్‌లో తాను ఎదుర్కొన్న చాలా విషయాలను ఎల్లీ బహిరంగంగా బయటపెట్టింది.

## మహేష్ ఫ్యాన్స్‌కి బిగ్ గుడ్ న్యూస్..!

మహేష్ బాబు గత ఏడాది సంక్రాంతికి 'గుంటూరు కారం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఏడాది పాటు ప్రీ ప్రొడక్షన్ వర్క్ తర్వాత ఇటీవల రాజమౌళి దర్శకత్వంలో సినిమా షూటింగ్‌కి జాయిన్ అయ్యాడు. హైదరాబాద్‌లో ఒక షెడ్యూల్‌ను పూర్తి చేసిన రాజమౌళి ఇటీవలే ఒడిశాలో రెండో షెడ్యూల్‌ను పూర్తి చేశాడు. మహేష్ బాబు నటిస్తున్న ఈ సినిమాను రాజమౌళి ఎప్పుడు విడుదల చేసేది క్లారిటీ లేదు. కానీ రాజమౌళి గత సినిమాలకు తీసుకున్న టైమ్‌ను చూస్తే మహేష్ బాబు సినిమాకు కూడా కనీసం రెండేళ్లు మేకింగ్‌కు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. అంటే సినిమా కచ్చితంగా 2026 చివర్లో లేదా 2027 లో విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. రాజమౌళి సినిమా కోసం మహేష్ బాబు ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ గ్యాప్ లో మహేష్ బాబు పాత సినిమాలను రీ రిలీజ్ చేస్తున్నారు. అంతే కాకుండా మహేష్ బాబు డబ్బింగ్ చెప్పిన ముఫాసా : ది లయన్ కింగ్ సినిమాను ఆస్వాదిస్తున్నారు. మహేష్ బాబు డబ్బింగ్ చెప్పిన ముఫాసా సినిమాకు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున కటౌట్లు ఏర్పాటు చేసిన విషయం తెల్సిందే. ముఫాసా సినిమాకు తెలుగులో మహేష్ బాబు క్రేజ్ కారణంగా మంచి



స్పందన దక్కింది. భారీ వసూళ్లు సాధించిన సినిమాగా ముఫాసా హాలీవుడ్ సినిమాల సరసన నిలిచింది. థియేట్రికల్ రిలీజ్‌లో హిట్ అయిన ముఫాసాను ఎప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ చేస్తారా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముఫాసా సినిమాను ఎట్టకేలకు ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. జియో హాట్‌స్టార్‌లో ఈ సినిమాను అన్ని భాషల్లో అందుబాటులో ఉంచారు. తెలుగులో మహేష్ బాబు డబ్బింగ్ చెప్పిన వర్షన్‌ను సైతం జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ చేస్తున్న నేపథ్యంలో అత్యధిక వ్యూస్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. మహేష్ బాబు అభిమానులు ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తెలుగు ఓటీటీ ప్రేక్షకులు ముఫాసా : ది లయన్ కింగ్‌కి బ్రహ్మరథం పట్టే అవకాశాలు ఉన్నాయి. బారీ జెంకిన్స్ దర్శకత్వం వహించిన ఈ యానిమేషన్ సినిమా అంతర్జాతీయ స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకుంది. హాలీవుడ్ యాక్షన్ సినిమాల స్థాయిలో ప్రపంచ వ్యాప్తంగా వసూళ్లు రాబట్టింది. విడుదలైన మూడు నెలలుగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా వసూళు రాబడుతూనే ఉంది. తెలుగులో ఈ సినిమాకు మహేష్ బాబు మాత్రమే కాకుండా బ్రహ్మానందం, అలీ, సత్యదేవ్, అయ్యప్ప శర్మ వంటి ప్రముఖులు సైతం డబ్బింగ్ చెప్పారు. అందుకే తెలుగు సినిమా స్థాయిలో ఈ సినిమాకు క్రేజ్ ఉంది.





# ప్రగ్య అండ్ గ్యాంగ్‌తో పార్టీలో షాడో మ్యాన్!



నీటిలో పడవ (మర బోట్) ప్రయాణిస్తోంది. ఆ పడవలోనే అసలు తతంగం అంతా. మంచు లక్ష్మీ- ప్రగ్య జైశ్వాల్ - సీరత్ కపూర్ .. స్నేహితురాళ్ల హంగామా మామూలుగా లేదు. పార్టీ పీక్స్ లో మొదలైంది. అయితే ఈ పార్టీలో టాలీవుడ్ నుంచి ఒక యంగ్ హీరో కూడా ప్రత్యక్షమయ్యాడు. ఇంతకీ ఎవరు ఆ యంగ్ హీరో? అంటే డీటెయిల్స్ లోకి వెళ్లాలి. ప్రస్తుతం మంచు లక్ష్మి- ప్రగ్య జైశ్వాల్ ముంబై సర్కిల్స్ లో ఎక్కువగా కనిపిస్తున్న సంగతి తెలిసిందే. వీరంతా అక్కడ సెలబ్రేషన్ మోడ్ లో ఉన్నారు. ఇంతలోనే ఇప్పుడు యువహీరో నవదీప్ ఈ బృందంతో కనిపించాడు. ప్రగ్య జైశ్వాల్ అండ్ టీమ్ తో కలిసి అతడు ఫోజులివ్వగా అవన్నీ వైరల్ గా మారుతున్నాయి. అల్లరి బృందం ఇలా ఓచోట కలిసింది అంటే దీని వెనక చాలా అర్థం ఉంది. వీరంతా ఇప్పుడు ఒక ప్రాజెక్ట్ కోసం కలిసారా? అని ఆరాలు మొదలయ్యాయి. అయితే ప్రగ్య జైశ్వాల్ తాజాగా ఇన్ స్టాలో గ్రూప్ ఫోటోగ్రాఫ్ ని షేర్ చేసి నవదీప్ తదుపరి ప్రాజెక్ట్ కి ఆల్ ది బెస్ట్ చెప్పింది. ఈ ఫోటోగ్రాఫ్ లో నవదీప్ - సీరత్ కపూర్ కూడా కనిపిస్తున్నారు. ఈ జంట కలిసి నటిస్తున్నారా లేదా? అన్ని చూడాలి. ప్రగ్య జైశ్వాల్ యూనిక్ ఫోటోగ్రాఫ్స్ ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. యాచ్ పార్టీలో వారి సాన్నిహిత్యం అందరి దృష్టిని ఆకర్షించింది.

# 3ని.ల అతిథి పాత్ర కోసం వార్నర్ పారితోషికం?



తెలుగు సినిమాలను ఫాలో చేసే ఆస్ట్రేలియన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ కి తెలుగు రాష్ట్రాలు సహా భారతదేశంలో భారీగా ఫాలోవర్స్ ఉన్న సంగతి తెలిసిందే. పుష్ప, సరిలేరు నీకెవ్వరు వంటి చిత్రాల నుండి ఐకానిక్ డ్యాన్స్ మూవ్స్ తో అతడు భారీ ఫాలోయింగ్ పెంచుకున్నాడు. అతడు ఇప్పుడు %-%రాబిన్‌హుడ్%-% అనే తెలుగు చిత్రంలో అతిథి పాత్రలో నటిస్తున్నాడు. యూత్ స్టార్ నితిన్- శ్రీలీల జంటగా నటిస్తున్న రాబిన్ హుడ్ లో వార్నర్ అతిథి పాత్రలో నటించారు. కేవలం 3-5 నిమిషాల నిడివి ఉన్న అతిథి పాత్రలో అతడు కనిపిస్తాడు. అయితే ఈ పాత్రలో నటించినందుకు వార్నర్ రూ. 2.5 కోట్లు అందుకుంటున్నారని సమాచారం. అదనంగా అతడి ప్రమోషన్స్ కోసం మరో 1కోటి ఖర్చు చేయనున్నారట. ఆసక్తికరంగా గత సంవత్సరం ఐపిఎల్ సమయంలో అతడు తన షూటింగ్ పార్ట్ పూర్తి చేసాడు. ఈ చిత్రంలో తన పాత్ర కోసం రెండు రోజులు షూటింగ్ చేశాడని కూడా కథనాలొచ్చాయి. ఇటీవల ఈ రాబరీ యాక్షన్ కామెడీ చిత్రం ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు వార్నర్ హాజరయ్యాడు. ఈ వేదికపై వార్నర్ గురించి రాజేంద్ర ప్రసాద్ చేసిన వ్యాఖ్య కాస్త ఘాటుగా హాస్యాస్పదంగా ఉండటంతో ఆన్‌లైన్‌లో విమర్శలు వచ్చాయి. అయితే దర్శకుడు వెంకీ కుడుముల అది ఒక జోక్ అని స్పష్టం చేశారు. చివరికి రాజేంద్ర ప్రసాద్ సారీ కూడా చెప్పాల్సి వచ్చింది. క్రికెట్‌లో స్లెడ్జింగ్ చూశాను - ఇది సరదాగా అనిపించింది అని వార్నర్ నిశ్చేష్టుడై అన్నాడు. ప్రీరిలీజ్ వేదికపై తన ఫాలోవర్స్ కి వార్నర్ కృతజ్ఞతలు తెలిపారు. క్రికెట్ నుండి నటనకు మారడం అంటే భయపడినా కానీ, ఈ చిత్రంలో భాగం కావడం తనకు గౌరవంగా అనిపించిందని అన్నారు. కథానుసారం.. రామ్ (నితిన్) నీరా (శ్రీలీల) కోసం దొంగగా మారిన మాస్టర్ బాడీగార్డ్ కథేమిటో తెరపై చూడాలి. షైన్ టామ్ చాకో, రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్నారు. వార్నర్ అతిథి పాత్రలలో కనిపిస్తారు. ఆదివారం హైదరాబాద్‌లో తన తొలి తెలుగు చిత్రం రాబిన్‌హుడ్ ట్రైలర్ లాంచ్ సందర్భంగా డేవిడ్ వార్నర్ అల్లు అర్జున్ పుష్ప: ది రైజ్ (2021)లోని హిట్ పాట శ్రీవల్లికి.. ఐకానిక్ హుక్ స్టెప్‌ను రీక్రియేట్ చేసాడు. మూడు నిమిషాల పాత్ర కోసం ఏకంగా 3 కోట్లు లాగేస్తున్నాడంటే అందరూ నోరెళ్లబెడుతున్నారు. కానీ వార్నర్ కి ఉన్న ఫాలోయింగ్ దృష్ట్యా ఇది న్యాయబద్ధమైనది అని కూడా అభిమానులు సమర్థిస్తున్నారు.

# నటనతో కాదు భంగిమలతో బుక్ చేస్తోంది

సాక్షి మాలిక్ పరిచయం అవసరం లేదు. నటి కం మోడల్. బికినీ బీచ్ ట్రీట్‌తో నిరంతరం కుర్రకారు గుండెల్లో గుబులు పుట్టించడం ఈ అమ్మడి ప్రత్యేకత. మ్యూజిక్ వీడియోలు, మోడలింగ్ అసైన్ మెంట్స్ తో పాపులారిటీ పెంచుకున్న సాక్షి కార్తీక్ ఆర్యన్ నటించిన సోను కే టిటు కి స్వీటీలో బోమ్ డిగ్గీ డిగ్గీ... పాటలో మెరుపులు మెరిపించింది. ఈ సినిమా తర్వాత అమ్మడికి బాలీవుడ్ లో భారీ అవకాశాలొస్తాయని భావించినా అంతగా ఛాన్సులైతే లేవు. మరోవైపు సాక్షి సోషల్ మీడియాల్లో జోరు ప్రదర్శిస్తోంది. లక్షలాదిగా ఉన్న ఇన్ స్టా ఫాలోవర్స్ కి నిరంతర ట్రీట్ ఇవ్వడంలో ఎక్కడా వెనక్కి తగ్గదు. తాజాగా బంతాటతో గుబులు పుట్టిస్తోంది. కొత్త అబ్సెషన్ ఎపాడిల్‌బాల్ అంటూ బ్యాట్ బాల్ ఈమోజీలను షేర్ చేసింది.

ఈ ఆట బంతితో కాదు కుర్రాళ్ల గుండెలతో! అంటూ అబ్బాయిలు మరిగిపోతున్నారు. సమ్మర్ సీజన్ లో ఇలాంటి కొత్త ఆట



మొదలు పెట్టిందేమిటీ? అంటూ కొందరు ఆకతాయిగా ప్రశ్నిస్తున్నారు. సాక్షి బంతి పై విరుచుకుపడుతూనే రకరకాల భంగిమల్లో ఫోజులివ్వగా అవన్నీ వైరల్ గా మారాయి. సాక్షి మాలిక్ వేడిగా ఉందంటూ కామెంట్లు వినిపిస్తున్నాయ్. కొందరు భంగిమలతో కాదు నటనతో నిరూపించు అంటూ సజెస్ట్ చేస్తున్నారు. ఈ ముంబై బ్యూటీ టాప్ మోడల్ గా టీవీ కమర్షియల్స్ తోను ప్రజలకు సుపరిచితం. సాక్షి మాలిక్ ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జన్మించింది. నోయిడాలోని జేపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీని పూర్తి చేసింది. కళాశాల సమయంలో ఆమె ఫ్యాషన్ షోలలో హీటెక్కించింది. గ్రాడ్యుయేషన్ తర్వాత, సాక్షి మాలిక్ ముంబైకి వెళ్ళింది. నైకా, పిసి జ్యువెలర్‌తో సహా బ్రాండ్‌ల టెలివిజన్ వాణిజ్య ప్రకటనల కోసం మోడలింగ్ చేసింది.. 2018లో సోను కే టిటు కి స్వీటీ లో నటిగా బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. 2020లో వేహం.. 2023లో ములాఖత్ అనే ఆల్బమ్స్‌లో కనిపించింది. సాక్షి తదుపరి పెద్ద అవకాశం కోసం వేచి చూస్తోంది. కానీ ఆ ఒక్క ఛాన్స్ తనకు ఇంకా రాలేదు.

# ఐటం పాటల్లో శ్రీలీల.. కిసిక్ బ్యూటీ కండీషన్ అప్లై!

కిసిక్ పాటతో శ్రీలీల పాన్ ఇండియాలో ఎంత ఫేమస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. ఒక్క పాట అమ్మడిని రాత్రికి రాత్రే ఫేమస్ చేసింది. ఎంతో మంది భామలున్నా ఆ ఛాన్స్ సుకుమార్ కేవలం శ్రీలకు మాత్రమే ఇచ్చాడు. అమ్మడు కూడా ఆ నమ్మకాన్ని అంతే నిలబెట్టుకుంది. మాస్ అప్పిరియన్స్ తో కుర్రాకారు హృదయాలు దోచేసింది. కిసిక్ లాంటి పాటలు చేయాలంటే? అది శ్రీలీలతో మాత్రమే సాధ్యమవుతుందని ఒక్క పాటతోనే పాన్ ఇండియాకి చాటి చెప్పింది. పుష్ప-2తో అంతటి సంచలనాన్ని నమోదు చేసింది. అయితే ఆ పాట తర్వాత చాలా మంది తనని ఐటం పాటల్లో నటించమని అడిగారుట. అడిగినంత పారితోషికం చెల్లించడానికి రెడీగా ఉన్నారంది



శ్రీలీల. తాను ఎస్ చెప్పాలే గానీ కోట్ల రూపాయలు తన అకౌంట్ లో జమ అవుతాయని తెలిపింది. కానీ వచ్చిన చాలా అవకాశాలు ఇష్టం లేక వదులుకున్నానంది. కేవలం కొన్ని సినిమాల్లో మాత్రమే అలాంటి పాటల్లో నర్తిస్తానని...డబ్బులిస్తారని ఏ సినిమా పడితే ఆ సినిమాలో అలాంటి పాటల్లో నటించనని తెగేసి చెప్పిందిట. ఐటం పాటల్లో నటించిన తనకంటూ కొన్ని కండీషన్లు ఉన్నాయని...వాటికి లోబడే పని చేస్తానని తెలిపింది. జాతీయ స్థాయి చిత్రాల్లో నటించాలనే ఆశను వ్యక్తం చేసింది. అలాంటి సినిమా అవకాశాలు వస్తే వదులుకోనని తెలిపింది. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగు అమ్మాయిగా తనని గుర్తిస్తున్నారంది. ఇతర భాషల్లో అవకాశాలు వచ్చినంత మాత్రాన తెలుగు సినిమాలకు దూరమవుతానని అనుకోవద్దు. తన మొదటి ప్రాధాన్యత తెలుగు సినిమాలకేనని తెలిపింది. తెలుగులో పాటు ఇతర భాషల అవకాశాల్ని బ్యాలెన్స్ చేస్తూ కెరీర్ లో ముందు కెళ్తానని స్పష్టం చేసింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536